సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 265
శనివారం 8-6-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


అలకరాజ్ అదరహో
తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్‌లోకి.. సెమీస్‌లో సినెర్‌పై గెలుపు - 13లో


ఆర్థికాభివృద్ధే లక్ష్యం
ప్రస్తుతానికి యథాతథ ద్రవ్య విధానం
కీలక రుణ రేటు యథాతథం - 13లో


రాహుల్ గాంధీకి బెయిల్
కర్ణాటక బీజేపీ ఫిర్యాదు మేరకు నమోదైన పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెంగళూరు ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది.
వివరాలు 6లో ▸


ఐఎస్ఎస్‌లోకి సునీత
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీత విలియమ్స్ అడుగుపెట్టారు.
వివరాలు 6లో ▸


రష్యా నదిలో విద్యార్థుల మునక
రష్యాలో చదువుకుంటున్న నలుగురు భారతీయ వైద్య విద్యార్థులు వోల్ఖోవ్ నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸


కుల్విందర్‌కు మద్దతుగా ర్యాలీ
ఎంపీ కంగనాను చెంపదెబ్బ కొట్టిన కుల్విందర్‌కు న్యాయం చేయాలని 9న పంజాబ్‌లో రైతు సంఘాలు 'ర్యాలీ' నిర్వహించనున్నాయి.
వివరాలు 6లో ▸

పదేళ్ల పాలన ట్రైలరే

దేశాభివృద్ధికి మరింత శ్రమిస్తాం: నరేంద్ర మోదీ


ప్రధానిగా తనను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందించిన లేఖను మీడియాకు చూపుతున్న మోదీ

- ఎన్డీఏ.. న్యూ, డెవలప్డ్, ఆస్పిరేషనల్ ఇండియా
- దేశ హితమే మా కూటమి ఏకైక లక్ష్యం
- అతిబలమైన, విజయవంతమైన సంకీర్ణం
- అధికార దాహంతోనే విపక్షాల కలయిక
- ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్నే పోగొట్టజూశారు.. ఇండియా కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను ఉద్దేశించి ప్రసంగం

6లో

రేపే మోదీ ప్రమాణం

- సాయంత్రం 6 గంటలకు ముహూర్తం.. ఎన్డీఏపీపీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అనంతరం రాష్ట్రపతిని కలిసిన మోదీ.. ప్రధానిగా నియమిస్తూ ముర్ము నిర్ణయం
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం

"ప్రజలు మాకు స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. తద్వారా ప్రభుత్వాన్ని నడిపే సదవకాశమిచ్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటామని, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పథంలో నడుపుతామని దేశ ప్రజలందరికీ మాటిస్తున్నా. - మోదీ


కొత్త సీఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ బాధ్యతలు

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ప్రస్తుత సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేస్తూ నీరబ్‌కుమార్‌ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్ర సచివాలయంలో సీఎస్ చాంబర్ టీటీడీ వేద పండితులు, విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల
మిగతా 2వ పేజీలో ▶

కుర్చీలపై కన్ను!



- టీడీపీ నుంచి భారీగా ఆశావహులు
- జనసేనకు 5, బీజేపీకి 2 పదవులు.. తమకూ అవకాశం ఇవ్వాలంటున్న కొత్త ఎమ్మెల్యేలు
- కత్తిమీద సాములా మంత్రివర్గ కూర్పు

14లో

15న లోక్‌సభ తొలిభేటీ!

- 18వ లోక్‌సభ తొలి సమావేశం ఈనెల 15వ తేదీన ప్రారంభం కావొచ్చని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. జూన్ మూడో వారంలో లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయని, తొలి రెండు రోజులు నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం. ఆ తర్వాత స్పీకర్‌ను ఎన్నుకుంటారు.

6లో

ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా?

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న టీడీపీ దాడులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఆస్తులే లక్ష్యంగా విధ్వంసం

పోలీసుల సమక్షంలోనే బెదిరింపులు, దాడులు, ఆస్తుల ధ్వంసం

2లో

- నిస్తేజంగా పోలీసు యంత్రాంగం; పరోక్షంగా రెచ్చగొడుతున్న చంద్రబాబు
- వైసీపీ కవ్వింపులపై టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలంటూ ట్వీట్
- తాను ప్రమాణ స్వీకారం చేసేదాకా ఇవి కొనసాగించాలని పరోక్ష సంకేతాలు


టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి

రాష్ట్రంలో కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు



- చంద్రబాబు కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు
- టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- బాధితులకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా

2లో

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు దారుణం

14లో

గెలుపోటములు సర్వసాధారణం
రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

తాబేళ్లు సముద్ర జీవకోటి మనుగడకు ఎంతో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సముద్రంలోని బండరాళ్లపై ఉన్న నాచుని తినడం వల్ల మత్స్యసంపద వృద్ధి చెందుతుందని చెబుతున్నారు. అలాగే మత్స్యసంపదకు సింహస్వప్నంగా తయారైన జెల్లీ ఫిష్‌లాంటివాటిని సంహరించడానికి దోహదపడుతాయని, సముద్ర జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చని పేర్కొంటున్నారు. అయితే వీటి మాంసానికి ఉన్న డిమాండ్ కారణంగా విచ్చలవిడిగా సంహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఒక్కరూ తాబేళ్లను సంరక్షించాలని పిలుపునిస్తున్నారు. ఇందులో భాగంగానే అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు సముద్ర తీర ప్రాంతాల్లో హేచరీలు ఏర్పాటు చేసి తాబేలు గుడ్లు పొదిగిన తర్వాత పిల్లలను సముద్రంలోకి వదులుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తాబేళ్ల సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు.

తాబేమేలు!

- ▸▸ తాబేళ్లతో సముద్ర జలాల్లో సమతుల్యత
- ▸▸ జీవవైవిధ్యానికి ఎంతో మేలు
- ▸▸ నానాటికీ అంతరించిపోతున్న కచ్ఛపములు..
- ▸▸ సంరక్షణ బాధ్యత తీసుకున్న అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు



తాబేళ్లు.. ఎన్నో మేళ్లు!

- సముద్రంలో జీవించే తాబేళ్ల కదలికల వల్ల పర్యావరణంలో సమతుల్యత దెబ్బ తినకుండా ఉంటుంది.
- మత్స్యసంపదకు సింహస్వప్నమైన జెల్లీ ఫిష్‌లను నివారిస్తాయి.
- సముద్రంలోని బండ రాళ్లపై నాచుని తినడం వల్ల బండలు శుభ్రంగా ఉండి చేపలు గుడ్లు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది.
- తీర ప్రాంతం కోతకు గురికాకుండా దోహదపడుతాయి.
- సముద్రంలోని వ్యర్థాలు తినడంతో నీరు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంది.

చిల్లకూరు: అంతరించి పోతున్న జీవకోటిలో ప్రధానంగా తాబేలు ఒకటి. అయితే దీనిని సంరక్షించేందుకు అటవీ, వైల్డ్ లైఫ్ శాఖలు నడుము కట్టాయి. ఇందులో భాగంగానే చెన్నైలోని సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి జిల్లాలోని సముద్ర తీరంలో హేచరీలు ఏర్పాటు చేసి గుడ్లు పొదిగిస్తున్నాయి. ఆ తర్వాత తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్నాయి. సముద్రంలోని జీవరాశులు అన్నీ సమానంగా ఉంటే జీవ వైవిధ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. అయితే ఇటీవల తాబేళ్లను సంహరించి సొమ్ము చేసుకునే వారు ఎక్కువ కావడంతో ఇవి నానాటికీ అంతరించి పోతున్నాయి. దీంతో సముద్రంలో జీవ వైవిధ్యం పూర్తిగా దెబ్బతింటోంది. తాబేళ్ల లేకపోవడంతో సముద్రంలోని నీరు కలుషితమవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీని నివారణకు తాబేళ్లను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉద్ఘాటిస్తున్నారు.

తాబేళ్ల సంరక్షణకు పెద్దపీట

సముద్రం ఒడ్డున తాబేలు గుడ్లు పెడుతుంది. వీటిని ఏరి ఒక చోట ఉంచి పొందిగించి పిల్లలను చేసే బాధ్యతలను ఇటీవల కాలంలో అటవీ, వైల్డ్‌లైఫ్ అధికారులు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే చెన్నైకి చెందిన సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి తాబేళ్ల సంరక్షణ బాధ్యతలను 2005 నుంచి తీసుకున్నారు. వీటిని సూర్యుడు ఉదయించే సమయంలో లేత కిరణాలు వాటిపై పడుతున్నప్పుడు సముద్రంలోకి వదలుతారు. అయితే ఇవి సముద్రంలోకి వెళ్లిన 16 ఏళ్ల తర్వాత అవి ఎక్కడి నుంచి అయితే సముద్రంలోకి వెళ్లాయో అదే ప్రాంతానికి తిరిగి వచ్చి గుడ్లు పెడుతాయని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. తాబేలు జీవిత కాలం సుమారు 152 ఏళ్లు. ఆలీవ్ రిడ్లే తాబేళ్లు బంగాళాఖాతంలో ఎక్కువగా జీవిస్తాయి. ఇవి ప్రతి ఏడాదీ జనవరి నుంచి ఏప్రిల్ వరకు గుడ్లు పెడుతాయి. ఒక్కొక్కటీ సుమారు 75 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఇప్పటికే చిల్లకూరు, కోట, వాకాడు సముద్ర తీర ప్రాంతాల్లోని తీగపాళెం, శ్రీనివాసనత్రం, నవాబుపేట ప్రాంతాల నుంచి సుమారు 20 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.


మునగ చెట్టుతో కలిసి పెరుగుతున్న అరేకా కాటేజ చెట్టు

అరేకా.. వచ్చింది మన దాకా..

- ఉద్యానవన పంటల్లో అరేకా పాన్ మొక్కలు
- కిల్లీ, పాన్ మసాలా, తాంబూలాలకు డిమాండ్
- ప్రయోగాత్మకంగా పండిస్తున్న మాజీ సైనికుడు

కాశీబుగ్గ:


అరేకా కాటేజీ.. ఈ మొక్క పేరెప్పుడైనా విన్నారా..? శీతల ప్రాంతాల్లో పండే ఈ చిన్నతాటి చెట్టు తరహా పంటను ఇప్పుడు ఉద్యానానికి ఓ మాజీ సైనికుడు పరిచయం చేస్తున్నాడు. సుమారు 30 నుంచి 45 అడుగుల పొడవు పెరిగే మొక్కలు ఏడాదికి మూడు సార్లు పంటకాసి ఫలసాయం అందిస్తాయి. గుత్తులు మాత్రం చూపునకు పామాయిల్‌ను పోలి ఉంటాయి. ఒక్క గెలలో వందల సంఖ్యలో గింజలు ఉంటాయి. ఇలా ఒక చెట్టుకు పదుల సంఖ్యలో గెలలు కాస్తాయి. అరేకా గెలలు పండిన రంగులోకి వచ్చిన అనంతరం అవసరమైతే కోస్తారు. అవి కొయ్యకున్నా పండిన అనంతరం వాటంతటవే కిందపడిపోతాయి. పండిన వాటిని ఎండలో ఆరబెట్టి అనంతరం కొబ్బ కాయలా పీచును తొలగించి లోపల గోలీ పిక్క వంటి సైజులో ఉన్న చెక్క కాయలను సేకరిస్తారు.

ఆగస్టు–సెప్టెంబరులో ఒక వంతు, అక్టోబరు–నవంబరు రెండో వంతు, డిసెంబరు–జనవరితో మూడోవంతు ఇవి ఫలసాయాన్ని అందిస్తాయి. అధికంగా శీతల ప్రాంతాల్లో ఈ పండే పంటలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. దక్షిణ ఆసియా, ఆగ్నేయాసియా, తూర్పు ఆఫ్రికా, పసిఫిక్ ప్రాంతం, ఇండియాలో పశ్చిమబెంగాల్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ పంట ఎక్కువగా కనిపిస్తుంది. క్రమేపీ అనేక ప్రాంతాలకు చెక్క దిగుమతి అయ్యి ఇప్పుడు ఏకంగా పంటే పండిస్తున్నారు. ప్రస్తుతం కేరళ, కర్ణాటక, తూగో జిల్లాల వరకు వచ్చేశాయి. ఇప్పుడు ఏకంగా మన ఉద్దాన ప్రాంతానికి పరిచ యం అయ్యాయి.



ప్రయోగాత్మకంగా ఉద్దానంలో..

శీతల ప్రాంతాన్ని పోలిన వాతావరణం మన ఉద్దానంలో ఉంది. ఇక్కడ సముద్రతీర గాలులు, తూర్పు గాలులు కావడంతో మాకన్నపల్లి గ్రామంలో ప్రయోగంగా వేసిన పంట.. ఫలసాయాన్ని అందించింది. అండమాన్ నికోబార్ దీవుల నుంచి కు త్తుం వినోద్ కుమార్ అనే మాజీ సైనికుడు విత్తనాలను తీసుకుని వచ్చి ఇంటి చుట్టూ నాటారు. ఆయనే కాకుండా పశ్చిమబెంగాల్, అండమాన్ వివిధ రకాలైన దీవుల్లో వివిధ రకాల కంపెనీలు, ఉద్యోగాలు చేసినవారితో పాటు చాలా మందికి చెక్క తినడం అలవాటు కావడంతో వారంతా వాటిని దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం ఉద్యోగాలు వదిలి ఉద్దానం రావడంతో ఏకంగా విత్తనాలను తెచ్చుకుని చెట్లును నాటుతున్నారు. మాకన్నపల్లి గ్రామంతో పాటు మందస, పలాస, సొంపేట, కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో అక్కడక్కడా కనిపిస్తున్నాయి.



ఎందుకింత డిమాండ్..?

అరేకా చెక్క చరిత్ర ఒక్కసారి చూస్తే శతాబ్దాల కాలం నుంచి మన పూర్వీకులు వివిధ రూపాలుగా వాడుతున్నారు. కిల్లీల రూపంలో, తాంబూలాల రూపంలో, ఆకు వక్కల రూపంలో ఎప్పటి నుంచో ఈ చెక్కలను మనం వాడుతున్నాం. పాన్ మసాలా కంపెనీలు కూడా దశాబ్దాలుగా వీటిని వినియోగిస్తున్నాయి. అందుకే ఈ పంటకు ఇంత డిమాండ్. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో ఈ పంటపై కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది.

ఉచితంగా విత్తనాలు..



నేను ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నప్పుడు అండమాన్ నికోబార్ దీవుల్లో పర్యటించాను. అప్పుడే అక్కడ చెక్క గురించి విని వాటి విత్తనాలను సేకరించి తీసుకుని వచ్చాను. ఐదేళ్ల కిందట నాటగా ఇప్పుడు మా ఇంటి చుట్టుపక్కల వాతావరణంలో అనేక మొక్కలు పెరిగి పంటను అందిస్తున్నాయి. ఈ చెక్క అన్నింటికీ ఉపయోగిస్తున్నారు. ఎవ్వరికైనా విత్తనాలు అవసరం అనుకుంటే నన్ను సంప్రదిస్తే నేను ఉచితంగా అందిస్తాను.

– కుత్తు వినోద్ కుమార్, మాజీ సైనికుడు, రైతు

గవర్నర్‌తో సీఎస్ భేటీ



గవర్నర్‌తో భేటీ అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక విజయవాడ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో కాసేపు సమావేశమయ్యారు.

కొత్త సీఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ బాధ్యతలు

▶ మొదటి పేజీ తరువాయి

దివ్య ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ సీఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు గోపాల కృష్ణ ద్వివేది, రజత్ భార్గవ, కె.విజయానంద్, పీసీసీఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు కె.సునీత, ప్రవీణ్ ప్రకాశ్, ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి కె.శశిధర్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఆగిన మరో గుండె



మృతుడు రమణ (ఫైల్)

ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమిని తట్టుకోలేక అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం వెంకటాపురానికి చెందిన ఆ పార్టీ కార్యకర్త గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి రమణ(49) మనస్తాపంతో నిద్రాహారాలు మానివేశాడు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటివద్ద గుండెపోటుతో ప్రాణాలు విడిచినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయన మృతదేహాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

రాష్ట్రంలో కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు

- చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు
- టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్
- బాధితులకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందని మండిపడ్డారు. టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని, యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని, పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందని చెప్పారు. ఉన్నత చదువులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో పాలనా సంస్కరణలు, పేదలను ఆదుకునే కార్యక్రమాలతో దేశంలో రాష్ట్రానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులన్నింటినీ దెబ్బ తీసి, కేవలం మూడు రోజుల్లోనే హింసాయుత రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోందని, గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, తన అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.






వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసిన పార్టీ నేతలు, వైఎస్ జగన్‌తో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి

బెజవాడలో టీడీపీ విధ్వంసకాండ

- గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ ఇంటిపై దాడి
- కార్లలో కత్తులు, రాళ్లు తీసుకొచ్చి విధ్వంసం
- మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు దాడులు, బూతులతో వీరంగం
- అపార్ట్‌మెంట్, సమీపంలోని ఇళ్లలోకి చొరబడి మరీ దాడులు
- పలు కార్లు, ఇళ్ల అద్దాలు ధ్వంసం
- అడ్డుకోబోయిన పోలీసులనూ తరిమిన టీడీపీ శ్రేణులు
- రంగంలోకి సీఆర్‌పీఎఫ్.. లాఠీచార్జి చేసి పరిస్థితి అదుపులోకి
- పోలీసుల అదుపులో పలువురు టీడీపీ కార్యకర్తలు
- అల్లరి మూకలకు మరింత రెచ్చగొట్టిన టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



వంశీ ఇంటి ముందు బాణాసంచా కాల్చి కవ్వింపు చర్యలకు దిగుతున్న టీడీపీ కార్యకర్తలు

విజయవాడ: బెజవాడలో పట్టపగలే టీడీపీ కార్యకర్తలు విధ్వంసకాండకు దిగారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై దాడికి విఫల యత్నం చేశాయి. నగరంలోని లబ్బీపేట మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని వంశీ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌పై పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన రాత్రి వరకు ఈ విధ్వంసకాండ కొనసాగింది. అరుపులు, కేకలు, బూతులతో ఆ ప్రాంతాన్ని అట్టుడికించారు. పోలీసులనూ తరిమేశారు. చివరకు సీఆర్‌పీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జి చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇటీవలి ఎన్నికల్లో గన్నవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన టీడీపీ నేత యార్లగడ్డ వెంకట్రావు అక్కడికి వచ్చి అల్లరి మూకలకు మరింతగా రెచ్చగొట్టడం గమనార్హం.

ముందస్తు వ్యూహంతోనే దాడి

టీడీపీ అధినాయకత్వం అండతో, ముందస్తు వ్యూహంతోనే విజయవాడ సెంట్రల్, తూర్పు, గన్నవరం నియోజకవర్గాల నుంచి గంజాయి, మద్యంతో పాటు ఇతర మత్తు పదార్థాలు సేవించిన టీడీపీకి చెందిన యువకులు ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం. తొలుత మధ్యాహ్నం 3 గంటల సమయంలో నాలుగు కార్లలో కత్తులు, ఇటుకలు, కంకర రాళ్లు, కర్రలతో కొందరు టీడీపీ కార్యకర్తలు వంశీ ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. వస్తూనే బూతులు తిడుతూ కార్లలో తెచ్చుకున్న రాళ్లను విసిరారు. రాళ్ల దాడిలో వంశీ కారుతో పాటు ఆ ప్రాంతంలోని కొన్ని కార్లు, ద్విచక్ర వాహనాలు, సమీపంలోని ఇళ్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. కొందరు సమీపంలోని ఇళ్లలోకి చొరబడి కర్రలతో కుండీలు, కిటికీలు పగలకొట్టి భీభత్సాన్ని సృష్టించారు. టీడీపీ జెండాలను పట్టుకుని నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి కవ్వింపు చర్యలకు దిగారు. బూతులు, అరుపులతో అక్కడున్న అందరినీ భయభ్రాంతులకు గురి చేశారు. అపార్ట్‌మెంట్ గోడ దూకి సెల్లార్‌లో ఉన్న పలు కార్ల అద్దాలను పగులగొట్టారు. ప్రతి అర గంటకు మరికొందరు అక్కడకు చేరుకోవడంతో ఆ ప్రాంతం పూర్తిగా టీడీపీ వారితో నిండిపోయింది. 300 మందికి పైగా ఈ దాడిలో పాల్గొన్నారు. ఒక్కసారిగా భీభత్సం సృష్టించడంతో స్థానికులు భయకంపితులయ్యారు. పలువురు మహిళలు భయాందోళనకు గురయ్యారు. పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాలతో పోలీసులు భారీ సంఖ్యలో చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. పోలీసులను చూడగానే అల్లరి మూకలు మరింతగా రెచ్చిపోయాయి. విధ్వంసాన్ని అదుపు చేసేందుకు వచ్చిన పోలీసులను వెంటబడి తరిమారు. పరిస్థితి అదుపు తప్పడంతో సీఆర్‌పీఎఫ్ బలగాలు అక్కడికి చేరుకున్నాయి. సీఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చీ రాగానే లాఠీచార్జీ ప్రారంభించడంతో టీడీపీ కార్యకర్తలు పరుగులు పెట్టారు. దాడులకు పాల్పడిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు సమీపంలోని ఇళ్లలోకి దూరి దాక్కున్నారు. పోలీసులు వారిని వెతికి పట్టుకుని మరీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో ధ్వంసమైన వంశీ నివాసం



విజయవాడ గుణదలలోని అవినాశ్ నివాసం వద్ద పోలీసు బందోబస్తు

విధ్వంసానికి ఆజ్యం పోసిన యార్లగడ్డ

టీడీపీ కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అక్కడకు చేరుకుని విధ్వంసానికి ఆజ్యం పోసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి తీసుకుంటున్న వారిని అక్కడే వదిలేయాలని పోలీసులకు హుకుం జారీ చేశారు. పోలీసులు ససేమిరా అనడంతో వారితో వాగ్వాదానికి దిగారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతోనే ఈ దాడికి దిగినట్లు చెప్పడంతో అక్కడున్న పోలీసులు సైతం నివ్వెరపోయారు. స్వయంగా చంద్రబాబు వచ్చి విడిపిస్తారంటూ అరెస్ట్ అయిన వారిని మరింత రెచ్చగొట్టేందుకు వెంకట్రావు ప్రయత్నం చేశారు. పోలీసులు అక్కడివారిని తరిమేస్తున్నా అక్కడే తిరుగుతూ కవ్వింపు చర్యలు కొనసాగించారు. అర్ధరాత్రి వరకు పరిస్థితి ఇలానే కొనసాగింది.

గవర్నర్ కార్యాలయ ఉద్యోగి వాహనం ధ్వంసం

టీడీపీ కార్యకర్తలు మద్యం, గంజాయి మత్తులో విచక్షణరహితంగా చేసిన దాడిలో గవర్నర్ కార్యాలయ ఉద్యోగి కారు కూడా ధ్వంసమైంది. ఆ ఉద్యోగి అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. సెల్లార్‌లో పార్క్ చేసిన ఆయన కారుపై టీడీపీ వారు రాళ్లు రువ్వడంతో అద్దాలన్నీ పూర్తిగా పగిలిపోయాయి.

దేవినేని అవినాశ్‌కు భద్రత పెంపు

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌కు పోలీసులు భద్రత పెంచారు. విజయవాడ ఏలూరు రోడ్డులోని ఆయన ఇల్లు, కార్యాలయం వద్ద మాచవరం పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను పెద్ద సంఖ్యలో మోహరించారు. బారికేడ్లు, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ఆయన్ని కలిసేందుకు వచ్చే అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సమీపంలో అనుమానంగా సంచరించే వారిని గమనిస్తున్నారు. యువకులు గుంపులుగా ఉండకుండా, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. టీడీపీ అల్లరి మూకలు రాష్ట్రవ్యాప్తంగా విచక్షణరహితంగా విధ్వంసం సృష్టిస్తుండటంతో అవినాశ్‌కు భద్రత పెంచినట్లు మాచవరం పోలీసులు తెలిపారు.

ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా?

పూర్వం యుద్ధం ముగిశాక విజయం సాధించిన రాజులు ఓడిపోయిన రాజు రాజ్యంపై పడి విధ్వంసం సృష్టించేవారు. జనావాసాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. అందినకాడికి దోచుకునేవారు. ప్రజలంతా ఒకచోటుకు చేరి.. మోకరిల్లి శరణుకోరాక కానీ శాంతించే వారు కాదు. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి చూస్తుంటే అలాంటి దుస్థితే కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచి టీడీపీ శ్రేణులు యథేచ్ఛగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడి భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా విజయం సాధించాక తొలుత దృష్టి సారించాల్సింది శాంతి భద్రతల పరిరక్షణపైనే. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం కొనసాగిస్తుండగా... టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా... తిరిగి వైఎస్సార్‌సీపీ కవ్వింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వైఎస్సార్‌సీపీ కవ్వించినా సంయమనం పాటించాలంటూ ట్వీట్ చేయటం విధ్వంసాలకు మరింత ఊతమిచ్చేదిగా కనిపిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది... వచ్చామన్న కిక్కుతో ఊరూరా కవ్వింపులకు, దాడులకు తెగబడుతున్నది తెలుగుదేశమే. మూడు రోజులుగా వరుస దాడులు చేస్తున్నా పోలీసులకు పైనుంచి ఆదేశాలుండటంతో చేష్టలుడిగి చూస్తున్నారు తప్ప నిలువరించే ప్రయత్నం చేయటం లేదు. తాను ప్రమాణ స్వీకారం చేసే వరకు ఏమైనా చేయండని, రెచ్చిపోండని చంద్రబాబు పరోక్షంగా సంకేతాలిచ్చారని, అందుకే పోలీసులు పట్టనట్లు ఊరుకుంటున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఎందుకంటే తాను ప్రమాణ స్వీకారం చేయకముందయితే తన హయాంలో జరగలేదని చెప్పొచ్చనేది బాబు యోచనగా చెబుతున్నారు.

వైఎస్సార్ విగ్రహాల విధ్వంసం

దర్శి మండలం రాజంపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నిప్పు

- ట్రాక్టర్‌కు తాడు కట్టి లాగేందుకు విఫలయత్నం
- సీఎస్ పురం మండలంలో ఆర్వో ప్లాంటు, బోర్డు ధ్వంసం
- విజయవాడలో వైఎస్సార్ విగ్రహం మెడలో టీడీపీ కండువా
- రామచంద్రాపురంలో వైఎస్సార్ విగ్రహం మాయం
- నందిగామలో పలు బోర్డుల తొలగింపు



వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



దర్శిలో కాలిపోయిన వైఎస్సార్ విగ్రహం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో అధికారం అండ చూసుకుని టీడీపీ కార్యకర్తలు విధ్వంస కాండను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ కార్యకర్తలపై దాడులకు పాల్పడటంతో పాటు పనిగట్టుకుని వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. పెట్రోల్ పోసి తగలబెడుతున్నారు. ట్రాక్టర్లతో కూల్చేస్తున్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లిలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గురువారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. పొగ రావడాన్ని గమనించిన స్థానికులు నీళ్లు పోసి మంటలార్పారు. అంతకు ముందు విగ్రహానికి తాళ్లు కట్టి ట్రాక్టర్‌తో లాగి కూల్చేయడానికి విఫలయత్నం చేశారు. విగ్రహం ముందు వైపు ట్రాక్టర్ స్లిప్ అయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అనంతరం మడ్డి ఇంజన్ ఆయిల్ తీసుకొచ్చి విగ్రహం మీద పోసి నిప్పు పెట్టారు. ఆ మేరకు విగ్రహం పక్కనే మడ్డి ఆయిల్ డబ్బాలు కూడా ఉన్నాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం పెదగోగులపల్లెలో శుక్రవారం సాయంత్రం టీడీపీ శ్రేణులు విధ్వంసానికి పాల్పడ్డాయి. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సమీపంలో ఉన్న బోర్డును నేలమట్టం చేశారు. సమీపంలోని ఆర్వో ప్లాంటులోకి చొరబడి పైపులను విరిచేశారు. పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం అడ్డరోడ్డులో కూడా ఇదే రీతిలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించారు.

- చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం శ్రీరంగరాజపురం మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిలోని దీపిక కల్యాణ మండపం వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనాన్ని ధ్వంసం చేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ఎన్నికల్లో ఈ వాహనాన్ని ఉపయోగించారు. పోలింగ్ అనంతరం ఆ వాహనాన్ని దీపిక కల్యాణ మండపం వద్ద పార్కింగ్ చేశారు. దుండగులు వాహనానికి నిప్పంటించిన తర్వాత కల్యాణ మండపంపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. వీవీ.పురం, కొత్తపల్లి మహాభారతం, వినాయకస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసి శిలాఫలకాల్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.
- కూటమి శ్రేణులు విజయవాడలో వైఎస్సార్ విగ్రహం మెడలో టీడీపీ కండువా, చేతిలో ఆ పార్టీ జెండా పెట్టారు. ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు విజయవాడ భవానీపురం స్వాతి రోడ్డులో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బీజేపీ కార్యాలయం దాటి శివాలయం సెంటర్‌కు చేరుకుంది. ఆ సమయంలో ఓ యువకుడు పొక్లెయిన్ పైకి ఎక్కి మహానేత వైఎస్సార్ విగ్రహం మెడలో పచ్చ కండువా వేశాడు. చేతిలో టీడీపీ జెండా పెట్టాడు. భవానీపురం పోలీసులు వారిస్తున్నా కార్యకర్తలు పట్టించుకోలేదు. ర్యాలీ ముందుకు కదిలిన తర్వాత పోలీసులు టీడీపీ కండువా, జెండాను తొలగించారు.
- తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని ప్రధాన రహదారి సమీపంలో ఎన్నో ఏళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి 10 గంటల వరకు విగ్రహం అక్కడే ఉందని, ఉదయం లేచి చూసేసరికి విగ్రహం లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.
- టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో హల్ చల్ చేశారు. పట్టణంలోని పలుచోట్ల శిలాఫలకాలు ధ్వంసం చేయడంతో పాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు, మొండితోక అరుణ్ కుమార్‌ల బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.



శ్రీరంగరాజపురం మండలంలో దగ్ధమైన వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనం



గోగులపల్లెలో హెల్త్ క్లినిక్ సమీపంలో వంచివేసిన బోర్డు

హైకోర్టుల్లో 331 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీలు

సాక్షి, అమరావతి: దేశంలోని వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 331 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే రాష్ట్రాల్లోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 5,432 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. సుప్రీం కోర్టుతో పాటు వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపింది. న్యాయమూర్తులు పదవీ విరమణ, రాజీనామాలు, పదోన్నతుల ద్వారా ఖాళీ అయిన న్యాయమూర్తుల పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. నిబంధనల ప్రకారం జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో న్యాయమూర్తుల ఎంపిక, నియామకాల్లో కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని తెలిపింది. అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 70 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ తరువాత పంజాబ్, హరియాణ హైకోర్టులో 29 న్యాయమూర్తుల పోస్టులు, బాంబే హైకోర్టులో 25 న్యాయమూర్తుల పోస్టులు, కోల్‌కత్తా, గుజరాత్ హైకోర్టుల్లో 21 చొప్పున న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో 16, ఏపీలో 7 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయంది. ఉత్తర ప్రదేశ్‌లో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 1,250 జడ్జిల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గుజరాత్‌లో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 535 న్యాయమూర్తుల పదవులు, బిహార్‌లో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 467 జడ్జిల పోస్టులు, తమిళనాడులో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 334 న్యాయమూర్తుల పోస్టులు, రాజస్థాన్‌లో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 300 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయంది. ఏపీలో జిల్లాలు, సబార్డినేట్ కోర్టుల్లో 84, తెలంగాణలో 115 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించింది.

డయేరియా విస్తరించకుండా చర్యలు తీసుకోవాలి

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో డయేరియా విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోలు, ఇతర అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయా నగరాల్లోని డీఎంహెచ్‌వోలు, ఎంహెచ్‌వోలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీఎంవోలతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డయేరియా విషయంలో మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో తాను స్వయంగా మాట్లాడుతున్నానన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో నీటి శాంపిళ్ల పరీక్ష కోసం ఐపీఎంతో సమన్వయం చేసుకోవాలని, నాలుగు మొబైల్ టెస్టింగ్ వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు, పల్నాడు, శ్రీకాకుళం జిల్లాల్లో నీటి శాంపిళ్ల పరీక్షల విషయంలో సీహెచ్‌వోలు మరింత శ్రద్ధ కనబర్చాలన్నారు. తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం నగరాల్లో మలేరియా, డెంగీ కేసుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలే అవకాశం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో దోమ తెరల్ని సరిపడా సరఫరా చేయాలని, అలాగే గిరిజన సంక్షేమ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వర్మపై జనసేన కార్యకర్తల దాడి

- సర్పంచ్‌తో మంతనాలు జరిపేందుకు వెళ్లిన వర్మ
- మాకు చెప్పకుండా మా ఊరు ఎందుకొచ్చావని జనసేన శ్రేణుల నిలదీత
- రాళ్లు, కొబ్బరికాయలతో దాడి.. పగిలిన కారు అద్దాలు
- జనసేన నాయకులపై హత్యాయత్నం కేసు పెట్టే వరకు వదలం
- గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన వర్మ



వర్మ కారును అడ్డగించిన జనసేన కార్యకర్తలు (ఇన్‌సెట్) పగిలిన కారు అద్దాలు

పిఠాపురం: పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై జనసేన కార్యకర్తలు దాడికి దిగారు. రాళ్లు, కొబ్బరికాయలతో దాడి చేయడంతో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనలో వర్మతో సహా పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో స్థానిక సర్పంచ్‌తో మంతనాలు జరిపేందుకు వర్మ వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు వచ్చి వర్మను అడ్డుకున్నారు. 'మాకు తెలియకుండా మా గ్రామం ఎందుకు వచ్చారు.. మాకు తెలియకుండా మా గ్రామంలో ఇతర పార్టీల వాళ్లను ఎందుకు కలుస్తున్నారు' అంటూ వర్మను నిలదీశారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ వర్మ వారికి బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగారు. రాళ్లు, కొబ్బరి కాయలతో వర్మ కారుపై దాడి చేయడంతో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. వారి నుంచి తప్పించుకుని ఆయన కారులో వేగంగా వెళ్లిపోయారు. వర్మపై దాడి విషయం తెలియడంతో గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జనసేన నేతలకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేసినా వారు శాంతించలేదు. జనసేన నేతల దాడి నుంచి తప్పించుకుని వచ్చిన వర్మ గొల్లప్రోలు– చేబ్రోలుకు మధ్యలో ఉన్న తన గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా పోలీసులు ఆయనకు రక్షణ ఏర్పాట్లు చేశారు.

నన్ను చంపడానికి ప్రయత్నించారు: వర్మ

ఎన్నికల్లో పని చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడానికి వెళితే జనసేన శ్రేణులు తనపై దాడి చేశాయని టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. ఆయన శుక్రవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు చిలకపూరి ప్రభాకరరావు పిలుపు మేరకు సర్పంచ్‌లు ఎన్నికల్లో తమకు అనుకూలంగా పని చేశారన్నారు. దీంతో తాను సర్పంచ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలపడానికి వన్నెపూడి వెళ్లానన్నారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన మాజీ టీడీపీ నేతలు, ప్రస్తుతం అధికారం కోసం జనసేనలోకి వెళ్లిన కొందరు నేతలు తనపై దాడికి దిగారని ఆరోపించారు. తనపై ఇటుకలు, గాజు గ్లాసులు, డ్రింక్ సీసాలు, కంకర రాళ్లు, కర్రలతో దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో తనతో పాటు మరికొందరికి గాయాలయ్యాయన్నారు. అల్లరి మూకలను జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. జనసేన నేతలు తనను చంపడానికి ప్రయత్నించారని ధ్వజమెత్తారు. 9 నెలలుగా ఉదయ్ తనను వేధిస్తున్నాడని.. జనసేనకు పనిచేయడం తన ఖర్మ అని వ్యాఖ్యానించారు. తనపై హత్యాయత్నం వెనుక ఉదయ్ హస్తం ఉందని ఆరోపించారు. తనపై దాడి చేస్తున్నప్పుడు వన్నెపూడికి చెందిన టీడీపీ కార్యకర్తలు సుమారు 150 మంది తనకు రక్షణ వలయంగా ఉండడంతో తాను బయటపడ్డానన్నారు. తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద వర్మ టీడీపీ శ్రేణులతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొనడంతో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు.

పోలీసులకు చిక్కిన బ్లాక్‌మెయిలర్

- విశాఖలో ఓ యువకుడి నిర్వాకం
- రూ.20 లక్షలివ్వకుంటే కొడుకును చంపేస్తానని రియల్టర్‌కు బెదిరింపు
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- రూ.2.45లక్షలు, కత్తి, కారు, ఫోను స్వాధీనం



నిందితుడు నాగ వెంకట పవన్

మధురవాడ (విశాఖజిల్లా): ఆయాచితంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో బ్లాక్‌మెయిలర్ అవతారం ఎత్తిన ఓ యువకుడు అడ్డంగా పోలీసులకు చిక్కిన వైనం శుక్రవారం విశాఖలో చోటు చేసుకుంది. విశాఖ నార్త్ జోన్ ఏసీపీ బి.సునీల్ అందించిన వివరాల మేరకు.. పోతిన వెంకటరావు ఉరఫ్ బాబు అనే వ్యక్తి పీఎంపాలెం కార్‌షెడ్ జంక్షన్ వద్ద భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. బాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, భార్య చార్టెడ్ ఎకౌంటెంట్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఈ నెల 2వ తేదీ రాత్రి 9.30గంటల సమయంలో అతని ఇద్దరు కుమారుల్లో ఒకరిని చంపేందుకు డీల్ వచ్చిందని.. రూ.20 లక్షలు ఇవ్వకపోతే చంపేస్తానని 74163 84335 నంబర్ నుంచి వెంకటరావు 98666 42555 ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్‌లొచ్చాయి. దీంతో అతడు భయంతో సదరు వాట్సాప్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. 3, 4తేదీల్లో కుటుంబసభ్యులంతా భయంతో బయటకు వెళ్లలేదు. 5వ తేదీ మధ్యాహ్నం సుమారు మధ్యాహ్నం 1.35 నిమిషాలకు బ్లాక్‌మెయిలర్ నంబర్‌నుంచి మళ్లీ వాట్సాప్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయగా ఎవరూ మాట్లాడ లేదు. మీ పిల్లవాడిని చంపకుండా ఉండాలంటే రూ.20లక్షలివ్వాలని వాట్సాప్ మెసేజ్‌లొచ్చాయి. భయపడి రూ.5లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాడు. అయితే 6వ తేదీ ఉదయం 11గంటల వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థించాడు. 6వ తేదీ ఉదయం 7.59 గంటల నుంచే డబ్బుల కోసం వాట్సాప్ మెసేజ్‌లొచ్చాయి.

అడ్డంగా దొరికిన బ్లాక్‌మెయిలర్

రూ.5 లక్షలను పీఎం పాలెంలోని క్రికెట్ స్టేడియం సమీపంలోని సాంకేతిక కళాశాల 2వ నంబర్ గేటు వద్దకు తెచ్చివ్వాలని బ్లాక్‌మెయిలర్ సూచించాడు. దీంతో వెంకటరావు పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించాడు. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ , సిబ్బంది ఫిర్యాదిని డబ్బుతో సాంకేతిక కళాశాల 2వ గేటు వద్దకు పంపించారు. అతని నుంచి డబ్బులు తీసుకోవడానికి బ్లాక్ మెయిలర్ ఏపీ 31 బీకే 4040 కారులో వచ్చాడు. అప్పటికే మాటు వేసి ఉన్న పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సహాయంతో బ్లాక్ మెయిలర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనిని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం ధారపాలెంకి చెందిన శివకోటి నాగ వెంకట పవన్ (28)గా గుర్తించారు. ప్రస్తుతం పీఎంపాలెంలో నివాసం ఉంటున్నాడు. పోలీసుల విచారణలో నేరం అంగీకరించాడు. తనకు రూ.15లక్షల వరకు అప్పులున్నందున, వాటిని తీర్చేందుకు ఈ విధంగా బెదిరింపులకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి రూ.2.45లక్షలు, బటన్ కత్తి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

విస్తరిస్తున్న రుతుపవనాలు

మరో మూడు రోజులు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు వానలు కొనసాగనున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ వద్ద ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ తెలంగాణ పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉంది. మరోవైపు నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. వచ్చే రెండు మూడు రోజుల్లో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన భాగాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఫలితంగా శనివారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే ఆదివారం అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. సోమవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురవవచ్చని వివరించింది. అదే సమయంలో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని, అందువల్ల ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

కొనసాగుతున్న టీడీపీ దాడులు

- పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు
- బుక్కరాయసముద్రంలో వాహనం ధ్వంసం



తెనాలి పార్కులో పగలకొట్టిన శిలాఫలకం

కంబదూరు/సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ కార్యకర్తల దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో పలువురు గాయపడ్డారు. అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దళిత నరసింహులుపై టీడీపీ కార్యకర్తలు గురువారం రాత్రి దాడిచేశారు. కళ్యాణదుర్గం వెళుతున్న నరసింహులును సుమారు 30 మంది అటకాయించి రాడ్లు, రాళ్లు, కట్టెలతో దాడిచేసి కొట్టారు. తీవ్ర గాయాలతో కుప్పకూలిన నరసింహుల్ని స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి అనంతపురం తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులును మాజీ ఎంపీ తలారి రంగయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, సర్పంచ్ రాజగోపాల్ పరామర్శించారు. పార్టీ, తాను అండగా ఉంటామని రంగయ్య భరోసా ఇచ్చారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని హమాలీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శేషానందరెడ్డికి చెందిన స్కార్పియో వాహనాన్ని టీడీపీ కార్యకర్తలు శ్రీనివాసులు, వాసుతో పాటు మరో ఆరుగురు కలసి ధ్వంసం చేశారు. ఆ సమయంలో శేషానందరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన భార్య సరస్వతిని బెదిరించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బార్లపల్లిలో శివ అనే వ్యక్తి ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. అతడిని, అతడి తల్లిని గాయపరిచారు. మాదాపురంలో అల్లాబక్ష్ అనే కార్యకర్త ఇంటిపై దాడిచేశారు. శేషంపల్లి, పోలేపల్లి, రామగిరి, కుంటిమద్ది, సుద్దకుంటపల్లి, మాదాపురం, గంగంపల్లి, నసనకోట, గంతిమర్రి గ్రామాల్లోను వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులపై టీడీపీ వర్గీయులు దాడిచేసి పలువురిని గాయపరిచారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం కోకుర్తిలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం భవనాలపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. వైఎస్ జగన్ ఫొటోతో ఉన్న నవరత్నాల సింబల్ టైల్స్‌ను ధ్వంసం చేశారు. శింగనమల మండలం లోలూరు సచివాలయ(ఆకులేడు–2) భవనానికి జగన్ బొమ్మతో ఉన్న నవరత్నాల బోర్డును ధ్వంసం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఎంసీ పల్లి, పెద్దకొండాపురం గ్రామాల్లో సచివాలయాల వద్ద శిలాఫలకాలను, ఆర్బీకేలోని టీవీని టీడీపీ వర్గీయులు ధ్వంసం చేశారు.

తెనాలిలో దాడులు

తెనాలి అర్బన్: గుంటూరు జిల్లా తెనాలిలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తల దాడులు కొనసాగుతున్నాయి. స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ అమృత్ మున్సిపల్ పార్కులో శిలాఫలకాలను గురువారం రాత్రి తెలుగుదేశం కార్యకర్తలు పగులగొట్టారు. 22వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు ఇంటిపై దాడిచేశారు. అమరావతి ప్లాట్స్‌లో ఆధునికీకరించిన అన్నాబత్తుని సత్యనారాయణ అమృత్ మున్సిపల్ పార్కును అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. గురువారం రాత్రి టీడీపీ మహిళలు, ఇతర నాయకులు, కార్యకర్తలు వాటిని పగులగొట్టారు. పార్కులోని నేమ్‌బోర్డును తొలగించి వంగవీటి మోహన రంగా చిల్డ్రన్స్ పార్కు అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 22వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు ఇంటిపై టీడీపీ, జనసేన నాయకులు గురువారం రాత్రి దాడిచేశారు. అక్కడున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. దుబాయ్‌బాబు బయటకు రావాలంటూ కేకలు వేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అంతుచూస్తామని హెచ్చరించారు. దుబాయ్‌బాబు ఇంట్లో లేకపోవటంతో కుటుంబసభ్యులు బయటకు వచ్చి ఎందుకు ఇక్కడ గొడవ చేస్తున్నారని ప్రశ్నించారు. వారిని టీడీపీ, జనసేనవారు దుర్భాషలాడారు. త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

రోగుల భద్రతలో 'ఫ్యూజ్' కీలక పాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

సాక్షి, అమరావతి: శస్త్ర చికిత్స పరికరాలను సమర్థంగా ఉపయోగించడం, రోగుల భద్రత, విజయవంతమైన శస్త్రచికిత్సా విధానాల్లో 'ఫండమెంటల్ యూజ్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ' (ఫ్యూజ్) కోర్సు కీలక పాత్ర పోషిస్తుందని డాక్టర్ జైసా ఓలాస్కీ వివరించారు. రాజమండ్రి జీఎస్ఎల్ వైద్య కళాశాలలో అమెరికా గ్యాస్ట్రోఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ సంయుక్తంగా రెండు రోజుల 'ఫ్యూజ్' సర్టిఫికేషన్ కోర్సు కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 50 మంది సర్జన్లు, సర్జరీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్లు శిక్షణ పొందుతారని ఓలాస్కీ తెలిపారు. న్యూయార్క్‌లోని జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, బయోమెడికల్ సైన్సెస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జరీ చైర్మన్, ఫ్యూజ్ కోర్సు స్థాపకుడు డాక్టర్ స్టీవెన్ ష్వైట్జ్‌బర్గ్ కార్యక్రమం మూలాలను వివరించి, ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నైపుణ్యాలు రోగుల భద్రత, శస్త్ర చికిత్సా ఫలితాలను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయన్నారు. జీఎస్ఎల్ కళాశాలలో ఉన్న ఆధునిక సిమ్యులేటర్ పరికరాలు మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఎంతగానో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు.

వర్సిటీల్లో కుల వివక్షను నిరోధించాలి

వర్సిటీలు, అనుబంధ కళాశాలలకు యూజీసీ ఆదేశం

సాక్షి, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే కుల వివక్షతను నిరోధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశించింది. కుల వివక్షతకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు యూనివర్సిటీ స్థాయిలో స్వతంత్ర కమిటీలను ఏర్పాటుచేయాలని సూచించింది. ఈ కమిటీలో ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థులను సభ్యులుగా నియమించాలని పేర్కొంది. ఈ మేరకు కుల వివక్షత నివారణకు సంబంధించి ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. 2024–25 విద్యా సంవత్సరంలో సామాజిక నేపథ్యం ఆధారంగా విద్యార్థులపై వివక్ష చూపే చర్యలు తీసుకోవద్దని అధ్యాపకులు, సిబ్బందికి సూచించింది. కుల వివక్షతపై వచ్చే ఫిర్యాదులను ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయాలని, రిజిస్ట్రార్/ప్రిన్సిపాల్ కార్యాలయాల్లో ఫిర్యాదు రిజిస్టర్‌ను ఉంచాలని పేర్కొంది. కుల వివక్షత ఘటనలు అధికారుల దృష్టికి వస్తే వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. యూనివర్సిటీ యాక్టివిటీ మానిటరింగ్ పోర్టల్(యూఏఎంపీ)లో 2023–24లో కుల ఆధారిత వివక్షతను నివారించడానికి తీసుకున్న చర్యల నివేదికను జూలై 31వ తేదీలోపు అందించాలని ఉన్నత విద్యాసంస్థలను ఆదేశించింది.

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

సాక్షి, అమరావతి: లోకసభలో ఎన్డీఏ పక్షనేతగా మోదీ ఎన్నికైన సందర్భంగా శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఎన్డీఏ కూటమిలోని పలు పార్టీల నుంచి కొత్తగా ఎన్నికైన సభ్యులతో ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఎన్డీఏ పక్షనేతగా మోదీ పేరును ప్రకటించిన వెంటనే బాణాసంచా కాలుస్తూ భారత్ మాతా కీ జై అంటూ నినదించారు. మోదీ కటౌట్‌కు పాలాభిషేకం నిర్వహించారు.

పుస్తకాల నిధి.. ఈ–గ్రంథాలయం

ఈ–గ్రంథాలయం.. విద్యార్థులకు విజ్ఞానం పంచే పుస్తకాల నిధి. ఎంతో విలువైన పుస్తకాలు కేవలం ఒక్క క్లిక్‌తో కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. ఉన్నత చదువులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు సులభంగా పుస్తకాలు పొందవచ్చు. లక్ష్య సాధనకు అవసరమైన మెటీరియల్‌ను సొంతం చేసుకోవచ్చు.

- వెబ్‌సైట్‌లో ఇంజినీరింగ్, మెడికల్, సివిల్స్ పుస్తకాలు లభ్యం
- ఓపికతో శోధిస్తే విజ్ఞానం మీ సొంతం



కంప్యూటర్ ముందు కూర్చొని తమకు కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను శోధిస్తున్న విద్యార్థులు



విజయనగరం:

'రాజేష్ అనే నిరుపేద విద్యార్థికి ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. ఇంజినీరింగ్ కాలేజీలో కోరుకున్న కోర్సులో ఉచిత సీటు లభించింది. ఆర్థిక స్థోమత లేని తమ తల్లిదండ్రులు ఫీజు భారం తప్పినందుకు సంతోషపడ్డారు. వేలాది రూపాయల్లో ఉన్న పుస్తకాల ధరలను చూసి ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డారు. తన సీనియర్ అతనికి డిజిటల్ లైబ్రరీని పరిచయం చేశాడు. అంతే.. ఇప్పుడు ఇంటర్నెట్ సెంటర్‌లో రూ.10 వెచ్చించి తనకు కావాల్సిన సమాచారాన్ని సులభంగా తెలుసుకుంటున్నాడు.' రాజేష్ ఒక్కరే కాదు ఉన్నత చదువులు చదువుతున్న ఎంతోమంది పేద విద్యార్థులు ఖరీదైన పుస్తకాలు కొనుక్కోలేక ఇబ్బందిపడుతున్నారు. అలాంటి వారు ఈ–గ్రంథాలయంపై అవగాహన పెంపొందించుకుంటే విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చని ఇంజినీరింగ్ అధ్యాపకులు సూచిస్తున్నారు. అన్ని కోర్సులకు సంబంధించిన పుస్తకాలు ఇబ్బడిముబ్బడిగా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. పాఠ్యాంశాలే కాకుండా, వ్యక్తిత్వ వికాసం, ఆంగ్లభాష, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఇలా అనేకం వెబ్‌సైట్‌లో పొందుపరిచి ఉన్నాయి.

విజ్ఞాన పరిజ్ఞానం కోసం...

ప్రస్తుతం పట్టణంలో ఉన్న ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంసీఏ తదితర కళాశాలల్లో డిజిటల్ ఈ–గ్రంథాలయాలు ఉన్నాయి. కళాశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులు వీటిని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గతంలో ఖరీదైన పుస్తకాలను కొనుక్కోలేనివారు వాటిని అద్దెకు తెచ్చుకుని చదివి తిరిగి ఇచ్చేవారు. ఇప్పుడు ఈ సౌలభ్యం చాలా చోట్ల లేదు. ఉన్న చోట్ల పుస్తకాల అద్దె భారీగానే వసూలు చేస్తున్నారు. ఫలితంగా విషయాన్వేషణలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. అలాంటి వారికి ఉచితంగా అందుబాటులో ఉండే ఈ–గ్రంథాలయాలు గొప్పవరమనే చెప్పాలి. ఇంజినీరింగ్, మెడిసిన్, ఐటీ కోర్సుల పుస్తకాల ధరలు ఈ ఏడాది రూ.50 నుంచి రూ.100 వరకు పెరిగినట్టు సమాచారం. ఇంజినీరింగ్ విద్యార్థి ఒక్కో పుస్తకానికి రూ.600 నుంచి రూ.1000 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఎంబీఏ, ఎంసీఏ పుస్తకాల ధరలు సైతం ఇదే విధంగా ఉన్నాయి. వైద్య విద్యకు సంబంధించిన పుస్తకాలు రూ.వెయ్యికి తక్కువగా ఎక్కడా లభించడం లేదు. కేవలం కాలేజీ గ్రంథాలయాల్లోనే విద్యార్థుల కోసం డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్నెన్నో గ్రంథాలు

పోటీ పరీక్షలకు ఈ గ్రంథాయాలు అక్షయపాత్రలని చెప్పాలి. విశిష్టమైన వ్యక్తుల జీవిత చరిత్రలు, చారిత్రక సంఘటనలు వంటి ఎన్నో అరుదైన గ్రంథాలను చదివి లోతైన విషయ పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే డబ్బు చెల్లించినా మన గ్రంథాలయాల్లో దొరకని ఎన్నో అమూల్యమైన పుస్తకాలను పొందవచ్చు. వెబ్‌సైట్‌లో అనేక పుస్తకాలు ఉచితంగా దొరుకుతున్నా, కాపీరైట్ హక్కులు ఉన్న పుస్తకాలు లభించే అవకాశం లేదు. అలాంటి వారికి అద్దెపై పుస్తకాలు తీసుకోవడం లేదా కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంటుంది.

ఇది మీకు తెలుసా...?

దేశంలో 18వ శతాబ్దం మధ్య కాలంలో కోల్‌కతా పౌరగ్రంథాలయం, ఇంపీరియల్ గ్రంథాలయం ఏర్పడ్డాయి. 1953లో ఇంపీరియల్ గ్రంథాలయాన్ని భారత ప్రభుత్వం జాతీయ గ్రంథాలయంగా మారుస్తూ వేల పుస్తకాలను అందులో భద్రపరుస్తూ వచ్చింది. 2002 సంవత్సరంలో దీనిని ఇంటర్నెట్‌కు అనుసంధానం కూడా చేసింది.

దృష్టి పెడితే దొరకని సమాచారం లేదు

ప్రస్తుతం సాంకేతిక ఎంతో అభివృద్ధి చెందింది. ఇందులో భాగంగా ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఇంటర్‌నెట్‌లో ఓపికతో వెతికితే దొరకని పుస్తకమంటూ ఏదీ ఉండదు. జాగ్రత్త కూడా చాలా అవసరం. కొన్ని సార్లు మనకు కావాల్సిన పుస్తకాల పేర్లతోనే సాధారణ రచయితలు రాసిన నాణ్యత లేని పుస్తకాలు ఉంటాయి. ఈ విషయంలో సీనియర్ల సహాయం తీసుకోవడం మంచిది. దాదాపు అన్ని కళాశాలల్లో ఉచితంగా డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉండటంతో పుస్తకాలు దొరకవన్న చింత అవసరం లేదు.

– హంసా నందిని, ఇంజినీరింగ్ విద్యార్థి, విజయనగరం

ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టుల మృతి

ముగ్గురు డీఆర్‌జీ జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీసగఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీసగఢ్ పోలీసుల కథనం మేరకు.. నారాయణపూర్–కొండగావ్–దంతెవాడ జిల్లాల సరిహద్దుల్లోని తూర్పు బస్తర్ డివిజన్ గోబెల్, మంగేడి అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో మూడు జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఐటీబీటీ 45 బెటాలియన్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. రాత్రంతా హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆ ప్రాంతంలో బలగాలు గాలించగా ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రి, తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను నారాయణపూర్‌కు తరలించగా, గాయపడిన జవాన్లను దంతెవాడకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆ ప్రాంతంలో అదనపు బలగాల కూంబింగ్ కొనసాగుతోంది.

సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై మావోయిస్టుల దాడి

నారాయణపూర్‌జిల్లా కరక్‌బట్టీ సమీపాన ఉన్న సీఆర్‌పీఎఫ్ 135 బెటాలియన్ క్యాంపుపై మావోయిస్టులు గురువారం రాత్రి రాకెట్ లాంచర్లను ప్రయోగించారు. అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో మావోయిస్టులు పారిపోయారని ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు. దాడిలో 200 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు గుర్తించారు.

కార్యకారణ స్వరూపుడైన ఆ పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకొనడంతోనే, ఈ జీవాత్మ హృదయంలోని చిక్కుముడులు విడిపోతాయి. సంశయాలన్నీ తొలగిపోతాయి. సమస్త శుభాశుభ కర్మలూ నష్టమైపోతాయి.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 8 జూన్ 2024

విలువల జాడేది?!

వేదికలపై గంభీరోపన్యాసాలు చేయడంలో, విలువల గురించి మాట్లాడటంలో మన నాయకులకు ఎవరూ సాటిరారు. ఆ ఉపన్యాసాలకూ, ఆచరణకూ పెద్దగా పొంతనవుండదు. శుక్రవారం జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రసంగాలు ఈ సంగతిని మరోసారి ధ్రువీకరించాయి. అన్ని నిర్ణయాలూ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే తీసుకుంటామని మోదీ ప్రకటించారు. మంచిదే. గత అయిదేళ్ల పాలనలో ఏకాభిప్రాయం జాడ ఎక్కడా కనబడకపోగా చాలా నిర్ణయాలు విపక్షాన్ని సభనుంచి గెంటేశాక మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఆ నిర్ణయాలపై తీవ్ర విమర్శలూ వచ్చాయి. ప్రతిఘటన కూడా ఎదురైంది. బహుశా అందువల్లే కావొచ్చు... 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా వచ్చిన మెజారిటీ ఈసారి మాయమైంది. మిత్రపక్షాలపై ఆధారపడక తప్పని స్థితి ఏర్పడింది. రామమందిర నిర్మాణం లక్ష్యంగా ఉద్యమాన్ని నడిపి, దానిమాటున మూడున్నర దశాబ్దాలుగా ఎదుగుతూ వచ్చిన బీజేపీ... తీరా ఆలయ నిర్మాణం కొనసాగుతున్న దశలో కనీస మెజారిటీకి దూరంకావటం, యూపీలో సగంపైగా సీట్లు కోల్పోవటం కేవలం యాదృచ్ఛికమని మోదీ చెప్పగలరా? చివరకు అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గాన్ని సైతం బీజేపీ కోల్పోవలసి వచ్చిందని ఆయనకు గుర్తుందో లేదో! అయోధ్య ప్రాంతంలోని 9 స్థానాల్లో 5, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి ప్రాంతంలోని 12 స్థానాల్లో తొమ్మిదింటిని ఈసారి బీజేపీ చేజార్చుకుంది. బీజేపీ హిందుత్వ ప్రాజెక్టుకు ఈ రెండు ప్రాంతాలూ ఆయువుపట్టు. అంతేకాదు... వివిధ రాష్ట్రాల్లో బీజేపీ 2019 ఎన్నికల్లో 50 శాతంపైగా వోట్లతో 224 స్థానాలు గెల్చుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య 156కి పడిపోయింది. బీజేపీ 500 కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 30... వేయి కంటే తక్కువ వోట్లతో గెలిచిన స్థానాలు 100 ఉన్నాయి. ఇండియా కూటమి, మరీ ముఖ్యంగా అందులోని సమాజ్‌వాదీ పార్టీ దాదాపు అన్నిచోట్లా గణనీయంగా కోలుకుంది. తమ గెలుపును ఓటమిగా చిత్రిస్తున్న కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఇప్పుడూ, గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకొచ్చిన మొత్తం సీట్ల సంఖ్యతో పోల్చినా ఈసారి తమకొచ్చిన స్థానాలు చాలా ఎక్కువని ఎద్దేవా చేయటం బాగానేవుంది. అయితే జరిగిందేమిటో లోతుగా విశ్లేషిస్తే సత్యం బోధపడుతుంది. మోదీ పైకేమి మాట్లాడినా నిరుపేదలూ, మధ్యతరగతి తమకు క్రమేపీ దూరం జరుగుతున్నారని బీజేపీకి అర్థమయ్యే ఉంటుంది. అందుకే ఈసారి ఆ రెండు వర్గాలకూ కొత్తగా సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. పార్లమెంటులో ఏ అంశంపైన అయినా చర్చ జరిగినప్పుడు ఉపన్యాస పోటీలుగా భావించి మాట్లాడటంకాక ఆరోగ్యకరమైన చర్చలకు చోటీయడం ఎంతో అవసరం.

ఎన్‌డీఏ సహజసిద్ధమైన కూటమని, ఇందులో అధికార యావలేదని మోదీ చెప్పటం కూడా వింతగానే ఉంది. ఇప్పుడు ఎన్‌డీఏకు మద్దతుగా నిలిచిన నితీశ్, చంద్రబాబులిద్దరూ ఊగిసలాటకు పెట్టింది పేరు. నిలకడ తక్కువ, అవకాశవాద రాజకీయం ఎక్కువ. ఏ గట్టున బాగుంటుందనుకుంటే అటు దూకే బాపతు. 2014 ఎన్నికల్లో ఏపీలో బీజేపీతో కలిసి ప్రయాణించిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో హఠాత్తుగా కాడి పారేసి విడిగా ఎందుకు పోటీ చేశారో, అంతకు సంవత్సరం ముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎందుకు అంటకాగారో ఎవరైనా చెప్పగలరా? తరచు యూటర్న్‌లు తీసుకోవటంలో నితీశ్, చంద్రబాబులకు పోటీ పెడితే ఎవరు ప్రథమ స్థానం గెల్చుకుంటారో చెప్పటం కొంత కష్టమే. ఇలాంటివారిని పక్కనబెట్టుకుని 'ఇది సహజసిద్ధమైన కూటమి, సుపరిపాలన కోసం కలిశాం' అంటూ పెద్ద పెద్ద మాటలు వల్లిస్తే నమ్మడానికి దేశ ప్రజలు తెలివితక్కువవారు కాదు. మోదీని చంద్రబాబు పొగడ్తలతో ముంచడంమాట అలావుంచి 2014లోనే 'మీరు పదిహేనేళ్లు అధికారంలో వుంటారని బాబు జోస్యం చెప్పార'ని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ అనటం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరి 2019లో వీరిద్దరూ ఎన్‌డీఏ నుంచి ఎందుకు బయటకొచ్చినట్టు... ఇప్పుడెందుకు కలిసినట్టు? ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య కథనాలు ప్రచారంలో పెట్టి, చివరకు కేంద్రమే ప్రతిపాదించిన భూ యాజమాన్య హక్కు చట్టంపై ప్రజానీకాన్ని పక్కదోవ పట్టించి బాబు లాభపడ్డారు. విలువలన్నిటినీ గాలికొదిలి ఏం చేసైనా అధికారంలోకి వచ్చితీరాలన్న పట్టుదలతో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అత్యంత హీనంగా దుర్భాషలాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ తదితరులు ఏం మాట్లాడినా మౌనంగా ఉండిపోవటమో, ఆలస్యంగా స్పందించటమో చేసిన కేంద్ర ఎన్నికల సంఘం పెద్దలను అనుకరిస్తూ ఏపీలో ఏం జరిగినా, బాబు తదితరులు అవాకులూ చవాకులూ మాట్లాడినా ప్రధాన ఎన్నికల అధికారి ఉలుకూ పలుకూ లేకుండా నిమిత్తమాత్రుడిగా మిగిలిపోయారు. ఆఖరికి పోలైన వోట్లకన్నా గెలిచిన అభ్యర్థికి అధికంగా వోట్లు వచ్చిన ఉదంతాలు అక్కడక్కడ బయటపడ్డాయి. ఇలాంటి అక్రమాలతో గట్టెక్కాలనే కాళ్లావేళ్లాపడి మరీ బాబు ఎన్‌డీఏలోకి లంఘించారు.

వేదికలెక్కి విలువల గురించి గంభీరోపన్యాసాలు చేసేముందు మొన్న ఎన్నికల్లో తమ ప్రవర్తన ఎలావుందో, ఏం మాట్లాడామో చూసుకోవటం వారికే మంచిది. పిల్లి కళ్లు మూసుకుని పాలుతాగిన చందాన వేదికలెక్కి విన్యాసాలు చేస్తే జనం నవ్విపోతారని నరేంద్ర మోదీతోపాటు ఎన్‌డీఏ భాగస్వామ్యపక్ష నేతలు తెలుసుకోవాలి. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. కానీ ఉన్నన్నాళ్లూ ఏం చేశారో, ఎలా మెలిగారో ప్రజలు గమనిస్తూనే ఉంటారు.

ట్రంప్ కోర్టు పోలింగ్ బూతేనా?

విశ్లేషణ



మనోజ్ జోషి

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చిన తర్వాత ఆ దేశ రాజకీయాలు మరింత విభజనకు గురయ్యాయి. వాస్తవానికి, ఈ న్యాయవిచారణ ట్రంప్ బలహీనతను, అస్థిర ప్రవర్తనను నొక్కిచెప్పింది. పాత అమెరికాలో, ఒక అభ్యర్థిపై నేర నిర్ధారణ జరిగితే అది ఆయన విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపేది. కానీ ఇప్పుడు ఇది ట్రంప్ అమెరికా. విషయాలు అక్కడ భిన్నంగా జరుగుతున్నాయి. ఒకవేళ ఆయన తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికైతే తన దేశానికే కాదు, ప్రపంచానికి కూడా తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. ట్రంప్‌తో భారతదేశ సంబంధాలు బాగానే ఉన్నప్పటికీ, గత మూడేళ్లలో జరుగుతున్నట్టుగా ద్వైపాక్షిక సంబంధాలను నిర్మించడంలో క్రమబద్ధమైన కృషి మాత్రం ఆయన హయాంలో జరగలేదు.

అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను తప్పుడు వ్యాపార రికార్డులపై 34 అంశాల్లో న్యాయస్థానం దోషిగా నిర్ధారించిన తర్వాత అమెరికా మరింతగా విభజనకు గురయింది. స్వభావ రీత్యా, ఈ కేసు చిన్నదే. కానీ న్యాయప్రక్రియను అపహాస్యం చేయడం ద్వారా, ప్రాసిక్యూటర్‌లపై, న్యాయమూర్తిపై కూడా ఎదురుదాడికి దిగుతూ కేసును ఎదుర్కొనాలని ట్రంప్ బృందం తీసుకున్న నిర్ణయం ఈ కేసును విషపూరితం చేసింది.

ట్రంప్ ఇప్పుడు దీనిపై అప్పీల్ చేయనున్నారు. అయితే దీనిపై విచారణ జరగడానికి సంవత్సరాలు కాకపోయినా, నెలల సమయం పడుతుంది. ఒకవేళ తాను ఓడిపోయి, ఆ తర్వాత కేసు తారుమారైతే, అది అమెరికా న్యాయ వ్యవస్థ విచ్ఛిన్నమైనదనే ట్రంప్ మద్దతుదారుల అభిప్రాయాలను ధ్రువీకరిస్తుంది. మరోవైపు, ఇవన్నీ ఉన్నప్పటికీ ట్రంప్ గెలిచినట్లయితే, ఆ వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో అది వెల్లడిస్తుంది. ట్రంప్ న్యాయ ప్రక్రియను కొట్టిపడేస్తూ, 'మనం ఫాసిస్ట్ రాజ్యంలో జీవిస్తున్నాం' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ తనను తాను అభివర్ణించుకున్నట్లుగా 'ఎంతో అమాయకపు వ్యక్తి'పై జరుగుతున్న ఈ విచారణ ఒక బూటకమని ఆయన మద్దతుదారులు అంటున్నారు. ఆయన తనను 'రాజకీయ ఖైదీ'గా చెప్పుకొంటున్నారు. పైగా అవకాశం వచ్చినప్పుడు తన ప్రత్యర్థులందరూ కూడా నేరారోపణలను ఎదుర్కొనే దశలోకి అమెరికా ప్రవేశిస్తోందని ట్రంప్ పార్టీ(రిపబ్లికన్) హెచ్చరించింది.

ప్రత్యేకించి ఓటర్లలో ఆదరణ లేని ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య జరుగుతున్న విచిత్రమైన రేసులో ఈ తీర్పు ఒక అస్థిరమైన, నాటకీయమైన అంశాన్ని ప్రవేశపెట్టింది. పాత అమెరికాలో, ఒక అభ్యర్థిపై నేర నిర్ధారణ అతని లేదా ఆమె అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపేది. కానీ ఇప్పుడు ఇది ట్రంప్ అమెరికా. ఇక్కడ విషయాలు భిన్నంగా జరుగుతున్నాయి. ఈ తీర్పు నిజానికి ఆయనకు రిపబ్లికన్ పార్టీ మద్దతును మరింతగా బలపరిచింది. తీర్పు వెలువడిన వెంటనే ట్రంప్ ప్రచారానికి వచ్చిన 52.8 మిలియన్ అమెరికన్ డాలర్ల రూపంలో ఇది వ్యక్తమయింది.

మరోవైపు డెమోక్రాట్లు తమ ప్రత్యర్థిని, ప్రస్తుతం అగ్రగామిగా ఉన్న వ్యక్తిని న్యాయస్థానం దోషిగా నిర్ధారించినందుకు సంబరాలు చేసుకుంటున్నారు. అధ్యక్షుడు జో బైడెన్ ఈ అంశంపై వ్యాఖ్యానించడంలో జాగ్రత్తగా ఉన్నారు. కానీ ఆయన న్యాయవ్యవస్థను సమర్థించారు. పైగా, తీర్పు తమకు ఇష్టం లేదు కాబట్టి దాన్ని ఎవరైనా ప్రశ్నించడం అనేది 'నిర్లక్ష్యపూరితమైనది, ప్రమాదకరమైనది, బాధ్యతారాహిత్యంతో కూడుకున్నది' అని అన్నారు.



అమెరికా మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్

ఈ కేసుకి సంబంధించిన అంశాలు చిన్నవిగానే ఉన్నప్పటికీ, ఇది బూటకపు విచారణ కాదు. సమర్పించిన సాక్ష్యాలు చేసిన నేరాలను నిర్ధారిస్తాయి. అవి ట్రంప్ జీవించే నీచమైన ప్రపంచానికి చెందిన సంగ్రహావలోకనాన్ని కూడా అందించాయి. ఆయన మద్దతుదారులు ఏం చెప్పినా సరే... జ్యూరీ ఆయన్ని ఏకగ్రీవంగానూ చాలా త్వరితంగానూ మొత్తం 34 అంశాల్లో దోషిగా నిర్ధారించింది. పైగా ఇది ట్రంప్ ఎదుర్కొనే ఆరోపణలలో ఒకటి మాత్రమే; మరో మూడు తీవ్రమైన ఆరోపణలు కూడా ఉన్నాయి. కానీ రిపబ్లికన్ల మనస్సులో, ఈ కేసులు 'న్యాయ వ్యవస్థ ఆయుధీకరణ' ఫలితం మాత్రమే.

వీటిలో రెండు కేసులు 2020 ఎన్నికల ప్రక్రియకు నష్టం గావించడంలో ట్రంప్ పాత్రకు సంబంధించినవి. ఇక మూడవ కేసు, వైట్ హౌస్ నుండి నిష్క్రమించిన తర్వాత ఉద్దేశపూర్వకంగా రహస్య పత్రాలను ట్రంప్ తన వద్ద ఉంచుకున్నట్లు చెబుతోంది. అమెరికా న్యాయ వ్యవస్థలో ఒక భాగం ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తున్నప్పటికీ, అమెరికా సుప్రీంకోర్టుతో సహా ఇతర విభాగాల పక్షపాత దృష్టి కారణంగా ట్రంప్‌పై ఇతర కేసులను అధ్యక్ష ఎన్నికలకు ముందుగా విచారించలేరని న్యూయార్క్ కోర్టు తీర్పు సూచించింది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ముఖ్యమైన 'న్యాయస్థానం' పోలింగ్ బూత్ మాత్రమే.

ట్రంప్‌నకు ఉన్మాదపూరితమైన ఓటర్ బలం ఉంది. ఇది ఈ తీర్పు ద్వారా మరింత పెరిగింది. కానీ అది మాత్రమే ఆయనకు ఎన్నికల్లో గెలుపును ఇవ్వలేదు. తక్కువ ఉత్సాహవంతులైన, నేరారోపణలను బట్టి దూరం జరిగే వ్యక్తుల మద్దతు ఆయనకు అవసరం. వాస్తవానికి, ఈ న్యాయవిచారణ ట్రంప్ బలహీనతను, అస్థిర ప్రవర్తనను, కుంభకోణాలతోపాటు ఆయన అసభ్య ప్రవర్తనను నొక్కిచెప్పింది.

ఈ తీర్పు వెలువడిన వెంటనే నిర్వహించిన 'యూ–గవ్' పోల్‌లో 27 శాతం మంది ట్రంప్‌నకు ఓటు వేసే అవకాశం తక్కువగా ఉందనీ, 26 శాతం మంది అలా వేసే అవకాశం ఎక్కువగా ఉందనీ, 39 శాతం మంది తీర్పు తమ ఓటు విధానాన్ని ప్రభావితం చేయదనీ చెప్పారు.

ఇవి పూర్తిగా విభజనకు గురైన అమెరికన్ రాజకీయ వ్యవస్థ క్షీణత లోతును పట్టి చూపే భయంకరమైన సంకేతాలు. దేశంలోని సగం మంది మరొకరి అభిప్రాయాలను సహించటానికి ఇష్టపడకపోవటంతో, పెద్ద సంఖ్యలో అమెరికన్లు మూడవ పార్టీలకు ఓటు వేయడం లేదా ఎన్నికలకు దూరంగా ఉండడం కూడా మనం చూడవచ్చు.

ట్రంప్ పదవికి పూర్తిగా అనర్హుడన్న విషయం ఈపాటికే స్పష్టం అయింది. అయినా సరే... ఆయన తిరిగి ఎన్నికైతే, తన దేశానికే కాదు, ప్రపంచానికి, భారతదేశానికి కూడా తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. ఉక్రెయిన్, గాజాలో జరుగుతున్న యుద్ధాల వల్ల ప్రపంచం అతలాకుతలం అవుతోంది. పైగా తైవాన్‌లో ఒక ప్రమాదం పొంచి ఉన్నందున, అమెరికా నాయకత్వ పాత్ర చాలా ముఖ్యమైనది. చైనాతో తలపడుతున్న భారత్ భద్రతకు అమెరికా భాగస్వామ్యం ముఖ్యం.

అధ్యక్షుడు బైడెన్ హయాంలో... దక్షిణ కొరియా, జపాన్‌లతో మాత్రమే కాకుండా ఫిలిప్పీన్స్, భారతదేశంతో కూడా పొత్తులు పెట్టుకోవడం ద్వారా అమెరికా తన ఇండో–పసిఫిక్ ముఖచిత్రాన్ని భారీగా బలోపేతం చేసింది. ఈశాన్య ఆసియాలో బైడెన్ ముఖ్యంగా అమెరికా, జపాన్, దక్షిణ కొరియాతో కూడిన త్రైపాక్షిక సంబంధాన్ని ఏర్పరచుకున్నారు. ట్రంప్ హయాంలో అమెరికా, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి.

ముఖ్యంగా, ఆయన 'ఆకస్'(ఏయూకేయూఎస్–ఆస్ట్రేలియా, యూకే, యూఎస్) సైనిక కూటమిని రూపొందించడానికి కూడా చొరవ తీసుకున్నారు. ఇది భారత్ సభ్యురాలిగా ఉన్న క్వాడ్ సంస్థకు భిన్నం. ఇది ఇప్పుడు ప్రధానంగా ఆరోగ్య భద్రత, సరఫరా గొలుసు స్థితిస్థాపకత, వాతావరణ మార్పులు, క్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, సైబర్ భద్రత, సముద్ర భద్రత వంటివాటిపై దృష్టి సారిస్తోంది. 2023 జూన్‌లో, బైడెన్ ఇండో–పసిఫిక్ ప్రాంతం మరొక అంచులో యూఎస్–ఇండియా రక్షణ, భద్రతా సంబంధాలను మరింత ఎత్తుకు తీసుకుపోయే ప్రయత్నంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిశారు. ట్రంప్‌తో భారతదేశ సంబంధాలు బాగానే ఉన్నాయి. కానీ గత మూడేళ్లలో జరిగినట్టుగా ద్వైపాక్షిక సంబంధాలను నిర్మించడంలో క్రమబద్ధమైన కృషి జరగలేదు.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నూరు శాతం కావు!



పెద్ద విజయం! జ్యూస్ కంపెనీలకు 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' రెండు నియమాలు విధించింది. 100 శాతం పళ్ల రసం అనకూడదు; కిలో జ్యూస్‌కు 15 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర వాడేవి 'తీపు చేసిన జ్యూస్' అని రాయాలి. చక్కెరతో నిండిన ప్యాకేజ్డ్ జ్యూసులు ఆరోగ్యకరమైనవని లక్షలాది మంది భారతీయులు తప్పుగా నమ్ముతున్నారు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

వ్యతిరేకత ఉన్నప్పటికీ...



తమిళనాడులో మళ్లీ పోటీచేసిన 21 మంది ఎంపీల్లో 18 మంది ఓటు షేరు తగ్గిందని ఒక విశ్లేషణ. ఇది స్పష్టంగా అధికార పక్షం(డీఎంకే) మీద ఉన్న వ్యతిరేకతను చూపుతోంది. కొంతమంది ఎంపీల ఓట్లు గతంకంటే 10–15 శాతం తగ్గాయి. అయినప్పటికీ ఎందుకు గెలిచారంటే, ప్రతిపక్షాల ఓట్లు చీలడం వల్ల.

– సుమంత్ రామన్, టీవీ యాంకర్

చేయాల్సిన పోరాటం



ఎన్నికల తీర్పును జనాలు హిందుత్వను తిరస్కరించినట్టో, ప్రత్యామ్నాయ 'భారత భావన'కు విజయంగానో మరీ అతిగా అర్థం చేసుకోవడం పెద్ద తప్పు అవుతుంది. ప్రగతిశీల, సమసమాజ భవిత మీద ప్రతిపక్షాలు సరిగ్గా దృష్టి పెట్టాయి. యథాస్థితి లౌకికవాదం కన్నా కులం, వర్గ అసమానతల మీద ఇకపై పోరాటం ఉండాలి.

– అసీమ్ అలీ, పొలిటికల్ రీసెర్చర్

నచ్చకపోతే కొట్టొచ్చా?



ఇండియన్ ఉదారవాదుల ట్విట్టర్ నుంచి ఇవ్వాళ నేర్చుకున్న పాఠం ఏమిటంటే– అధికారంలో ఉన్న వ్యక్తి ఒక మనిషిని కొట్టొచ్చు; ఎందుకంటే ఆ మనిషి అభిప్రాయం వీళ్లకు నచ్చదు కాబట్టి. (కంగనా రనౌత్ విషయంలో.)

– అర్ణబ్ రే, రచయిత

గట్టి నిరూపణ




హిందువులు లౌకికవాదులు కాబట్టి భారతదేశం లౌకికం అని నేను ఎప్పుడూ చెబుతున్నాను. భారత ప్రాథమిక ఆచార విచారాలు లౌకికం. తాజా ఎన్నికలు దాన్ని నిష్కర్షగా నిరూపించాయి.

– ఎస్.వై.ఖురేషి, కేంద్ర మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

ఇన్ బాక్స్

ఉద్యమ వాస్తవ చరిత్ర

ప్రపంచీకరణ అనంతరం వ్యక్తివాదం పెరిగి పోయి ఉద్యమాలు ఉండవు అనే ప్రచారం బలంగా నడుస్తున్న కాలంలో ప్రాంతీయ అస్తిత్వ వేదనలోంచి ఎగిసిన విముక్తి పోరాటం తెలంగాణ ఉద్యమం. పల్లెల నుండి పట్టణాల దాకా తెలంగాణ అనని మనిషి లేడు. కులాలు, మతాలకతీతంగా అందరూ ఒక్క గొంతుకగా నినదించిన నినాదం 'జై తెలంగాణ'. అందులో ముఖ్య భూమిక విద్యార్థులది. మంటలై మండింది, రైళ్లకు ఎదురెళ్లి ముక్కలైంది, ఉరిపోసుకున్నది, పురుగుల మందు తాగింది. ఏది చేసినా తెలంగాణ అనే ఉద్యమ కాగడను ఆరిపోకుండా చమురు పోసి మండించేందుకే. పాలకులు, ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు ఉద్యమానికి ద్రోహం చేసినప్పుడు మొత్తం తెలంగాణ ఉద్యమాన్ని నడిపించింది విద్యార్థులే.



విద్యార్థులు ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం వెనుక స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాటం, తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ పోరాటాల స్ఫూర్తి, ప్రభావాలు ఉన్నాయి. ఆ చైతన్యమే తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. అట్లా ఎగిసిన విద్యార్థి ఉద్యమం రాజకీయ పార్టీల కనుసన్నల్లోకి ఎలా పోయింది? దానికి పని చేసిన శక్తులేవి? తెలంగాణ ఉద్యమం ఏకశిలా సదృశ్యం అనుకుంటున్న చోట నిలబడిన, కలబడిన, వెనక్కి తగ్గిన శక్తులను బహిర్గత పరచిన పరిశోధన ఈ పుస్తకం. ఒక్కమాటలో, కళ్ళముందే వక్రీకరణలకు గురవుతున్న తెలంగాణ ఉద్యమ వాస్తవ చరిత్ర ఇది. ఈ పరిశోధన తెలంగాణ ఉద్యమకారుడే (నలమాస కృష్ణ) పరిశోధకుడిగా చేసిన ప్రయత్నం.

ఇది అకడమిక్ పరిశోధన కాబట్టి దీనికి పరిమితులు ఉన్నా... ఇది ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని సమగ్రంగా నమోదు చేసిందని మాత్రం చెప్పవచ్చు. అలా భవిష్యత్తు పరిశోధనకు దారులు వేసిందన్నమాట. ఉద్యమం నడుస్తుండగానే తీరికలేని కార్యాచరణలో దాని తీరూ తెన్నులపై చేసిన ఓ విశ్లేషణ ఇది. ఆ పరిమితుల్లో దీన్ని అర్థం చేసుకుంటూ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో జరుగనున్న ఈ పుస్తకావిష్కరణకు అందరూ ఆహ్వానితులే.

– అరుణాంక్, డేవిడ్

(నేడు హైదరాబాద్‌లో 'ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం' పుస్తకావిష్కరణ)

ప్రపంచాన్ని నిలదీస్తున్న యువత

అభిప్రాయం



డా॥ దేవరాజు మహారాజు

పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ అమెరికాలోని నూట యాభై విశ్వవిద్యాలయలలో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేశారు. ఏప్రిల్ 2024లో కొనసాగిన నిరసన కార్యక్రమాల్లో బోధన–బోధనేతర ఉద్యోగులు కూడా విద్యార్థులతో పాటు భాగస్వాములయ్యారు. ఇందులో హార్వర్డ్, బర్రత్ హాల్, కొలంబియా, ప్రిన్స్‌టన్, న్యూయార్క్, యేల్ వంటి అన్ని అమెరికన్ యూనివర్సిటీల విద్యార్థులున్నారు. అయితే నిరసనలో చురుకుగా పాల్గొన్న పదమూడు మంది విద్యార్థులకు హార్వర్డ్ యూనివర్సిటీ డిగ్రీలివ్వకుండా ఆపేసింది. 'గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంలకు విద్యార్థులందరూ హాజరు కావచ్చు, కానీ, డిగ్రీలు రద్దయిన ఆ పదమూడు మందికి పట్టా ఇవ్వబడదు'– అని యూనివర్సిటీ ప్రకటించింది. నిరసన సెగలకు తట్టుకోలేక, కొన్ని యూనివర్సిటీలు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు వాయిదా వేసుకున్నాయి. కొన్ని మాత్రం నిర్వహించుకున్నాయి. నిర్వహించుకున్న వాటిలో హార్వర్డ్ యూనివర్సిటీ కూడా ఒకటి.

గాజా మీద దాడులు ఆపాల్సిందిగా, పాలస్తీనాను రక్షించాల్సిందిగా ఈ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం విద్యార్థులు కోరారు. తమ తమ క్లాసురూముల్లో నుండి ఆడిటోరియంలోని వేదిక మీదికి ఒక్కొక్కరుగా వరుస క్రమంలో క్రమశిక్షణతో నడిచి వస్తూ 'ఫ్రీ గాజా నౌ' 'ఫ్రీ పాలస్తీనా నౌ'–గాజాకు స్వేచ్ఛనివ్వండి! పాలస్తీనాకు స్వేచ్ఛనివ్వండి! అని రాసి ఉన్న గుడ్డ, పేపర్ బేనర్‌లను ప్రదర్శిస్తూ వేదిక మీదకు నడిచివెళ్లారు. డిగ్రీలు తీసుకున్నారు. డిగ్రీ తీసుకున్న విద్యార్థుల నుండి కొందరికి మాట్లాడే అవకాశం ఇస్తారు. అలా మాట్లాడే వారిని విద్యార్థులే ఎన్నుకుంటారు. ఆ అవకాశం దక్కించుకుంది భారతీయ–అమెరికన్ విద్యార్థిని శ్రుతీ కుమార్. ఆమె ప్రసంగంలోని సారాంశం ఇలా ఉంది:



హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మాట్లాడుతున్న శ్రుతీ కుమార్

"నేను తీవ్రంగా నిరాశ చెందాను. ఈ కేంపస్‌లో భావ వ్యక్తీకరణను శిక్షించడం జరిగింది. శాసనోల్లంఘన జరిగిందని శిక్షించడం జరిగింది. స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ ఎక్కడున్నాయి? పదిహేను వందలమంది విద్యార్థులు మాట్లాడారు. పిటిషన్లు సమర్పించారు. ఐదు వందల మంది అధ్యాపకులు మాట్లాడారు. మా ఆక్రోశం, మా ఆవేదన హార్వర్డ్– నీకు వినిపిస్తోందా?

గాజాలో జరుగుతున్న సంఘటనలతో మనం మన సమాజంలో నిలువుగా బలంగా విడిపొయ్యాం! మనకు తెలియని వారిలోని మానవత్వాన్ని మనం గుర్తించలేమా? మనకు భేదాభిప్రాయాలు ఉన్నంతమాత్రాన వారి వేదననూ, నొప్పినీ అర్థం చేసుకోలేమా? గాజాలో జరుగుతున్న మారణకాండను మేమెవ్వరం సమర్థించడం లేదు.

భావ ప్రకటన, సంఘీ భావ ప్రకటన ఈ కేంపస్‌లో శిక్షలకు గురయ్యాయి. ఈ సెమిస్టర్‌లో ఈసారి నా పదమూడు మంది సహ విద్యార్థులకు డిగ్రీలు అందడం లేదు. వారు మాతో పాటు పట్టభద్రులు కాలేకపోతున్నారు. శాసనోల్లంఘన జరిగిందని– ఉద్యమిస్తున్న విద్యార్థుల పట్ల యూనివర్సిటీ తీసుకున్న నిర్ణయం మా విద్యార్థి లోకాన్ని ఎంతగానో బాధించింది. ఇంకా చెప్పాలంటే నలుపు, చామనచాయ చర్మం గల నాలాంటి విద్యార్థినీ విద్యార్థులకు ఇక్కడ వ్యక్తిగత భద్రత లేదు. మా పట్ల ఎందుకీ అసహనం? ఎందుకీ అణచివేత? హార్వర్డ్! మా మాటలు నీకు వినిపిస్తున్నాయా?"

అమెరికాలోని నెబ్రాస్కాలో పుట్టి పెరిగిన ఇరవైయేళ్ళ యువతి శ్రుతీ కుమార్, తన పదినిముషాల ప్రసంగంతో ప్రపంచాన్ని కదిలించింది. తన తోటి విద్యార్థులకు పట్టాలు రాకపోవడం పట్ల ఆవేదన తెలియజేస్తూ– గాజాపై జరుగుతున్న దాడుల గూర్చీ, నల్లచర్మం ఆధారంగా సాగుతున్న జాతి వివక్ష గూర్చీ ఆక్రోశిస్తూ మాట్లాడిన మాటలకు హార్వర్డ్ యూనివర్సిటీ ఆడిటోరియంలో, ఆడిటోరియం బయట ఉన్న వేల మంది, వేదిక మీద ఉన్న అధ్యాపకులతో సహా– అందరికందరూ లేచి నిలబడి కాంపస్ దద్దరిల్లిపోయేట్లు చప్పట్లు చరిచారు. 'హార్వర్డ్ నీకు వినిపిస్తోందా?' అని గద్గద స్వరంతో ఆమె ఆక్రోశించినపుడల్లా విద్యార్థులు పెద్దఎత్తున చప్పట్లు చరిచి ఆమెకు తమ సంఘీభావం తెలియజేశారు. అయితే ఆ ఆవేదన, ఆ ఆక్రందన హార్వర్డ్ యూనివర్సిటీ ప్రాంగణానికే పరిమితం కాలేదు. 'ప్రపంచమా! నీకు మా ఆక్రోశం, ఆవేదన వినిపిస్తోందా?– అని యువతరం ప్రశ్నిస్తున్నట్టు ప్రపంచ శ్రోతలకు అనిపించింది.

సంఘసేవ పట్ల ఆసక్తి గల శ్రుతీ కుమార్, డాక్టర్ కోర్సును వదులుకుని, వైజ్ఞానిక శాస్త్ర చరిత్ర, ఆర్థిక శాస్త్రం చదువుకుని పట్టా సాధించారు. తమిళనాడు నుండి వెళ్ళి అమెరికాలో స్థిరపడ్డ దక్షిణ భారత సంప్రదాయ కుటుంబం వారిది.

మనదేశంలోనూ విద్యార్థి ఆందోళనలు జరుగుతున్నాయి. వెంటనే కులగణన జరిపించాలనీ, అందరికీ సమానంగా ఉద్యోగాల్లో అవకాశాలుండాలనీ హరియాణాలోని అశోక విశ్వవిద్యాలయ విద్యార్థులు చేపట్టిన సమ్మె, నిరసనలూ తక్కువవి కావు. ప్రపంచంలో యువతరం ప్రశ్నని బలోపేతం చేస్తూ ఉందన్న దానికి అన్ని చోట్లా జరుగుతున్న విద్యార్థి నిరసనలను సంకేతాలుగా చూడాలి!!

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత । మెల్బోర్న్ నుంచి

హానికరమైన ఉపేక్ష!

కురుక్షేత్ర సంగ్రామం మొదలైన నాటి నుండి జరిగిన సంగతులను తాను చూసి వచ్చి తన ప్రభువైన ధృతరాష్ట్రుడికి వర్ణించి చెబుతుంటాడు సంజయుడు. భీష్మ, ద్రోణాచార్యుల సర్వసేనాధిపత్యంలో పదిహేను రోజుల యుద్ధం తరువాత, రెండు రోజులు కర్ణుడి నాయకత్వంలో యుద్ధం జరిగింది. ఆ రెండు రోజుల యుద్ధం చివరన అర్జునుడి చేతిలో కర్ణుడు, భీముడి చేతిలో దుశ్శాసనుడు నిహతులయ్యారు. ఆ సంగతులను వివరించిన సంజయుడు, కౌరవుల విజయానికి సంబంధించిన ఆశలు అడుగంటిపోయేలా దుశ్శాసనుని రొమ్ము చీల్చి రక్తం తాగి భీముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడని చెబుతాడు. అది విన్న ధృతరాష్ట్రుడు హతాశుడై, సంజయుడు అలా చెబుతున్నాడంటే దుర్యోధనుడు కూడా మరణించి ఉంటాడని ఊహించుకుని హాహాకారాలు చేస్తూ మూర్ఛపోతాడు. విదురుడి సహాయంతో, సంజయుడు సపర్యలు చేసిన అనంతరం మూర్ఛలోంచి తేరుకున్న ధృతరాష్ట్రుడు 'నీవు మొదట చెప్పిన మాటలు నేను సరిగా వినలేదు. దుర్యోధనుడికి ఏ ప్రమాదము సంభవించ లేదు కదా!' అంటాడు. ప్రపంచమంతా ఏమైపోయినా ఫరవాలేదు, దుర్యోధనుడు ఒక్కడు బ్రతికి ఉంటే చాలు అన్నట్లుగా ఉంటుంది ధృతరాష్ట్రుడి వైఖరి. ఈ వైఖరిని గట్టిగానే నిరసిస్తాడు సంజయుడు.

జ్యోతిర్మయం

కొడుకులంత రాజ్యంబును గొనగ శక్తు
లను దురాశను వారల యవినయములు
నీ వుపేక్షింతు; మానునే? యా విరుద్ధ
కర్మమున ఫలమొందక కౌరవేంద్ర!

'రాజ్యం మొత్తాన్నీ తామే కాజేయాలన్న దురాశతో నిండిన కాంక్షతో నీ కొడుకులు చేసే కానిపనులన్నిటినీ నీవు ఉపేక్షించి, చూస్తూ ఊరుకున్నావు. ఏనాటికైనా దాని ఫలితం అనుభవించాల్సిన సమయం రాకుండా ఉంటుందా? అదే ఇప్పుడు వచ్చింది చూడు!' అని ధృతరాష్ట్రుడి మొహం మీదనే సంజయుడు అనడం ఆంధ్ర మహాభారతం, కర్ణపర్వంలోని పై తేటగీతి పద్యంలో కనబడుతుంది. ఈ మాటలు అనిపించుకుని కూడా 'అది సరేలే, ఇంతకీ దుర్యోధనుడు క్షేమంగానే ఉన్నాడు కదా?!' అంటాడు ధృతరాష్ట్రుడు. కళ్ళెదురుగా వినాశనానికి సంబంధించిన ఛాయలు కనపడుతున్నా చూడడానికి ఇచ్ఛగించని స్వార్థపూరిత ఉపేక్ష ధృతరాష్ట్రుడిది! ధృతరాష్ట్రుడి అంగవైకల్యం దృష్టి లేకపోవడం కాదు. దానిని అడ్డం పెట్టుకుని అతడు ప్రదర్శిస్తూ వచ్చిన ఉపేక్షయే! చెడు జరగకుండా ఆపగలిగే అధికారం చేతిలో ఉంచుకుని కూడా ఉపేక్షించడం ఊహించనంత వినాశనానికి దారితీస్తుందని ఇది తెలుపుతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.విదియ సా.4.21 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఆరుద్ర రా.8.33 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.12 వరకు, **అమృతఘడియలు:** ప.10.32 నుండి 12.09 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.29, బుద్ధ జయంతి, మృగశిర కార్తె ప్రారంభం.

క్లుప్తంగా...

శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకటరమణ మృతి



శ్రీరంగం వెంకటరమణ (ఫైల్)

నగరంపాలెం: మహాకవి శ్రీశ్రీ కుమారుడు శ్రీరంగం వెంకటరమణ (59) అనారోగ్యంతో అమెరికాలో మృతి చెందినట్లు ఆయన బావమరిది గుంటూరులోని డాక్టర్ రమణ యశస్వి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరంగం వెంకటరమణ భార్య మాధవి గణపవరం గ్రామస్తురాలు. డాక్టర్ రమణ యశస్వికి చిన్న చెల్లెలు. 25 ఏళ్ల కిందట వారు అమెరికా వెళ్లి ఫైజర్ కంపెనీ పరిశోధన విభాగంలో ఉద్యోగంలో చేరారని ఆయన తెలిపారు. వారికి కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె కవిత ఉన్నారు. వెంకటరమణ మరణంతో సాహితీ లోకం దిగ్భ్రాంతికి గురైందని రమణ యశస్వి పేర్కొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోడుమూరు సీఐకి సైబర్ నేరగాళ్ల దెబ్బ

- అకౌంట్ నుంచి రూ.2.60 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

కోడుమూరు రూరల్: ఫోన్, సిమ్, క్రెడిట్ కార్డులను హ్యాక్ చేసి కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ బ్యాంకు ఖాతాలోని రూ.2.60 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన కర్నూలు జిల్లాలో జరిగింది. సీఐ మన్సురుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 4, 5 తేదీల్లో కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ ఎన్నికల విధుల్లో ఉండగా తన ఫోన్‌కు సంబంధించి ఒక సిమ్ పనిచేయలేదు. దీంతో ఆయన ఈ నెల 6వ తేదీన సిమ్‌ను యాక్టివేట్ చేశారు. వెంటనే తన బ్యాంకు ఖాతా నుంచి సుమారు రూ.2.60 లక్షల వరకు ఫ్లిప్ కార్టులో వివిధ వస్తువులను కొనుగోలు చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. తాను ఏమీ కొనకపోయినప్పటికీ తన ఖాతా నుంచి నగదు మాయమవ్వడం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయించారు. స్కూళ్లు తెరుస్తున్న వేళ పిల్లల ఫీజుల కోసం దాచుకున్న నగదును సైబర్ నేరగాళ్లు కాజేసినట్లు సీఐ ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీలకు టీటీడీ చైర్మన్, 15 మంత్రి పదవులు కేటాయించాలి

- జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ డిమాండ్

కృష్ణలంక (విజయవాడతూర్పు): టీడీపీ మేనిఫెస్టో ప్రకారం చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే బీసీలకు ఇచ్చిన హామీలపైన మొట్టమొదటి సంతకం పెట్టాలని, టీటీడీ చైర్మన్ పదవి బీసీలకే ఇవ్వాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ శుక్రవారం డిమాండ్ చేశారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని, బీసీ రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు పెట్టాలని, బీసీలకు 15 మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీలు చూసి అత్యధిక శాతం బీసీలు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలన్నింటినీ మొదటి సంతకంతోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టిఫిన్ సెంటర్‌కు నిప్పంటించిన టీడీపీ కార్యకర్తలు

మద్దిపూడి: ప్రకాశం జిల్లా మద్దిపూడి మండలం గార్లపేటలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు దిండు నర్సింహారావు టిఫిన్ సెంటర్‌కు టీడీపీ కార్యకర్తలు నిప్పంటించారు. అతడు 15 ఏళ్లుగా బస్టాండ్ సెంటర్‌లో చిన్నబావి వద్ద టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవిస్తున్నాడు. టీడీపీ కార్యకర్తలు పూనాటి వెంకట్రావు, పూనాటి రవి గురువారం రాత్రి ఆ టిఫిన్ సెంటర్‌కు నిప్పంటించారు. దుకాణానికి ఏర్పాటు చేసిన పట్టలు, ఫర్నిచర్ కాలిపోయాయి. సిమెంటు రేకులను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన నర్సింహారావును దుర్భాషలాడారు. దుకాణం ఉన్న స్థలం తమదని, వెంటనే ఖాళీ చేయకపోతే చంపుతామని బెదిరించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సీహెచ్ శివబసవరాజు అక్కడికి చేరుకుని టీడీపీ కార్యకర్తలను చెదరగొట్టారు. రూ.50 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు నర్సింహారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిరుత పులి దాడిలో ఐదు మేకలు మృతి

పోలవరం రూరల్: చిరుత పులి దాడిలో ఐదు మేకలు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలం చేగొండిపల్లి పంచాయతీ పరిధిలోని ఉడతపల్లి గ్రామంలో జరిగింది. పోలవరం రేంజ్ అధికారి ఎస్.దావీదురాజు కథనం ప్రకారం... పాపికొండలు అభయారణ్య ప్రాంత సమీపంలో ఉడతపల్లి గ్రామంలో రెండు రోజుల కిందట చుండ్రు బుల్లబ్బాయికి చెందిన పశువుల పాకలో కట్టిన ఐదు మేకలపై చిరుత పులి దాడి చేసి చంపింది. బాధితుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలవరం అటవీ శాఖ సిబ్బంది పాదముద్రలను గుర్తించి చిరుత దాడిగా ధ్రువీకరించారు.

స్టేషన్‌లో పులివర్తి గ్యాంగ్ వీరంగం

చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో సీఐ, డీఎస్పీపై దాడి



ఏ.రంగంపేటలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



పాకాలలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పూల దుకాణం

- స్టేషన్‌కు పిలిచి విచారించడమే వారు చేసిన నేరం
- సీసీ కెమెరాల్లో దాడి దృశ్యాలు నమోదు
- ఏ.రంగంపేటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం
- పాకాలలో పార్టీ కార్యకర్త పూల అంగడిపై దాడి
- బాధితులందరినీ పరామర్శించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



టీడీపీ నాయకుల దాడితో వృద్ధుల అవస్థలపై ఆవేదన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మస్తాన్

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల అనంతరం తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో స్వైర విహారం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు ఏకంగా పోలీసు స్టేషన్‌లోనే అధికారులపై దాడులకు తెగబడ్డాయి. విజయోత్సవ ర్యాలీల ముసుగులో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు తెగబడుతున్న పచ్చ మూకలు నియోజక వర్గంలో భయానక పరిస్థితులను సృష్టించాయి. రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వార్డు సభ్యుడిపై దాడులకు దిగగా తాజాగా మరో కార్యకర్తపైనా టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 16 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డాయి.

వందల మందిని వెంటేసుకుని: చంద్రగిరిలోని కొత్తపేటకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అంగేరి రాజశేఖర్ శుక్రవారం ఉదయం ఓ దుకాణం వద్ద ఉండగా టీడీపీకి చెందిన ఉగ్రాణం గురునాథం మరి కొందరితో కలసి దాడి చేశాడు. గాయపడ్డ బాధితుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు టీడీపీ నాయకులను స్టేషన్‌కు రప్పించారు. ఈ విషయం తెలిసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అనుచరులు సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలతో అక్కడకు చేరుకున్నారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌ను స్టేషన్‌కు పిలిపించాలని సీఐని ఆదేశించారు. అనంతరం అక్కడకు చేరుకున్న మస్తాన్‌ను టీడీపీ కార్యకర్తలు చంద్రగిరి పోలీసు స్టేషన్ లోనే డీఎస్పీ రవికుమార్, సీఐ రామయ్య కళ్లెదుటే, సీసీ కెమెరాల సాక్షిగా మరోసారి చితకబాదారు.

సీఐ, డీఎస్పీపై దాడి

మస్తాన్‌పై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన సీఐ, డీఎస్పీలపై సైతం టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. దాడుల్లో డీఎస్పీ కింద పడిపోగా సీఐ తృటిలో తప్పించుకున్నారు. దీంతో పోలీసు సిబ్బంది డీఎస్పీని లోపలికి తరలించారు. అనంతరం నాని అనుచరులు మస్తాన్‌తో క్షమాపణ చెప్పించుకుని పంపించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు సమాచారం. దాడి ఘటనను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎస్పీ దృష్టికి తెచ్చాయి.

పాకాలలో పూల అంగడి ధ్వంసం

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశాడనే కక్ష్యతో పాకాలలో పూల అంగడి నిర్వహిస్తున్న సతీష్‌ను పులవర్తి నాని అనుచరులు చితకబాదారు. పూల అంగడిని ధ్వంసం చేసి పూలన్నీ రోడ్డుపై పారబోశారు. స్థానికులు వారించడంతో నిష్క్రమించారు.

చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం

- కార్యాలయ మేనేజర్‌కు రక్త గాయాలు
- బీభత్సం సృష్టించిన టీడీపీ కార్యకర్తలు
- బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి : తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లెకు సమీపంలోని ఏ.రంగంపేట పంచాయతీలో టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. రాడ్లు, కర్రలు, మారణాయుధాలతో దాడులు చేశారు. కార్యాలయ మేనేజర్ వంశీకి రక్తగాయాలయ్యాయి. కార్యాలయంలోని కంప్యూటర్, టీవీని ధ్వంసం చేశారు. ఫ్రిడ్జి, ఫర్నిచర్‌ను విరగ్గొట్టి రోడ్డుపై పడేశారు. బస్టాండ్ కూడలి వద్ద ఉన్న పార్టీ జెండా దిమ్మెను ధ్వంసం చేశారు. గంట పాటు గ్రామంలో నానా రభస చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేసేందుకు యత్నించారు. విధ్వంస దృశ్యాలను అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండటంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని చితకబాదారు. తన కుమారుడిని కొట్టొద్దని వేడుకున్న బాధితుడి తల్లిని సైతం తరిమి కొట్టారు. నడిరోడ్డుపై అల్లరిమూకల విధ్వంసంతో రంగంపేట ప్రజలు భయభ్రాంతులకు గురై తలోదిక్కుకు పరుగులు తీశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం రాత్రి గాయపడ్డ ఏ.రంగంపేటకు చెందిన వంశీ, ఆయన మాతృమూర్తిని పరామర్శించారు. చంద్రగిరిలో గాయపడ్డ రాజా, రామానుజపల్లి ఉపసర్పంచ్ శేఖర్‌తోపాటు ఇతర బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అన్నీ దేవుడు చూస్తున్నాడని, మళ్లీ మంచి రోజులు కచ్చితంగా వస్తాయని భరోసా కల్పించారు. ధ్వంసమైన పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. టీడీపీ కార్యకర్తలు ఫోన్‌లు చేసి తమను వేధిస్తున్నారని పలువురు మహిళలు చెవిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

వైఎస్సార్‌సీపీ వర్గాలపై టీడీపీ దాడులు

ఎంపీటీసీ సభ్యుడికి తీవ్రగాయాలు



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన మోహనరావు

శ్రీకాకుళం రూరల్/కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులు చేశారు. పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కృష్ణాపురంలో ఎంపీటీసీ సభ్యుడు జి.మోహనరావు ఇంటికెళ్లి ఆయనపై దాడిచేశారు. తల పగులగొట్టారు. ఆయన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మోహనరావును మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించారు. శ్రీకాకుళం మండలం బైరివానిపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శిమ్మ అప్పన్న, బగ్గు రామారావులపై టీడీపీ కార్యకర్తలు కర్రలతో దాడిచేసి కొట్టారు. గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది.

పల్నాడులో 144 సెక్షన్ ముగిసింది

- అవాంఛనీయ ఘటనలు జరిగితే మళ్లీ ఆంక్షలు విధిస్తాం
- కౌంటింగ్ చాలా ప్రశాంతంగా ముగిసింది: కలెక్టర్ శ్రీకేశ్ బి. లత్కర్
- పోలింగ్ రోజు నుంచి మొత్తం 1,330 మంది అరెస్ట్
- సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్ కొనసాగుతుంది: ఎస్పీ మలికా గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, పక్కన ఎస్పీ మలికా గార్గ్, జేసీ శ్యాంప్రసాద్

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో విధించిన 144 సెక్షన్ అమలు ముగిసిందని కలెక్టర్ శ్రీకేశ్ బి. లత్కర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఎస్పీ మలికా గార్గ్, జేసీ శ్యాంప్రసాద్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు జరిగిన ఘర్షణల నేపథ్యంలో జిల్లాలో 28 రోజులు 144 సెక్షన్ అమలు చేశామని, శాంతి భద్రతలు అదుపులోకి రావడంతో ఆ నిబంధన ఎత్తేశామని చెప్పారు. ర్యాలీలు, సమావేశాలకు మాత్రం పోలీసుల అనుమతి తప్పనిసరి అని అన్నారు. కౌంటింగ్ తరువాత జిల్లాలో చిన్న చిన్న ఘటనలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతాల్లో మాత్రం ఆంక్షలు అమలు చేస్తున్నామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా మళ్లీ ఆంక్షలు విధిస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సమయంలో గొడవలతో జిల్లాకు మచ్చ పడినప్పటికి, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగి జిల్లాకు తిరిగి మంచిపేరు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా కౌంటింగ్ ముగిసిన జిల్లాల్లో పల్నాడు ముందుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేలా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో 13,739 మంది సిబ్బంది, కౌంటింగ్‌లో 2,136 మంది పాల్గొన్నారన్నారు. ముఖ్యంగా జిల్లాలో 86.5 శాతం ఓటింగ్ నమోదు చేసిన ఓటర్లను ప్రత్యేకంగా అభినందించారు.

దాడులకు పాల్పడితే కఠిన చర్యలు: ఎస్పీ మలికా గార్గ్

కౌంటింగ్ ముగిసిన తరువాత జిల్లాలో అక్కడక్కడా గొడవలు జరుగుతున్నాయని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. గత రెండు రోజుల్లో గొడవలకు దిగిన వారిపై 46 కేసులు నమోదు చేసి, 140 మందిని అరెస్ట్ చేశామన్నారు. ప్రభుత్వ భవనాలపై రంగులు, విగ్రహాలు నచ్చకపోతే స్థానిక సంస్థలలో తీర్మానాలు చేసి అధికారికంగా మార్చాలని, చట్టాలను చేతుల్లోకి తీసుకోరాదన్నారు. సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పెట్రోలింగ్ కొనసాగుతుందని చెప్పారు. గ్రామాలలో శాంతి కమిటీలు ఏర్పాటు చేసి గొడవలు జరగకుండా ఆపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పోలింగ్ సమయంలో జిల్లాలో 168 కేసులు నమోదు చేసి 1,338 మందిని అరెస్ట్ చేశామని, త్వరలో ఛార్జిషీట్‌లు వేసి తప్పు చేసిన వారికి శిక్షలు పడేలా చూస్తామని చెప్పారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వి.జ్యోతిర్మయి

తిరుమల: తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వి. జ్యోతిర్మయి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా, బాలీవుడ్ చిత్ర నిర్మాత ఏక్తాకపూర్, సినీ నటుడు శివాజీ ఉన్నారు.

ఏడీసెట్-2024 రద్దు

ఇక వైఎస్సార్ ఏఎఫ్‌యూలో నేరుగా ప్రవేశాలు



ఏఎఫ్‌యూ: వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సి ఉన్న ఏడీసెట్-2024 (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఏడీసెట్-24 చైర్మన్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, కన్వీనర్ ఆచార్య ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వర్సిటీలోని బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ కోర్స్‌లో భాగంగా పెయింటింగ్, యానిమేషన్, అప్‌లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బి.డిజైన్ (ఇంటీరియర్ డిజైన్) కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 22న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులకు తగినంత సమయం ఇచ్చామన్నారు. కొన్ని విభాగాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో ఏడీసెట్-24ని రద్దు చేసి, డైరెక్ట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ విషయాన్ని ఏపీ ఉన్నతవిద్యామండలి దృష్టికి తీసుకువెళ్లగా ఏడీసెట్-24ని రద్దుచేసేందుకు అనుమతించారన్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ వారి అర్హత మార్కులు (ఇంటర్/డిప్లొమా), రోస్టర్, మెరిట్ ఆధారంగా నేరుగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూలును వచ్చేవారంలో విడుదల చేసి పదిరోజుల్లోపు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. ఏడీసెట్-24కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థికి సంబంధిత సమాచారాన్ని ఫోన్ ద్వారా, పత్రికల ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

హెక్టార్‌కు 2వేల కిలోల జీడిమామిడి దిగుబడి లక్ష్యం

జాతీయ జీడిమామిడి పరిశోధనల సమీక్షా కమిటీ చైర్మన్ డాక్టర్ టి.జానకీరామ్



నివేదికను హిమాన్షు పాథక్‌కు అందజేస్తున్న వీసీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హెక్టార్‌కు 2వేల కిలోలు జీడిమామిడి దిగుబడులు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు జాతీయ జీడిమామిడి పరిశోధనల సమీక్షా కమిటీ (క్యూఆర్‌టీ) చైర్మన్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరామ్ తెలిపారు. 2018–23 మధ్యకాలంలో జీడిమామిడి పంటపై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న 14 అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకాల ఫలితాల నివేదికను న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాథక్‌కు డాక్టర్ జానకీరామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3.35 లక్షల ఎకరాల్లో జీడిమామిడి సాగవుతుండగా, గ్రామ స్థాయిలో తీసుకుంటున్న చర్యల కారణంగా సగటు దిగుబడి 800 కిలోల నుంచి 1,150 కిలోలకు పెరిగిందని తెలిపారు. జాతీయ సగటు 750 కిలోలు మాత్రమేనని చెప్పారు. సమీప భవిష్యత్‌లో ఆంధ్రాలో హెక్టార్‌కు 2వేల కిలోల దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టామని వివరించారు. జీడిమామిడి నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా పెద్దపేటలోని జీడిమామిడి పరిశోధనా స్థానంలో కోర్ కలెక్షన్ సెంటర్ ఏర్పాటు, గత మూడేళ్లుగా సేవలందిస్తున్న బాపట్ల జీడిమామిడి పరిశోధనా స్థానానికి జాతీయ స్థాయిలో అవుట్ స్టాండింగ్ గ్రేడ్ ఇవ్వడం, నాణ్యమైన జీడి మొక్కల సరఫరా వంటి చర్యలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హెచ్‌కే సింగ్, సహాయ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వీపీ పటేల్, ఉన్నతాధికారులు డాక్టర్ దినకర్ అడిగా, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్ని హామీలను అమలు చేయాలి

- జోన్‌లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి
- కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి
- అప్సడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం


సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: టీడీపీ ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని అప్సడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం డిమాండ్ చేశారు. జోన్‌లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తింప చేస్తామని కూటమి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆక్వా సాగవుతున్న తీర ప్రాంత జిల్లాల్లో 5 వేల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్వా చెరువుల కోసం ఏవియేటర్లను సబ్సిడీపై అందించాలని సూచించారు. ఆక్వా రంగానికి సంపూర్ణ బీమా కల్పించాలన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గిస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. వీటిలో ఏ ఒక్క హామీని అమలు చేయకపోయినా ఆక్వా రైతుల తరపున టీడీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఆక్వా రంగ బలోపేతం కోసం అప్సడాతో పాటు ఏపీ ఫిష్ ఫీడ్, సీడ్ యాక్టులను తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ఆక్వా ఉత్పత్తులను అమ్ముకునేలా చేశారన్నారు. ఫీడ్ ధరలను కంపెనీలు మూడుసార్లు పెంచగా వాటిని ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కౌంట్‌ల వారీగా రొయ్యలకు మద్దతు ధరలు నిర్ణయించి రైతులకు మేలు చేశారని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆక్వా జోన్ వ్యవస్థను చక్కదిద్దారన్నారు.

అప్సడా పదవికి రాజీనామా

ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ పదవికి వడ్డి రఘురాం శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి తన రాజీనామా లేఖను పంపారు. 2026 మార్చి వరకు వైస్ చైర్మన్‌గా కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

‘శారదా మార్కెట్’ స్వాధీనంపై హైకోర్టు స్టే

- ఇప్పటికే ముగిసిన లీజు గడువు
- కోర్టును ఆశ్రయించిన వ్యాపారులు
- వారం పాటు ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న కోర్టు



నెహ్రూనగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఉన్న షాపుల లీజు కాలపరిమితి ముగియడంతో గత కొద్ది రోజుల క్రితం గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు షాపుల స్వాధీనానికి నోటీసులిచ్చారు. దీని విషయమై లీజుదారులు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు వారం పాటు ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఆదేశాలిచ్చింది. 13వ తేదీలోగా దీనికి సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు అందజేయాలని పేర్కొంది. కొల్లి శారదా మార్కెట్‌లో 1999లో 88 షాపులు నిర్మించారు. 25 ఏళ్ల లీజుతో షాపులను లీజుదారులకు అప్పగించారు. ఇటీవల గడువు ముగియడంతో వాటి స్వాధీనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఆ షాపులను కాపాడుకునేందుకు లీజుదారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రాంతం బస్టాండ్ దగ్గరలో ఉండటం.. అదీగాక హోల్‌సేల్ మార్కెట్ కావడంతో రైతుల క్రయ, విక్రయాలు, వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడ రోజుకు కొన్ని రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే వ్యాపారులు కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా, కొంత మంది రెవెన్యూ అధికారులే లీజుదారుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని అడ్డదారిలో షాపుల నిర్వహణకు సంబంధించి లూప్ హోల్స్ చెప్పి.. ఆ షాపులను నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకోకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి.

‘మధ్యవర్తిత్వం’పై ముగిసిన శిక్షణ

నగరంపాలెం: గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో ఒకటో ఏడీజే కోర్టు హాలులో మధ్యవర్తిత్వంపై జోన్‌లోని మూడు జిల్లాల జడ్జిలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎస్‌ఎంసీపీ-న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆధ్వర్యంలో ఐదు రోజులుగా గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లోని ఎంపికైన న్యాయాధికారులకు మధ్యవర్తిత్వంపై రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమానికి ఒకటో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వై.గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన వీకే బన్సాల్ (జిల్లా జడ్జి), మన్మోహన్‌శర్మ (జిల్లా జడ్జి) మధ్యవర్తిత్వంపై సమగ్రంగా అవగాహన కల్పించారు. చట్టంలోని మార్పులను, కక్షిదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి, ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం, గుంటూరు జోన్‌లోని జడ్జిలు పాల్గొన్నారు. వీకే బన్సాల్, మన్మోహన్‌శర్మలను జడ్జిలు ఘనంగా సత్కరించారు.

ఇంట్లోకి చొరబడిన కొండ చిలువ



కొండ చిలువను బంధిస్తున్న అటవీ సిబ్బంది

కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా): జనావాసాల్లోకి కొండ చిలువ వచ్చిన ఘటన కుప్పం మండలం, వేపనపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... వేపనపల్లి గ్రామంలో తిరుపతి అనే వ్యక్తి ఇంటి వద్దకు వేకువ జామున 10 అడుగుల భారీ కొండ చిలువ వచ్చింది. ఆరుబయట ఉన్న రెండు కోళ్లను మింగింది. కోళ్ల అలజడి విని బయటకు వచ్చిన తిరుపతి భారీ కొండ చిలువను చూసి భయంతో పరుగులు తీశాడు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఉదయం వచ్చి కొండ చిలువను పట్టి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీకి వస్తూ నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, నేతల ప్రతి నమస్కారాలు



ప్రధానిగా మోదీ అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతూ రాష్ట్రపతి ముర్ముకు లేఖను అందజేస్తున్న ఎన్డీఏ పక్షాల నేతలు

రేపే మోదీ ప్రమాణం

రాత్రి 7.15 గంటలకు ముహూర్తం

- ఎన్డీఏపీపీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అనంతరం రాష్ట్రపతిని కలిసిన మోదీ
- ప్రధానిగా నియమిస్తూ ముర్ము నిర్ణయం
- ప్రభుత్వ ఏర్పాటుకు నన్ను ఆహ్వానించారు
- రాష్ట్రపతితో భేటీ తర్వాత మీడియాతో మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనను ఆహ్వానించారు. ఆదివారం రాత్రి 7:15 గంటలకు మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ దిశగా శుక్రవారం హస్తినలో ఒకదాని వెంట ఒకటి పలు పరిణామాలు జరిగాయి. తొలుత ఉదయం 11.30కు నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) భాగస్వామ్య పక్షాలన్నీ సమావేశమై తమ పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. పార్లమెంటు పాత భవనం 'సంవిధాన్ సదన్' సెంట్రల్ హాల్లో జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు టీడీపీ, జేడీ(యూ), ఎల్జేపీ తదితర ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల అధినేతలు, ఎంపీలు పాల్గొన్నారు. ఎన్డీఏపీపీ నేతగా మోదీ పేరును బీజేపీ అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించగా కూటమి ఎంపీలంతా ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. అనంతరం ఎంపీలందరినీ ఉద్దేశించి మోదీ, ఆయన నాయకత్వాన్ని ప్రస్తుతిస్తూ భాగస్వామ్య పక్షాల నేతలు ప్రసంగించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా, లోక్‌సభలో బీజేపీ పక్ష నేతగా కూడా మోదీ ఎన్నికయ్యారు. తర్వాత ఆయన రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. ఎన్డీఏ ఎంపీల నిర్ణయాన్ని ఆమెకు తెలియజేశారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు మోదీని ముర్ము ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రపతి భవన్ వెలుపల మోదీ మీడియాతో మాట్లాడారు. ''నన్ను ఎన్డీఏ నేతగా ఎన్నుకున్నట్టు భాగస్వామ్య పక్షాలన్నీ రాష్ట్రపతికి తెలిపాయి. దాంతో ఆమె నన్ను ప్రధానిగా నియమించారు. ఆ మేరకు నాకు లేఖ అందజేశారు. ప్రమాణస్వీకారానికి అనువైన సమయం, నాతో పాటు కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసే నేతల వివరాలు కోరారు. ఆదివారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేస్తామని తెలిపాను. కాబోయే మంత్రుల జాబితాను ఆదివారానికల్లా రాష్ట్రపతి భవన్‌కు అందజేస్తా'' అని వివరించారు. 2047లో వందేళ్ల స్వాతంత్ర్యోత్సవాల నాటికి జాతి కలలను సంపూర్ణంగా సాకారం చేసే ప్రస్థానంలో 18వ లోక్‌సభ కీలక మైలురాయిగా నిలవనుందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ''ఇది నవ, యువ శక్తితో అలరారుతున్న సభ. దేశ ప్రజలు ఎన్డీఏకు మరోసారి అవకాశమిచ్చారు'' అని చెప్పారు. ఎన్డీఏ పక్షాలన్నీ మోదీకి మద్దతుగా శుక్రవారం మధ్యాహ్నమే రాష్ట్రపతికి లేఖలు అందజేశాయి.



మోదీకి చక్కెర కలిపిన పెరుగు తినిపిస్తున్న రాష్ట్రపతి ముర్ము

జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య... సమతూకంగా పాలన: బాబు, నితీశ్

జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతూకం పాటిస్తూ ఎన్డీఏ ప్రభుత్వ పాలన సాగాలని భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీ(యూ) ఆకాంక్షించాయి. ఎన్డీఏపీపీ నేతగా మోదీ పేరును రాజ్‌నాథ్ ప్రతిపాదించగా చంద్రబాబు (టీడీపీ), నితీశ్‌కుమార్ జేడీ(యూ), ఏక్‌నాథ్ షిండే (శివసేన), చిరాగ్ పాశ్వాన్ (ఎల్జేపీ–ఆర్వీ), హెచ్.డి.కుమారస్వామి జేడీ(ఎస్), అజిత్ పవార్ (ఎన్సీపీ), జితిన్‌రాం మాంఝీ తదితరులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు సారథ్యం వహిస్తున్నారని చంద్రబాబు అన్నారు. ''ప్రపంచ సారథిగా ఎదిగేందుకు భారత్‌కు ఇదో అద్భుతమైన అవకాశం. సమాజంలోని అన్ని వర్గాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేస్తూ పాలన సాగాలి'' అని ఆకాంక్షించారు. రాష్ట్రాల అభివృద్ధిని చిన్నచూపు చూడొద్దని నితీశ్ సూచించారు. దేశాన్ని అద్భుతంగా వృద్ధి పథంలో నడిపించడంతో పాటు బిహార్‌పైనా మోదీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. ''వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ విపక్షాలకు ఓటమి తప్పదు. వాళ్లు పనికిరాని కబుర్లు చెప్పి అక్కడా, ఇక్కడా గెలిచారు. వచ్చేసారి వారంతా ఓడటం ఖాయం'' అన్నారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం దేశం ఎవరి ముందూ తలొంచబోదని పవన్ కల్యాణ్ అన్నారు.

విరిసిన నవ్వులు...

ఎన్డీఏ భేటీ పలు ఆహ్లాదకర సన్నివేశాలకు వేదికైంది. తమ కూటమిది పటిష్టమైన ఫెవికాల్ బంధం అని షిండే అభివర్ణించగా నవ్వులు విరిశాయి. తనకు పాదాభివందనం చేసేందుకు నితీశ్ ప్రయత్నించగా మోదీ వారిస్తూ ఆలింగనం చేసుకున్నారు. చిరాగ్‌నూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను భుజం తట్టారు. పవన్ కల్యాణ్ 'పవనం కాదు, సుడిగాలి' అంటూ మోదీ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రశంసించారు.

రాజ్యాంగ ప్రతికి నమస్సులు

ఎన్డీఏ భేటీ కోసం సెంట్రల్ హాల్లోకి ప్రవేశించగానే మోదీ ముందుగా రాజ్యాంగ ప్రతిని తన నుదిటికి తాకించుకుని వందనం చేశారు. ఆ ఫొటోను ఎక్స్‌లో పెట్టి భావోద్వేగంతో కూడిన పోస్ట్ చేశారు. ''తన జీవితంలో ప్రతి క్షణమూ రాజ్యాంగం ప్రవచించిన గొప్ప విలువల పరిరక్షణకే అంకితం. నా వంటి వెనకబడ్డ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి దేశానికి సేవ చేయగలుగుతున్నాడంటే అది కేవలం మన రాజ్యాంగం గొప్పదనమే. అది కోట్లాది ప్రజలకు ఆశ, శక్తియుక్తులు, గౌరవాదరాలు కల్పిస్తోంది'' అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పదేళ్లుగా అడుగడుగునా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన మోదీ నేడిలా అదే రాజ్యాంగానికి ప్రణామాలు చేయడం విడ్డూరమంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ దుయ్యబట్టారు.

అద్వానీ, జోషి ఆశీస్సులతో...

రాష్ట్రపతిని కలిసే ముందు బీజేపీ కురువృద్ధులు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీలతో నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పక్ష నేతగా ఎన్నికవగానే వారి నివాసాలకు వెళ్లారు. ''అగ్ర నేతలు అద్వానీ, జోషీ ఆశీర్వాదం తీసుకున్నా. బీజేపీ బలోపేతానికి అద్వానీ చేసిన ఎనలేని కృషి పార్టీలోని ప్రతి కార్యకర్తలోనూ స్ఫూర్తి నింపింది. పార్టీ బాధ్యతల్లో పని చేసిన రోజుల్లో జోషీ నుంచి ఎంతో నేర్చుకున్నా'' అంటూ అనంతరం మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కూడా ఆయన భేటీ అయ్యారు.

పదేళ్ల పాలన ట్రైయిలరే...

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీఏను స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత బలీయమైన, విజయవంతమైన సంకీర్ణంగా నరేంద్ర మోదీ అభివర్ణించారు. ''మా సంకీర్ణం మూడుసార్లు పూర్తికాలం అధికారంలో కొనసాగింది. నాలుగోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఎన్డీఏ కేవలం అధికారం కోసం పుట్టుకొచ్చిన కొన్ని పార్టీల కలయిక కాదు. జాతి హితమే ఏకైక లక్ష్యంగా ఆవిర్భవించిన కూటమి. మేమెన్నడూ ఓడిపోలేదు. నిన్నా మేమే గెలిచాం. నేడూ మేమే గెలిచాం. భవిష్యత్తులోనూ మేమే గెలుస్తాం. విజయాన్ని ఎలా జీర్ణించుకోవాలో మాకు బాగా తెలుసు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ ఘనవిజయం సాధించినా జూన్ 4 (లోక్‌సభ ఎన్నికల ఫలితాల) తర్వాత మేం వినమ్రంగా ప్రవర్తించిన తీరే అందుకు నిదర్శనం'' అన్నారు. మరోవైపు విపక్షాలు కేవలం అధికార దాహంతోనే ఒక్కటయ్యాయంటూ ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే కలిశామని అవి స్వయంగా పేర్కొన్నాయని గుర్తు చేశారు. ''ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్నే దెబ్బ తీసేందుకు విపక్షాలు ప్రయత్నించాయి. ఎన్డీఏ ఎన్నికల విజయాన్ని కూడా ఓటమిగా చిత్రీకరించేందుకు విఫలయత్నం చేశాయి. ఫలితాలు వాటికి అనుకూలంగా రాలేదనే అక్కసుతో దేశవ్యాప్తంగా కల్లోలం రేపేందుకు కుట్ర చేశాయి'' అంటూ మండిపడ్డారు. శుక్రవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన కూటమి ఎంపీలను, అనంతరం భాగస్వామ్య పక్షాల అధినేతలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ''ప్రభుత్వ ఏర్పాటుకు మెజారిటీ అవసరం. దేశాన్ని నడిపేందుకు అన్ని విషయాల్లోనూ ఏకాభిప్రాయం మరింత అవసరం. పదేళ్లుగా పార్లమెంటులో నాణ్యమైన చర్చలను ఎంతగానో మిస్సయ్యా. విపక్ష నేతలు ఈసారైనా జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో

దేశాభివృద్ధికి మరింత శ్రమిస్తాం: మోదీ

అడుగు పెడతారని, అర్థవంతమైన చర్చలు చేస్తారని ఆశాభావంతో ఉన్నా'' అన్నారు. ''మన మధ్య పరస్పర వ్యతిరేకత ఉండొచ్చు. కానీ జాతి పట్ల వ్యతిరేకత ఉండకూడదు'' అని విపక్షాలకు సూచించారు.

ఎన్డీఏకు కొత్త నిర్వచనం

లోక్‌సభ ఎన్నికల విజయం పట్ల ఎన్డీఏ నేతలను మోదీ అభినందించారు. ఇందుకు కారకులైన లక్షలాది మంది కార్యకర్తలకు తాను అభివాదం చేసి తీరాలన్నారు. కేంద్రంలో ఏర్పడబోయే ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి అంశంలోనూ భాగస్వామ్య పక్షాలన్నింటి ఏకాభిప్రాయంతో, జాతి హితమే లక్ష్యంగా సాగుతుందని స్పష్టం చేశారు. ''ప్రజలు మాకు స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టారు. తద్వారా ప్రభుత్వాన్ని నడిపే సదవకాశమిచ్చారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటామని, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పథంలో నడుపుతామని మాటిస్తున్నా'' అని చెప్పారు. ''పదేళ్ల పాలనలో వృద్ధి పథంలో దేశాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు ఎంతగానో కృషి చేశాం. అదంతా కేవలం ట్రయిలర్ మాత్రమే. ఈ టర్ములో దేశాభివృద్ధి కోసం మరింతగా పాటుపడతాం. మేం కార్య సాధకులమని ప్రజలకు తెలుసు'' అన్నారు. ''సుపరిపాలనే మా కూటమికి పునాది. ఎన్డీఏ అంటే సరికొత్త (న్యూ), అభివృద్ధి చెందిన (డెవలప్డ్), ఆకాంక్షల (ఆస్పిరేషనల్) ఇండియా'' అని కొత్త నిర్వచనమిచ్చారు.

కాంగ్రెస్‌పై చెణుకులు

కాంగ్రెస్ పార్టీపై ఈ సందర్భంగా మోదీ చెణుకులు విసిరారు. ఆ పార్టీకి గత మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ కలిపి కూడా బీజేపీకి తాజా ఎన్నికల్లో వచ్చినన్ని స్థానాలు రాలేదంటూ ఎద్దేవా చేశారు. ఈసారి ఆ పార్టీ కనీసం వంద సీట్లు కూడా నెగ్గలేకపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ అద్భుత ప్రదర్శన చేసిందంటూ కొనియాడారు. ''దక్షిణాదిన ఎన్డీఏ జెండా ఎగిరింది. కేరళలో తొలిసారి ఖాతా తెరిచాం. ఏపీలో చరిత్రాత్మక విజయం సాధించాం. తమిళనాడులో కూడా ఎన్డీఏ గణనీయమైన ఓట్ల శాతం సాధించాం. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అతి తక్కువ సమయంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీకి భారీగా సీట్లు కట్టబెట్టారు. ఇటు ఒడిశాలోనూ దుమ్ము రేపాం. అటు అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ క్లీన్‌స్వీప్ చేశాం'' అన్నారు. మంత్రి పదవులు ఇప్పిస్తామంటూ వచ్చేవారిని, ఫేక్ న్యూస్‌ను అస్సలు నమ్మొద్దని ఎన్డీఏ ఎంపీలకు మోదీ సూచించారు.

ఈవీఎంలపై ఇప్పుడేమంటారు? విపక్షాలకు మోదీ చురక

ఇండియా కూటమి ప్రగతికి, ఆధునికతకు, టెక్నాలజీకి బద్ధ వ్యతిరేకి అని మోదీ ఆరోపించారు. విపక్షాలన్నీ గత శతాబ్దపు భావజాలంతో కొట్టుమిట్టాడుతున్నాయని, శరవేగంగా అగాథపు లోతుల్లోకి దిగజారుతున్నాయని దుయ్యబట్టారు. ఈవీఎంలపై చేసిన నిరాధార విమర్శలకు ఏం సమాధానమిస్తాయని ఎన్నికల్లో వాటి మెరుగైన ప్రదర్శనను ఉద్దేశించి ప్రశ్నించారు. ''ఈవీఎంలపై, ఎన్నికల సంఘంపై అనుమానాలు రేకెత్తించేందుకు ఎన్నికల ప్రక్రియ పొడవునా విపక్షాలు శక్తివంచన లేకుండా కృషి చేశాయి. సుప్రీంకోర్టులో కేసుల ద్వారా ఈసీ పనితీరును అడ్డుకోజూశాయి. వాటి తీరు చూసి ఫలితాలొచ్చాక ఏకంగా ఈవీఎంల శవయాత్ర చేస్తాయేమో అనుకున్నా! తీరా ఫలితాలు చూశాక విపక్షాల నోళ్లన్నీ మూతబడ్డాయి! ఈవీఎంలు ఇంకా బతికే ఉన్నాయా, చనిపోయాయా అని ఫలితాలొస్తున్న క్రమంలో ఒకరిని నేనడిగాను'' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దేశాన్ని అంతర్జాతీయంగా కూడా అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించినందుకు విపక్షాలను జాతి ఎన్నటికీ క్షమించబోదన్నారు.

15న లోక్‌సభ తొలి భేటీ!

న్యూఢిల్లీ: 18వ లోక్‌సభ తొలి సమావేశం ఈనెల 15వ తేదీన ప్రారంభం కావొచ్చని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. జూన్ మూడోవారంలో లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయని, తొలి రెండు రోజులు నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం. ఆ తర్వాత స్పీకర్‌ను ఎన్నుకుంటారు. మూడోరోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభల సంయుక్త సమావేశంలో మాట్లాడతారని వెల్లడించాయి. ప్రధాని మోదీ తన కొత్త మంత్రివర్గ సహచరులను ఉభయసభలకు పరిచయం చేస్తారు. జూన్ 22న సమావేశాలు ముగుస్తాయని తెలిపాయి. ఆదివారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం ముగిశాక కేబినెట్ భేటీ జరగనుంది. అందులో లోక్‌సభ సమావేశాల తేదీలపై తుది నిర్ణయం తీసుకుంటారు.

సమన్వయ కమిటీ!

నితీశ్ సారథ్యంలో సీఎంపీ: జేడీయూ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీఏ సర్కారు మనుగడకు కీలకంగా మారిన భాగస్వామ్య పక్షాలు బీజేపీ ముందు పలు డిమాండ్లు పెడుతున్నాయి. అందులో భాగంగా ఎన్డీఏ సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని జేడీ(యూ) డిమాండ్ చేస్తోంది. దాని కన్వీనర్‌గా పార్టీ చీఫ్, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ ఉండాలని కోరుతోంది. అంతేగాక ఎన్డీఏకు కనీస ఉమ్మడి ప్రణాళిక (సీఎంపీ) ఉండాలని, దాని అమలు కమిటీ సారథ్యాన్ని కూడా నితీశ్‌కు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. దీనికి అదనంగా నాలుగు కేబినెట్ బెర్తులు, బిహార్‌కు ప్రత్యేక హోదా తదితరాలను నితీశ్ ఇప్పటికే బీజేపీ పెద్దల ముందుంచారు. టీడీపీ కూడా నాలుగైదు కేబినెట్, ఒక సహాయ మంత్రి, లోక్‌సభ స్పీకర్ పదవి డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. టీడీపీ, జేడీ(యూ) డిమాండ్లకు బీజేపీ అంగీకరించడం లేదని తెలుస్తోంది. టీడీపీకి ఒకకేబినెట్, ఒకట్రెండు సహాయ పదవులను ఆఫర్ చేసినట్టు చేసినట్టు సమాచారం. జేడీ(యూ), ఇతర మిత్రపక్షాల డిమాండ్లపై వాటితో చర్చలు సాగుతున్నట్టు తెలుస్తోంది.

'ఏడాదిలోపే మధ్యంతరం'

రాయ్‌పూర్: లోక్‌సభకు ఆరు నెలల నుంచి ఏడాదిలోపే మధ్యంతర ఎన్నికలు ఖాయమని కాంగ్రెస్ నేత భూపేశ్ బఘెల్ శుక్రవారం జోస్యం చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ''బీజేపీకి చెందిన యూపీ సీఎం ఆదిత్యనాథ్, రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ పీఠాలు కదులుతున్నాయి. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ కూడా రాజీనామా చేయడం ఖాయం. రోజుకు మూడుసార్లు దుస్తులు మార్చుకునే అలవాటున్న మోదీ ఇప్పుడు ఒకే డ్రెస్‌తో మూడు కార్యక్రమాలకు వెళుతున్నారు. ఏం తిన్నదీ పట్టించుకోవడం మానేశారు'' అంటూ బఘెల్ ఎద్దేవా చేశారు.

వేదికపై చోటు దక్కని ఆర్ఎల్‌డీ

న్యూఢిల్లీ: పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్)లో శుక్రవారం ఎన్డీఏ భేటీ సందర్భంగా రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ) చీఫ్ జయంత్ చౌదరిని వేదికపైకి ఆహ్వానించకుండా ఎంపీల మధ్య కూర్చోబెట్టి బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆరోపించాయి. '' ఒక్క సీటు సాధించిన పార్టీలకూ వేదికపై బీజేపీ చోటిచ్చింది. ఇద్దరు ఎంపీలున్న ఆర్ఎల్‌డీని పట్టించుకోలేదు. ఆత్మాభిమానముంటే వెంటనే ఎన్డీఏను వీడండి. మిమ్మల్ని అవమానిస్తే సహించకండి' అని జయంత్‌కు ఎస్పీ ఎంపీ రాజీవ్ రాయ్ హితవు పలికారు. కుర్చీలను బట్టి గౌరవం మారదని, అదేమంత పెద్ద విషయం కాదని ఆర్ఎల్‌డీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ బదులిచ్చారు.

రష్యాలో నదిలో మునిగి... మన విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ: రష్యాలోని వెలికీ నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న నలుగురు భారత వైద్య విద్యార్థులు వోల్ఖోవ్ నదిలో మునిగి దుర్మరణం పాలయ్యారు. మంగళవారం ఈ దుర్ఘటన జరిగినట్టు విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. ఒక మహిళా విద్యార్థిని కాపాడి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. విద్యార్థులంతా వెలికీ నోవ్‌గోరోడ్ స్టేట్ వర్సిటీలో చదువుతున్నారు. మృతులంతా మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాకు చెందిన వారు. మృతుల్లో జియా, జిషాన్ అక్కాతమ్ముళ్లు. నది ఒడ్డున వాకింగ్ తర్వాత వారంతా నదిలోకి దిగారు. ఈత కొడుతుండగా జిషాన్ తమ కుటుంబసభ్యులకు వీడియో కాల్ చేశాడు. ఈత వద్దని కుటుంబసభ్యులు ఫోన్లో వారిస్తుండగానే జియా మునగడం, కాపాడేందుకు ప్రయత్నిస్తూ మిగతావారు కూడా నదిలో కొట్టుకుపోవడం కాల్‌లో రికార్డయింది. మృతదేహాల తరలింపు కోసం భారత కాన్సులేట్ ప్రయత్నిస్తోంది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు... 18 మంది దుర్మరణం

డెయిర్ అల్ బలాహ్(గాజా): సెంట్రల్ గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. నుసెయిరత్‌లో ఐరాస శరణార్థి శిబిరం నడుస్తున్న స్కూలుపై గురువారం జరిపిన దాడిలో 33 మంది చనిపోయిన విషయం తెల్సిందే. ఇజ్రాయెల్ సైన్యం డెయిర్ అల్ బలాహ్, జవాయిడా పట్టణాల్లోని సెయిరత్, మఘాజి శరణార్థి శిబిరాలపై శుక్రవారం రాత్రి జరిపిన దాడుల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నట్లు అల్–హక్సా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కాగా, గురువారం నుసెయిరత్‌లోని స్కూల్‌పై జరిపిన దాడిని ఇజ్రాయెల్ సమర్థించుకుంది. స్కూల్ భవనంలోని రెండు, మూడు అంతస్తుల్లో జరిగిన లక్షిత దాడుల్లో మృతి చెందిన వారిలో 9 మంది మిలిటెంట్లు ఉన్నట్లు వివరించింది. రెండు రోజులుగా జరుపుతున్న దాడుల్లో మిలిటెంట్ల సొరంగాలను, మౌలిక వసతులను ధ్వంసం చేసినట్లు ఆర్మీ తెలిపింది.



ఐఎస్ఎస్‌లోకి ప్రవేశిస్తున్న సునీత



అనంతరం ఆనందంతో డాన్స్ చేస్తున్న దృశ్యం

ఐఎస్ఎస్‌లోకి సునీత

హూస్టన్: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి గమ్యస్థానం చేరుకున్నారు. బోయింగ్ కంపెనీ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో బుధవారం అంతరిక్ష ప్రయాణం ప్రారంభించిన ఇద్దరు సాహసికులు గురువారం మధ్యాహ్నం 1.34 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి(ఐఎస్ఎస్) విజయవంతంగా అడుగుపెట్టారు. అవాంతరాలను అధిగమించి స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. ఐఎస్ఎస్‌లో ఇప్పటికే ఏడుగురు వ్యోమగాములుండగా, సునీత, బుచ్ విల్‌మోర్‌తో తొమ్మిదికి చేరారు. కొత్తగా తమ వద్దకు చేరిన సునీతా, విల్‌మోర్‌కు ఏడుగురు ఆస్ట్రోనాట్స్ ఘన స్వాగతం పలికారు. ఆలింగనం చేసుకున్నారు. సునీత ఆనందంతో నృత్యం చేశారు. వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. ''ఐఎస్ఎస్ వ్యోమగాములంతా నా కుటుంబ సభ్యులే. వారిని కలుసుకున్నందుకు వేడుక చేసుకున్నా. ఇదో లిటిల్ డ్యాన్స్ పార్టీ'' అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ వారం తర్వాత స్టార్‌లైనర్‌లో భూమిపైకి తిరిగి రానున్నారు.

నేడు కాంగ్రెస్ కీలక భేటీలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కీలక సమావేశం శనివారం ఢిల్లీలోని అశోక హోటల్‌లో జరుగనుంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ అగ్రనేతలు చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సంప్రదింపులు జరుపుతారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతోపాటు వివిధ రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతలు ఈ భేటీలో పాల్గొంటారు. సమావేశం తర్వాత విందు ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. అలాగే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం సాయంత్రం 5.30 గంటలకు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించనున్నారు. కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలతోపాటు రాజ్యసభ సభ్యులు సైతం ఈ భేటీలో పాల్గొంటారని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తెలిపారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్ష నేతగా రాహుల్ గాంధీని ఎన్నుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు. పార్లమెంటరీ పార్టీ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది.

రాహుల్ రెండు వారాల్లోగా తేల్చుకోవాలి

న్యూఢిల్లీ: రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో నెగ్గిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ సీటును వదులుకోవాలో తేల్చుకోవడానికి మరో 11 రోజులే మిగిలి ఉన్నాయి. చట్టం, రాజ్యాంగం నిబంధనల ప్రకారం ఏదైనా ఒక అభ్యర్థి రెండు చోట్ల నుంచి గెలుపొందితే.. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి రెండు వారాల్లోగా ఏదో ఒక సీటును వదులుకోవాల్సి ఉంటుందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, రాజ్యాంగ నిపుణులు పి.డి.టి. ఆచారి శుక్రవారం తెలిపారు. 17వ లోక్‌సభ రద్దయినా.. కొత్త ప్రొటెం స్పీకర్ వచ్చేవరకు స్పీకర్‌గా ఓం బిర్లా కొనసాగుతారని, అయనకు రాహుల్ తన రాజీనామా లేఖను పంపాల్సి ఉంటుందని వివరించారు. రెండు వారాల్లోగా నెగ్గిన రెండు సీట్లలో ఒకదాన్ని వదులుకోకపోతే.. రెండు సీట్లూ కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆచారి తెలిపారు. రెండుసార్లు గెలిపించిన వయనాడ్ (కేరళ), తమ కుటుంబానికి కంచుకోట అయినా రాయ్‌బరేలి (ఉత్తరప్రదేశ్)లలో రాహుల్ దేన్ని వదులుకుంటారో వేచిచూడాలి.

స్పీకర్ పోస్టు తీసుకోండి: ఆదిత్య ఠాక్రే

ముంబై: అధికార ఎన్డీయేలో కీలక భాగస్వాములుగా మారినందున లోక్‌సభ స్పీకర్ పదవి కోసం పట్టుబట్టాలని తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ)కు శివసేన(ఉద్ధవ్) నేత ఆదిత్య ఠాక్రే సూచించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే మిత్రపక్షాలను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవాలంటే లోక్‌సభ స్పీకర్ పోస్టు తీసుకోవాలని టీడీపీ, జేడీ(యూ)కు స్పష్టంచేశారు. బీజేపీ కుతంత్రాలకు తాము కూడా బాధితులేమని వెల్లడించారు. శివసేన, ఎన్సీపీలో జరిగిన చీలికలను ఆదిత్య ఠాక్రే గుర్తుచేశారు.

నెహ్రూతో పోలికేంటి?: చిదంబరం

చెన్నై: వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టనుండటాన్ని గతంలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డుతో ప్రధాని మోదీ పోల్చుకోవడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తప్పుపట్టారు. 2014 ఎన్నికల్లో మోదీ సారథ్యంలో బీజేపీ 282 సీట్లను, 2019లో 303 సీట్లను, తాజాగా సగానికి 32 సీట్లు తక్కువగా 240 సీట్లు మాత్రమే సాధించిందని ఆయన పేర్కొన్నారు. అదే నెహ్రూ హయాంలో కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల్లో 361, 374, 364 సీట్లు సాధించిందని గుర్తు చేశారు. నెహ్రూతో మోదీ తనను తాను పోల్చుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీయే కాదు ప్రజలు కూడా అంగీకరించరని చిదంబరం కుండబద్దలు కొట్టారు.

కౌర్‌కు మద్దతుగా రేపు రైతుల ర్యాలీ

చండీగఢ్: ఎయిర్‌పోర్టుపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌కు పలు రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆమెకు అండగా ఉంటామని, చండీగఢ్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకున్న ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, నిజానిజాలు బయటకు రావాలని సంయుక్త కిసాన్ మోర్చా నేత జగజీత్ సింగ్ దలీవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి శర్వాన్‌సింగ్ అన్నారు. త్వరలో పంజాబ్ డీజీపీని కలుస్తామని చెప్పారు. మహిళా కానిస్టేబుల్‌కు అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రైతులతోపాటు పంజాబ్ ప్రజల మనోభావాలను కంగనా రనౌత్ గాయపర్చారని శర్వాన్ సింగ్ విమర్శించారు. కుల్విందర్ కౌర్‌కు న్యాయం చేకూర్చాలని డిమాండచేస్తూ ఈ నెల 9న పంజాబ్‌లోని మొహాలీలో 'ఇన్సాఫ్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు రైతులు సంఘాలు శుక్రవారం ప్రకటించాయి.

కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిలివ్వొద్దు: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న సీఎం కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం ఢిల్లీ కోర్టును కోరింది. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తమ వద్ద పక్కాగా చాలా ఆధారాలున్నాయని స్పెషల్ కోర్టు జడ్జి కావేరీ బవేజాకి తెలిపింది. తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన కేజ్రీవాల్‌ను బెయిల్‌పై విడుదల చేస్తే కేసు దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించింది. దీంతో, తదుపరి వాదనలను 14వ తేదీకి వాయిదా వేస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉండటం తెల్సిందే.

రాహులే విపక్ష నేత కావాలి: శశిథరూర్

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేత హోదాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సరిగ్గా సరిపోతారని తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. నాలుగోసారి ఎంపీగా గెలిచిన సందర్భంగా శుక్రవారం పీటీఐ ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ''ఇన్నాళ్లూ ఎవరి సలహాలు తీసుకోని మోదీ, అమిత్ షాలకు ఈసారి ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం సవాల్‌తో కూడిన పనే. ప్రత్యేక హోదాలు, అగ్నివీర్ పథకం సమీక్షలు అంటూ ఏపీ, బిహార్‌లోని ఎన్డీఏ పార్టీలు బీజేపీ ప్రభుత్వానికి చిక్కుల ముడి వేస్తున్నాయి. రాహుల్, ఖర్గేలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశారు. రాహుల్.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్. లోక్‌సభలో విపక్ష నేతగా ఆయనే ఉండాలి. ఆ హోదాకు ఆయన సరిగ్గా సరిపోతారు''. అని వ్యాఖ్యానించారు.

'నీట్'పై కేంద్రం బదులివ్వాల్సిందే: ప్రియాంక

సాక్షి, న్యూఢిల్లీ: నీట్ పరీక్ష పేపర్ లీకైనప్పటి నుంచి తాజాగా ఫలితాలు వెలువడే వరకు భారీ కుంభకోణం జరిగి ఉంటుందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ అనుమానం వ్యక్తం చేశారు. నీట్ యూజీ ఫలితాలు వెలువడినప్పటి నుంచి 'ఎక్స్'వేదికగా 'నీట్ పేపర్‌ని రద్దు చేయండి'అనే హ్యాష్‌ట్యాగ్‌తో ట్రెండ్ అవుతోంది. దీనిపై శుక్రవారం ప్రియాంకా గాంధీ 'ఎక్స్'లో స్పందించారు. 'మొదట నీట్ పేపర్ లీకయిందని, ఇప్పుడు ఫలితాల్లోనూ స్కామ్ జరిగిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు వంద శాతం మార్కులు తెచ్చుకోవడంతో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఫలితాల అనంతరం దేశవ్యాప్తంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వార్తలు రావడం బాధాకరం, దిగ్భ్రాంతికరం. లక్షలాది మంది విద్యార్థుల ప్రశ్నలకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు? ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత లేదా?'అంటూ ప్రియాంక కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

బెంగళూరు: కర్ణాటక బీజేపీ శాఖ ఫిర్యాదు మేరకు నమోదైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆయనకు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో రెండుసార్లు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు అడిగినందుకు న్యాయస్థానాన్ని క్షమాపణ కోరారు. దీంతో ఆయనకు రూ.75 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకలో 2019 నుంచి 2023 దాకా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ 2023 మే 5న పత్రికల్లో కేపీసీసీ తరఫున ప్రకటనలిచ్చారు. అవినీతి రేటు కార్డు, 40 శాతం కమిషన్ ప్రభుత్వం శీర్షికలతో అవి ప్రచురితమయ్యాయి. వాటిని రాహుల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కర్ణాటక బీజేపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం ; 8 ; జూన్ ; 2024



బెంగళూరు నగరంలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం వర్షం కురిసి తెరిపిచ్చిన తరువాత ఆకాశంలో ఇంద్రధనుస్సు ఆవిష్కృతమైంది. ఈ దృశ్యం నగరంలోని జయనగరలో కనిపించింది.

న్యూస్‌రీల్

సమయస్ఫూర్తిని అలవరుచుకోవాలి



రిజర్వు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కమిషనర్

బనశంకరి: ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల్లో సమయస్ఫూర్తి కనిపించడం లేదని, కనీస సమాచారం కూడా వారి వద్ద ఉండటం లేదని నగర పోలీస్ కమిషనర్ దయానంద ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఛణిసంద్రలో నగర రిజర్వు పోలీస్ బలగాలు కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన నెలవారీ కవాతులో కమిషనర్ దయానంద్ గౌరవవందనం స్వీకరించి మాట్లాడారు. బెంగళూరు నగర పోలీసులు సరైన కమాండ్, డ్రిల్స్ సమంజసంగా చేయడంలేదని సిబ్బందిలో డ్రిల్స్ తగ్గినట్లు కనబడుతుంది. సరైన కమాండ్ ఏవిధంగా ఇవ్వాలి అనేది తెలియదు. దీనిని సరిదిద్దుకోవాలన్నారు. ఏసీపీ, డీసీపీలు దీనిపై శ్రద్ధ చూపాలని అనేక సందర్భాల్లో తప్పు కమాండ్ చేస్తున్నప్పటికీ మూగ ప్రేక్షకుల్లా నిలబడ్డారని, దీనిని సరిదిద్దుకోవాలని తెలిపారు. యూనిఫాం పట్ల టర్న్‌ఔట్, క్రమశిక్షణ విధుల్లో భాగమన్నారు. ప్రతి శుక్రవారం పోలీస్‌స్టేషన్ స్థాయిలో నిర్వహించే పరేడ్‌లో ఏసీపీ, డీసీపీలు పాల్గొని సిబ్బందికి జాగ్రత్తం చేయాలని సూచించారు. జూలై 1 నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తాయని దీనిపై అధికారులు సిబ్బంది పూర్తి సమాచారం తెలుసుకోవాలని తెలిపారు.

కుక్కల దాడిలో మహిళ మృతి

యశవంతపుర: వీధి కుక్కల దాడిలో మహిళ మృతి చెందిన ఘటన దావణగెరెలో జరిగింది. రత్నమ్మ(51) అనే మహిళ ఆస్పత్రిలో అటెండర్‌గా పని చేస్తోంది. ఆమె తన కుమారుడితో కలిసి బైక్‌పై జగ్జీవన్‌రాం నగర్ సమీపంలోని మారెమ్మ ఆలయానికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకొని బయటకువచ్చి బైక్ స్టార్ట్ చేయగానే వెనుక కూర్చున్న రత్నమ్మపై కుక్కలు దాడి చేశాయి. కాళ్లకు గాయాలైన ఆమె కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. గాంధీనగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అరటి పండులో విషం.. వానరాల మృతి

యశవంతపుర: అరటి పండులో పురుగుల మందు కలిపి వానరాలను హతమార్చిన ఉదంతం చిక్కమగళూరు జిల్లా ఎన్‌ఆర్ పుర తాలూకా ద్యావణ అటవీ ప్రాంతంలో జరిగింది. ద్యావణ గ్రామం వద్ద 30 వానరాల కళేబరాలు పడి ఉండగా స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా కళేబరాల పక్కనే అరటి పండ్లు పడి ఉన్నాయి. అందులో విషం కలిపినట్లు నిర్ధారించారు. వాటిని తిన్నందునే 16 మగ, 14 మగ, మరో నాలుగు పిల్ల వానరాలు మృతి చెందినట్లు నిర్ధారించారు.

చెరో మూడు స్థానాల్లో గెలుపు

- ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు ముగిసిన ఓట్ల లెక్కింపు
- జేడీఎస్- బీజేపీకి 3, కాంగ్రెస్‌కు 3



నైరుతి ఉపాధ్యాయ స్థానం నుంచి విజయం సాధించి డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న బీజేపీ, జేడీఎస్ కూటమి అభ్యర్థి భోజేగౌడ

శివాజీనగర/మైసూరు: విధాన పరిషత్‌లో ఖాళీ అయిన మూడు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ 3, జేడీఎస్, బీజేపీ కూటమి మూడు స్థానాల్లో (జేడీఎస్-2, బీజేపీ-1) విజయం సాధించింది. కాగా బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గంలో మూడు దశాబ్దాలకు పైగా ఆధిపత్యం కొనసాగిస్తున్న బీజేపీ ఈ ఎన్నికల్లో చతికిలపడింది. ఈశాన్య, బెంగళూరు, నైరుతి పట్టభద్రుల నియోజకవర్గాలతోపాటు ఆగ్నేయ, నైరుతి, దక్షిణ ఉపాధ్యాయ స్థానాలకు ఈనెల 3న ఎన్నికలు జరిగాయి. గురువారం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమై శుక్రవారం ముగిసింది. బెంగళూరు పట్టభద్రుల, ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం, ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు సాధించింది. నైరుతి పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించింది. దక్షిణ, నైరుతి ఉపాధ్యాయ స్థానాల్లో జేడీఎస్ గెలుపొందింది. మూడు దశాబ్దాలకు పైగా బీజేపీ భద్రకోట అయిన బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పాగా వేసింది. బీజేపీ మద్దతుదారుడు దేవేగౌడపై కాంగ్రెస్ మద్దతుదారుడు రామోజీగౌడ 11,841 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో కూడా బీజేపీ ఓటమిపాలైంది. గత మూడు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులే ఎన్నికవుతున్న ఈ నియోజకవర్గంలో హస్తం సత్తా చాటింది. కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి ఎం.కృష్ణప్ప అల్లుడు డీ.టీ.శ్రీనివాస్ బీజేపీ నారాయణస్వామిపై 767 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న బీజేపీ-జేడీఎస్.. పరిషత్ ఎన్నికల్లో కూడా ఉమ్మడిగా పోటీ చేశారు. జేడీఎస్ 2 నియోజకవర్గాల్లో, బీజేపీ 4 నియోజకవర్గాల్లో పోటీ చేశాయి. కాంగ్రెస్ 6 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీ చేయించింది. ఇందులో జేడీఎస్ పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో కూడా విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 3 స్థానాల్లో విజయం సాధించగా బీజేపీ ఒక చోట మాత్రమే గెలుపొందింది. నైరుతీ పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ-జేడీఎస్ మిత్రకూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన బీజేపీ మద్దతుదారుడు డాక్టర్ ధనుంజయ సర్జి కాంగ్రెస్‌కు చెందిన ఆయనూరు మంజునాథ్‌పై 6,935 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసిన రఘుపతిభట్ 3వ స్థానానికి చేరుకున్నారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గంలో జేడీఎస్ అభ్యర్థి వివేకానంద కాంగ్రెస్ అభ్యర్థి మరితిబ్బేగౌడపై 4,622 ఓట్ల మెజార్టీ ఓట్లతో గెలుపొందాడు. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గంలో జేడీఎస్‌కు చెందిన ఎస్.ఎల్.భోజేగౌడ కాంగ్రెస్‌కు చెందిన కే.కే.మంజునాథ్‌పై 5,267 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌పై 4,446 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు.

బెస్కాం ఉద్యోగులపై మృత్యు పంజా

- గుంతలోకి దూసుకెళ్లిన కారు
- ముగ్గురు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు



గుంతలోకి దూసుకెళ్లి ధ్వంసమైన కారు



చెట్టుపై వేలాడుతున్న మృతదేహం



వ్యక్తి మృతదేహం

గౌరిబిదనూరు: కారులో వెళ్తున్న బెస్కాం ఉద్యోగులపై మృత్యువు పంజా విసిరి ముగ్గురిని బలిగొంది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం తాలూకాలోని వాటంకొత్తపల్లి వద్ద జరిగింది. తాలూకాలోని తండాకు చెందిన బెస్కాంకు చెందిన శ్రీధర్ (31), పేరేసంద్రకు చెందిన వేణుగోపాల్ (38), బెల్లావుళహళ్లికి చెందిన మంజునాథ (34)లు బెస్కాంలో పనిచేస్తున్నారు. వీరు మరో వ్యక్తితో కలిసి కారులో వెళ్తుండగా గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో వాటాం కొత్తపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి పల్టీలు కొట్టి గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో డోర్లు తెరుచుకొని అందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. ముగ్గురు ఉద్యోగులు మృతి చెందగా దావణగెరెకు చెందిన శివకుమార్(28)కు గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు ఒక ఉద్యోగి మృతదేహం చెట్టుపైకి ఎగిరిపడి వేలాడింది. దీంతో ఘటన స్థలం భయానకంగా మారింది. గౌరిబిదనూరు పోలీసులు వచ్చి క్షతగాత్రున్ని బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాసులు కురిపిస్తున్న టమాట

- 15 కిలోల బాక్సు ధర రూ.700
- టోకు మార్కెట్‌లో కిలో ధర రూ.50
- కొనలేకపోతున్న వినియోగదారులు



ఏపీఎంసీ మార్కెట్‌కు వచ్చిన సరుకు

కోలారు: టమాట ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా రైతులకు మార్కెట్‌లో కాసుల పంట పండుతోంది. రెండు రోజులుగా కోలారు ఏపీఎంసీ మార్కెట్‌లో 15 కిలోల నాణ్యమైన టమాట బాక్సు ధర రూ.700 పలికింది. టోకు మార్కెట్‌లో కిలో ధర రూ.45 నుంచి రూ.50 వరకు ఉంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వేసవి కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌కు పెద్దగా సరుకు రావడం లేదు. దీంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏపీఎంసీ మార్కెట్ యార్డుకు గురువారం 8500 క్వింటాళ్ల టమాట వచ్చింది. గత సంవత్సరం ఇదే సీజన్లో మార్కెట్‌కు దాదాపు 15 వేల క్వింటాళ్ల దిగుబడి ఉండింది. ఏప్రిల్ నెలలో విపరీతమైన ఎండలు, ప్రస్తుతం కురుస్తున్న వానలకు టమాట దిగుబడి తగ్గుతోందని రైతులు అంటున్నారు. తెగుళ్ల బాధ, వాతావరణ వైపరీత్యం వల్ల కూడా టమాటా దిగుబడి బాగా తగ్గిందని రైతులు అంటున్నారు. వాతావరణంలో మార్పులను చూసి రైతులు కూడా టమాటా సాగుకు విముఖత చూపడం వల్ల దిగుబడి తగ్గిందని ఏపీఎంసీ మార్కెట్ యార్డు సెక్రటరీ విజయలక్ష్మి తెలిపారు. రాబోయే 15 రోజుల్లో మార్కెట్‌కు టమాట సరఫరా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. టమాట ధరలు రైతులకు లాభాలు కురిపిస్తుండగా వినియోగదారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

అధికారి ఆత్మహత్యాయత్నం

రాయచూరు రూరల్: మధ్యాహ్న భోజన పథకం అధికారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన లింగసూగూరులో చోటు చేసుకుంది. తాలూకా మధ్యాహ్న భోజన పథకం అధికారిగా మౌనేష్ కంబార్ పనిచేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల వేధింపులతో మనస్తాపానికి గురైన ఆయన గురువారం రాత్రి 44 నిద్ర మాత్రలు మింగాడు. దీంతో బళ్లారిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. ఈయన నెల రోజుల క్రితం యాదగిరి జిల్లా సురపుర నుంచి పదోన్నతిపై లింగసూగూరుకు బదిలీ అయ్యారు.

సినిమాలకు గుడ్‌బై : నిఖిల్

యశవంతపుర: రాజకీయాలలో బిజీగా ఉన్న కారణంగా సినిమా రంగానికి దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి కుమారుడు నిఖిల్ కుమారస్వామి తెలిపారు. మండ్యలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... సినిమాలకు గుడ్‌బై చెప్పాను. 2019లో మండ్యలో తనను ఓడించారు. అనేక తప్పులు వల్ల వెనకడుగు వేశా. ఇప్పుడు మండ్య ప్రజలు స్థానం ఇచ్చినట్లు చెప్పారు. తన తండ్రి కుమారస్వామి సీఎంగా ఉన్న సమయంలో మండ్యలో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. త్వరలో చెన్నపట్టణలో ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తానన్నారు.

జీవన భృతి ఇవ్వాల్సిందే

యశవంతపుర: ఉద్యోగం లేదనే సాకుతో విడాకులు తీసుకున్న భర్త భార్యకు జీవన భృతి ఇవ్వాల్సిందేనని రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. బెళగావికి చెందిన దంపతులు విడాకులు తీసుకున్నారు. భార్యకు జీవన భృతి ఇవ్వాలని బెళగావి కుటుంబ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ బాధితుడు హైకోర్టులో పిటిషన్ వేశాడు. హైకోర్టు సింగిల్ బెంచ్ న్యాయమూర్తి సచిన్ శంకర్ మగదుమ్ కేసును విచారణ చేశారు. ఉద్యోగం లేదనే కారణంగా భార్యకు జీవనభృతి ఇవ్వటానికి సాధ్యం కాదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. విడాకులు తీసుకున్న తరువాత వేరువేరుగా ఉంటున్నారు. భార్యకు, ఆమె పోషిస్తున్న చిన్నారికి జీవన భృతి ఇవ్వలేమని చెప్పుకున్నారు. ఉద్యోగం లేదనే సాకుతో భార్యకు జీవన భృతి ఇవ్వలేమని చెప్పడం తగదని, ప్రతినెల రూ. 7 వేలు, చిన్నారికి రూ.3 వేలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

బెంగళూరు చేరుకున్న మృతదేహాలు

- విమానాశ్రయంలో బంధువులకు అప్పగింత
- మిన్నంటిన రోదనలు

యశవంతపుర: విహారయాత్రకు వెళ్లి ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా సహస్రతాల్ మంచు పర్వతాల్లో చెలరేగిన మంచుతుపాన్‌లో చిక్కుకొని అశువులుబాసిన 9మంది మృతదేహాలు శుక్రవారం బెంగళూరు చేరుకున్నాయి. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ నేతృత్వంలో అధికారులు మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాలకు ఎంబాయింగ్ నిర్వహించి ఢిల్లీ విమానశ్రయానికి తరలించి అక్కడ నుంచి బెంగళూరుకు తీసుకొచ్చారు. మృతుల్లో కర్ణాటక మౌంటినీరింగ్ సంఘం స్థాపకుడు సుధాకర్(71), సింధు వకీలం(44), సుజాత ముంగుర్‌వాడి(52), ఆమె భర్త వినాయక్ బి(52), చిత్రా ప్రణీత్(48), కె.వెంకటేశ్ ప్రసాద్(53), కేపీ పద్మనాభ(50), అనితా రంగప్ప(55),పద్మిని హెగ్డే(34) ఉన్నారు. వీరందరూ బెంగళూరు వాసులే. విపత్తు నుంచి తప్పించుకొని 13 మంది బెంగళూరుకు చేరుకున్నట్లు మంత్రి కృష్ణబైరేగౌడ తెలిపారు. ప్రాణాపాయం నుంచి బయటపడిన ట్రెక్కీలైన సౌమ్యకెనాలె, స్మృతిశీనాలక్ష్మి, ఎస్ శివజ్యోతి, అనిల్, భరత్ బొమ్మనగౌడర్, మధుకిరణ్‌రెడ్డి, బీఎస్ జైప్రకాశ్, ఎస్ సుధాకర్, ఎం కె వినయ్, వివేక్‌శ్రీధర్, ఎం నవీన్, రితికా జిందాల్‌ను విమానం ద్వారా బెంగళూరుకు తరలించారు. మే 29న ఉత్తరకాశీ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ట్రెక్కింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగింది.

మృత్యువులోనూ ఒక్కటై...

పర్వతారోహణకు అసువులుబాసిన వారిలో హుబ్లీకి చెందిన వినాయక ముంగురవాడి, సుజాత ముంగురవాడి దంపతులది హుబ్లీ. వీరు బెంగళూరులో ఉంటున్నారు. ఇద్దరూ హుబ్లీ బీవీబీ కాలేజీలో 1994లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. వినాయక మెకానికల్ ఇంజనీరింగ్‌లో బంగారు పతకం సాధించారు. హుబ్లీ ఉణకల్‌లో నివాసం ఉన్న ఇద్దరూ ఉద్యోగం కోసం 1996లో బెంగళూరుకు వచ్చారు. ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ ఉత్తర కర్ణాటక స్నేహలోక ట్రస్ట్ స్థాపించి 16 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. ఏటా పర్వతాలపై ట్రెక్కింగ్ చేయటం వీరికి అలవాటు. పర్వతారోహణకు కర్ణాటక మౌంటెన్ అసోసియేషన్ అవకాశం ఇవ్వలేదు. కానీ పట్టుబట్టి టికెట్‌ను తెచ్చుకున్నారు. ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న కూతురు అదితి, ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు ఇశాన్‌ను కూడా తీసుకెళ్లాలని దంపతులు భావించారు. రెండు టికెట్లు మాత్రమే లభించటంతో దంపతులు ఇద్దరూ వెళ్లి చివరకు విగత జీవులుగా మారారు.

కేఐఏలో 9 కేజీల బంగారం సీజ్

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో డీఆర్‌ఐ అధికారులు ఏకంగా రూ.6.29 కోట్ల విలువైన 9 కేజీల బంగారాన్ని సీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి కెంపేగౌడ ఎయిర్‌పోర్టుకు వచ్చిన థాయ్‌ల్యాండ్ ఎయిర్‌వేస్ విమానంలో గుర్తు తెలియని ప్రయాణికులు వదిలి వెళ్లిన బ్యాగ్‌లో 6.8 కేజీల బంగారం లభించింది. బ్యాగ్‌లో లభించిన సాక్ష్యాధారాల ఆధారంగా ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన జరిగిన కొన్ని గంటల్లోనే దుబాయ్ నుంచి వచ్చిన ఎమిరేట్స్ విమానంలో కూడా 2.18 కేజీల బంగారం లభించింది. బంగారాన్ని తీసుకువచ్చిన ప్రయాణికులు తీసుకెళ్లడానికి భయపడి వదిలేసి వెళ్లి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. పట్టుబడ్డ మొత్తం బంగారం విలువ రూ.6.29 కోట్లుగా అధికారులు తెలిపారు.

ఏటీఎం దొంగల అరెస్ట్

బనశంకరి: ఏటీఎం నుంచి నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను వివేకానందనగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.20.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో మురళి, సాయితేజ, వెంకటేశ్ అనే ముగ్గురు దొంగలు. విక్టోరియా లేఔట్‌లోని యాక్సిస్‌బ్యాంకు ఏటీఎం, సీడీఎం యంత్రం నుంచి రూ.20 లక్షలు నగదు చోరీపై బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనంతపురం జిల్లాకు చెందిన మురళి, సాయితేజను అరెస్ట్ చేసి విచారణ చేపట్టగా వెంకటేశ్ గురించి నోరువిప్పారు. పట్టుబడిన మురళీ గతంలో ఏటీఎంలకు నగదు నింపే ఏజెన్సీలో విధులు నిర్వహించాడు. గతంలో తనతో పనిచేసిన వెంకటేశ్ పాస్‌వర్డ్ ఇవ్వడంతో అతడిసాయంతో సాయితేజను కలుపుకుని నగదు చోరీకి పాల్పడ్డాడు.

మొక్కలు నాటుదాం



నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మైసూరు : పర్యావరణ పరిరక్షణపై ప్రజలను జాగృతి చేసేందుకు శుక్రవారం నగరంలో జాతా నిర్వహించారు. జేపీ నగర్‌లో జేఎస్‌ఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నినదించారు.

వరుణుడి ప్రతాపం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు దంచి కొడుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని పలు నగరాల్లో భారీ వర్షాలు కురిశాయి. రోడ్లు కాలువలను తలపించేలా నీరు ప్రవహించింది. వాహనదారులు నానా ఇక్కట్ల పాలయ్యారు.



బళ్లారిలో వాన నీటిలో వాహనదారుల ఇక్కట్లు



బళ్లారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరడంతో నిలిచిపోయిన బస్సులు



తుమకూరులో జలమయమైన రోడ్డు

టీబీడ్యాం నీటి పంపకాలు ఖరారు

- కర్ణాటకకు 112.765 టీఎంసీలు



తుంగభద్ర జలాశయం

రాయదుర్గం/హొసపేటి: కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు వరదాయనిగా ఉంటూ లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న హొసపేటె వద్ద ఉన్న తుంగభద్రడ్యాం నుంచి 2024-25 ఖరీఫ్‌లో ఆయకట్టుకు అందించేందుకు నీటి కేటాయింపులు ఖరారయ్యాయి. గురువారం విజయనగర (హొస్పెట్) టీబీ బోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్‌ఈ ఆర్ శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో కర్నాటక, అనంతపురం, కర్నూలు ఇంజినీరింగ్ అధికారుల బృందం సమావేశమై నీటి కేటాయింపులను ఖరారు చేశారు. జలాశయం నీటి లభ్యత 212 టీఎంసీలుగా అంచనా వేసినా 172 టీఎంసీలకు తగ్గించి కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ (కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్) కేటాయింపులకు అనుగుణంగా నీటి పంపకాలు చేశారు. కర్ణాటకకు 112.765 టీఎంసీలు, ఏపీకి 53.953, తెలంగాణకు 5.282 టీఎంలు కేటాయించారు. పవర్ కెనాల్, లోలెవెల్ కెనాల్ (ఆర్‌బీ)కు 14.590 టీఎంసీలు, హైలెవెల్ కెనాల్ (ఆర్,బీ)కు 13.440, రాయబసవ కెనాల్ (ఆర్,బీ)కు 5.376, వీఎన్‌సీ, మరియు ఆర్‌డీఎస్‌కు1.912 టీఎంసీలు, లెఫ్ట్ బ్యాంక్ మెయిన్ కెనాల్, హైలెవెల్ కెనాల్‌కు 71.423 టీఎంసీలు, ఎల్.ఐ స్కీం ద్వారా 4.123 టీఎంసీలు, జేవీఎస్‌ఎల్ స్కీం ద్వారా 1.900 టీఎంసీలు కేటాయించారు. ఏపీ- కి లోలెవెల్ (ఎల్లెల్సీ, ఆర్‌బీ) 19.472 టీఎంసీలు, హైలెవెల్ (హెచ్‌ఎల్‌సీ) 26.368 టీఎంసీలు, ఆర్.ఏ నుండి కేసీ కెనాల్ కు 8.113 టీఎంసీలు కలిపి మొత్తం 53.953 టీఎంసీలు కేటాయించారు. తెలంగాణ వాటాగా ఆర్‌డీఎస్‌కు 5.282 టీఎంసీలు కేటాయించారు. అనంతపురం, కర్నూలు జిల్లాల ఇరిగేషన్ ఎస్‌ఈలు ఎన్.రాజశేఖర, పి రెడ్డి శేఖర్‌రెడ్డి, ఎల్లెల్సీ ఈఈ నీలకంఠారెడ్డి, బోర్డు సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, ఇతర ఇంజనీరింగ్ బృందం పాల్గొన్నారు.

తుంగభద్రకు రూ.2,190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయం పరిధిలో వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు వరద జలాలు చేరుతున్నాయి. బుధవారం 517 క్యూసెక్కులు, గురువారం 1,581 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో శుక్రవారం 2,190 క్యూసెక్కులకు చేరింది. డ్యాంలో ప్రసుతం 1,578.57 అడుగుల నీటి మట్టం ఉండగా 3.820 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయబసవ కాలువకు 6 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,581.09 అడుగుల నీటిమట్టం, 5.020 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. ఇన్‌ఫ్లో 297 క్యూసెక్కులు ఉండేది.

క్లుప్తంగా

ఎంపీ, ఎమ్మెల్యేల కలయిక



కుమారనాయక్‌ను అభినందిస్తున్న రాజా వేణుగోపాల నాయక్

రాయచూరు రూరల్‌: ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాయచూరు, యాదగిరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్‌ నుంచి పోటీ చేసి గెలుపొందిన మాజీ ఐఏఎస్‌ అధికారి కుమార నాయక్‌, యాదగిరి జిల్లా సురపుర విధానసభ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్‌ అభ్యర్థి రాజా వేణుగోపాల నాయక్‌ శుక్రవారం పరస్పరం ఒకరినొకరు కలుసుకొని కరచాలనం చేసుకున్నారు. ఇకపై నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్ద పీట వేద్దామని చర్చించుకున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు సిద్ధం



పుస్తకాలను పరిశీలిస్తున్న బీఈఓ మల్లేశప్ప

హొసపేటె: పాఠశాల విద్యాశాఖ క్షేత్ర విద్యాశాఖాధికారి కార్యాలయంలో 2024– 25వ సంవత్సరానికి ప్రైవేట్‌, నాన్‌ ఎయిడెడ్‌ పాఠశాలలకు సంబంధించిన పుస్తకాల పంపిణీని ఇప్పటికే ప్రారంభించినట్లు బీఈఓ మల్లేశప్ప తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో పుస్తకాల పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ విభాగానికి ఇప్పటికే 2.24 లక్షల పుస్తకాలు అందజేయగా, 116 పాఠశాలలకు 80 శాతం పుస్తకాలు సరఫరా చేశామన్నారు. డిమాండ్‌ ప్రకారం దాదాపు 20 పాఠశాలలకు ఇప్పటికే పుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఈ నెల 20వ తేదీ లోగా అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. విద్యాశాఖ అధికారి చెన్నబసప్ప ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు లక్షా 60 వేల పుస్తకాలు వచ్చాయని, మరికొన్ని పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉందన్నారు. మరో వారంలోపు అన్ని పుస్తకాలు వస్తాయన్నారు.

అన్నా చెల్లెలు దుర్మరణం



మరణించిన వెంకటేష్‌, అంబిక(ఫైల్‌)

రాయచూరు రూరల్‌: సోదరి మరణ వార్త విని సోదరుడు మరణించిన ఘటన రాయచూరు జిల్లాలో చోటు చేసుకుంది. దేవదుర్గ తాలూకా శావంతగల్‌లో అనారోగ్యం బారిన పడిన అంబిక(14)ను గురువారం రాత్రి సిరవార ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక పోవడంతో శుక్రవారం మరణించింది. చెల్లెలి మరణ వార్త విన్న సోదరుడు వెంకటేష్‌(17) గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇద్దరు మరణించడంతో ఆ గ్రామంలో పెను విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి



తులసి(ఫైల్‌)

హొసపేటె: విద్యుదాఘాతంతో ఓ బాలిక మృతి చెందిన ఘటన విజయ నగర జిల్లా కూడ్లిగి తాలూకా కత్రికెహట్టి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. వివరాలు..గ్రామానికి చెందిన విద్యార్థిని తులసి(8) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి చేతిలో గోరు ముద్దలు తిన్న బాలిక ఆనందంగా బ్యాగ్‌ ఎత్తుకుని స్కూల్‌కు వెళ్లింది. పొద్దున్నే స్కూల్‌కి వెళ్లి తిరిగి ఆడుతూ పాడుతూ ఇంటికి వచ్చే బాలిక ఆకస్మికంగా విద్యుదాఘాతానికి గురి కావడంతో గ్రామంలో విషాదం ఏర్పడింది. విద్యుదాఘాతంతో బాలిక తులసి మృతి చెందిందన్న వార్త తెలియగానే గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ ఎరియప్ప సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

హుబ్లీ: గదగ్‌ జిల్లా నరగుంద తాలూకా బైరనహట్టి రోడ్డులోని బండమ్మ నగర వద్ద పిడుగు పాటుకు గుర్రె గొర్రెలు కాస్తున్న ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా అతని సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. నరగుందలోని హొరకేరి గుందదకేరి లేఅవుట్‌ నివాసి అయిన యల్లప్ప హనుమంతప్ప అనే బాలుడు మృతుడు కాగా అతడి సోదరుడు పరుశప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి నరగుంద ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పొలంలో గొర్రెలు మేపుతుండగా వర్షం కురిసింది. వాన నుంచి రక్షణ కోసం చెట్టు కిందకు చేరగా పిడుగు పడింది. సమాచారం అందగానే ఘటన స్థలాన్ని నరగుంద సీపీఐ మంజునాథ్‌, తహసీల్దార్‌ శ్రీశైల తళవార్‌, ఆర్‌ఐ పరిశీలించారు. నరగుంద చుట్టు పక్కల ఓ గంట పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.



దుర్గమ్మగుడి అండర్‌ బ్రిడ్జిలో మోకాలిలోతు నీటిలో నిలిచిపోయిన బస్సులు



బళ్లారిలో వర్షపు నీటితో నిండిన తహసీల్దార్‌ కార్యాలయ ఆవరణ

ముంచెత్తిన భారీ వర్షం

- దుర్గమ్మగుడి అండర్‌ బ్రిడ్జి జలమయం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- రెండు గంటలకు పైగా కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన విద్యుత్‌ సరఫరా

సాక్షి బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్‌ సీజన్‌ ఆరంభంలోనే వరుణుడు దంచికొట్టాడు. శుక్రవారం మధ్యాహ్నం ఉన్నఫళంగా ఉరుములు మెరుపులతో కూడిన కుంభవర్షం కురిసింది. రెండేళ్లుగా బళ్లారిలో ఇంత భారీ వర్షం కురవడం ఇదే మొదటిసారి. నగరంలోని రాయల్‌ సర్కిల్‌ నుంచి దుర్గమ్మగుడి వైపునకు వెళ్లే అండర్‌ బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బస్సులు ఆగిపోయే విధంగా అండర్‌ బ్రిడ్జిలో మోకాలి లోతున నీరు చేరాయంటే ఎంతో పెద్ద వర్షం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే సత్యనారాయణ పేట అండర్‌ బ్రిడ్జిలో కూడా వర్షం నీరు నిండిపోయింది. నిత్యం జనంతో రద్దీగా ఉండే తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణమంతా జలమయమైంది. రాయల్‌ సర్కిల్‌ ఎదురుగా ప్రధాన రోడ్లలో వ్యాపారాలు చేసుకొనే స్థలంలో వరద ప్రవాహంలా వర్షపు నీరు దూసుకొచ్చింది. విశాల్‌ నగర్‌, పటేల్‌ నగర్‌, కణేకల్‌ బస్టాండు, కౌల్‌బజార్‌, రేణుకానగర్‌ తదితర కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నీటిని తోడేందుకు ఆయా గృహ యజమానులు నానా అవస్థలు పడ్డారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి ఈదురు గాలులతో కుంభ వర్షం కురవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చెట్లు, విద్యుత్‌ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉన్నఫళంగా వర్షం కురవడంతో రోడ్లపై వెళ్తున్న వారు తడిసిముద్దయ్యారు. బళ్లారితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

భారీ వర్షంతో రోడ్లు అధ్వానం

రాయచూరు రూరల్‌: జిల్లాలో శుక్రవారం జడివానతో కూడిన 52.72 మి.మీ.ల భారీ వర్షం కురిసింది. ఎక్కడ చూసినా రహదారులు బురదగుంటలుగా మారాయి. రాయచూరులో 28 మి.మీ, యరగేరలో 29.5 మి.మీ.,, లింగసూగూరులో 93.5 మి.మీ, మాన్విలో 62 మి.మీ, దేవదుర్గలో 23.5 మి.మీటర్ల వర్షం పడింది. మున్నూరువాడి, గాంధీ చౌక్‌, మహవీర్‌ చౌక్‌, కూరగాయల మార్కెట్‌లో వర్షపు నీరు నిలిచాయి.

వణికించిన కుంభవృష్టి

శ్రీనివాసపురం : పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వానకు జనజీవనం అస్తవ్యస్తమైంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన వాన దాదాపు రెండు గంటలకు పైగా కురిసింది. భారీ వానతో రోడ్డుపై నీరు నిలవడంతో పాటుగా పలు ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలా నీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి చేరుతోందని పట్టణ ప్రజలు పురసభ అధికారులు, ప్రజా ప్రతినిధులను శాపనార్థాలు పెట్టారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు బస్సుల కోసం వడిగాపులు కాయాల్సి వచ్చింది. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకోవడం వల్ల మురుగు నీరు సక్రమంగా వెళ్లక రోడ్డుపైకి చేరి ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారికి, పాదచారులకు నరకయాతన ఎదురైంది. అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి వర్షం నీరు సక్రమంగా వెళ్లేలా చేయాలని పట్టణ వాసులు డిమాండ్‌ చేశారు.



వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న నగర ప్రజలు



శ్రీనివాసపురంలో భారీవానతో రోడ్డుపైన నిలిచిన నీరు



రాయచూరులో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఇంట్లోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ

ట్యాంకర్‌ ఢీ.. అక్క, తమ్ముడు మృతి

బనశంకరి: వాటర్‌ ట్యాంకర్‌ ఢీకొన్న ప్రమాదంలో అక్క, తమ్ముడు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఎల్రక్టానిక్‌సిటీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. దొడ్డనాగమంగల నివాసులైన మధుమిత (20), తమ్ముడు రంజన్‌ (19) ఇద్దరూ శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంలో కాలేజీకి బయలుదేరారు. దొడ్డనాగమంగలలో వెళుతుండగా వేగంగా వస్తున్న వాటర్‌ట్యాంకర్‌, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. రోడ్డుపై పడిన వీరిపై ట్యాంకర్‌ దూసుకెళ్లడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంపీ గోపీనాథ్‌కు ఘన స్వాగతం



గోపీనాథ్‌కు ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు

హోసూరు: చెన్నై నుంచి హోసూరుకు చేరుకొన్న క్రిష్ణగిరి ఎంపీ కే.గోపీనాథ్‌కు హోసూరు సరిహద్దు బత్తలపల్లి వద్ద కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గత ఏప్రిల్‌ 19వ తేదీ జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా కే.గోపీనాథ్‌ పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి విదితమే. కాగా చెన్నై నుంచి శుక్రవారం సాయంత్రం హోసూరుకు చేరుకొన్న ఎంపీ కే. గోపీనాథ్‌కు కాంగ్రెస్‌, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు బత్తలపల్లి సమీపంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌ మాట్లాడుతూ... క్రిష్ణగిరి జిల్లాలో తనను భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు, తన గెలుపునకు కృషి చేసిన కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం, డీసీఎంలతో ఎమ్మెల్సీల భేటీ



ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసిన నూతన ఎమ్మెల్సీలు బోసురాజు, వసంతకుమార్‌



ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌ను కలిసిన మంత్రి దంపతులు

రాయచూరు రూరల్‌: విధాన పరిషత్‌ నూతన సభ్యులుగా కాంగ్రెస్‌ నుంచి ఎంపికైన మంత్రి ఎన్‌ఎస్‌ బోసురాజు, పార్టీ కార్యాధ్యక్షుడు వసంత్‌ కుమార్‌ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ నేపథ్యంలో విధాన పరిషత్‌ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని సమస్యలపై స్పందించాలని వారికి నేతలు సూచించారు.

దీపోత్సవం వెలుగులు నింపాలి

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటె నందగుడి సమీపంలో ఉన్న మారసండహళ్ళి, సత్తిగానహళ్ళి గ్రామంలో జగజ్యోతి బసవేశ్వర జయంతి, శ్రీ వినాయక స్వామి, శ్రీఆంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే శరత్‌ బచ్చేగౌడ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దీపోత్సవం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన అన్నారు.

యువతీ యువకుల పోట్లాట వైరల్‌

రాయచూరు రూరల్‌: నగరంలో యువతీ యువకుల మధ్య సినిమా ఫక్కీలో పోట్లాట జరిగింది. గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్‌ రోడ్డులోని లోకాయుక్త కార్యాలయం వద్ద గుర్తు తెలియని జంట ఒకరినొకరు కొట్టుకున్న వీడియో వైరల్‌ అయింది. ప్రజలు చూస్తుండగానే యువతి యువకుడిని కొట్టడం, తన్నడం చేస్తున్నా వారిని విడిపించడానికి ఒక్కరూ సహకరించక పోవడం గమనార్హం.

రాజకీయ నాయకులు ఆలోచించి మాట్లాడాలి

మండ్య: రాజకీయ నాయకులు సమాజంలో చాలా బాధ్యతతో ఉండాలని జేడీఎస్‌ యువ విభాగం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నిఖిల్‌ కుమారస్వామి అన్నారు. మండ్య నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్‌ వారు ఎన్నికల్లో ఇష్టానుసారం మాట్లాడారని, దానికి మండ్య ప్రజలు సరైన సమాధానం ఇచ్చారని అన్నారు. అధికారం ఉందని నోటికి వచ్చినట్లు మాట్లాడొద్దని సూచించారు. తన తండ్రి కుమారస్వామి బీజేపీతో కలిసి పోటీ చేయడంతో భారీ మెజార్టీ ప్రజలు ఇచ్చారని, ఆయన చేసిన అభివృద్ధే ఆయనను గెలిపించిందన్నారు.

లైక్‌, షేర్‌ పేరుతో వంచన

- ఒకరికి రూ. 38 లక్షలు, మరొకరికి రూ.8 లక్షల టోకరా

బనశంకరి : పార్ట్‌టైమ్‌ ఉద్యోగాల పేరుతో రూ.38 లక్షలు సైబర్‌కేటుగాళ్లు దోచేశారు. మహదేవపుర నివాసి 29 ఏళ్ల యువతి బాధితురాలు. ఈమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైట్‌ఫీల్డ్‌ సీఈఎన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పార్ట్‌టైమ్‌ ఉద్యోగం ఇస్తామని గుర్తుతెలియని వ్యక్తి యువతి వాట్సాప్‌కు మెసేజ్‌ లింక్‌ పంపించాడు. దీనిపై క్లిక్‌చేయగానే యూట్యూబ్‌లో వీడియో, ఫొటోలకు లైక్‌, షేర్‌ చేస్తే రూ.150 ఇస్తామని రాశారు. దీనికి సమ్మతించిన యువతి టెలిగ్రాం గ్రూప్‌లోకి చేర్చుకుని యుట్యూబ్‌ లింక్‌ పంపించి లైక్‌, షేర్‌ చేయాలని టాస్క్‌ ఇచ్చారు. ప్రారంభంలో ఒక లైక్‌కు తలా రూ.150 ప్రకారం యువతి అకౌంట్‌కు జమ చేశారు. అంతేగాక తమ కంపెనీలో డబ్బు పెట్టుబడి పెడితే అధిక లాభం ఇస్తామని యువతికి ఆశ చూపించారు. ఆశపడిన యువతి వంచకులు ఇచ్చిన బ్యాంకు అకౌంట్లకు దశలవారీగా రూ.38.39 లక్షలు జమ చేశారు. చివరికి లాభం కావాలని యువతి డిమాండ్‌ చేయగా రూ.62 వేలు ఆమె అకౌంట్‌కు జమచేశారు. కొద్దిరోజులు అనంతరం మరింత డబ్బు వెనక్కి తీసుకోవాలని ప్రయత్నించగా సాధ్యంకాలేదు. టెలిగ్రాం గ్రూప్‌, మొబైల్‌నెంబరు స్విచ్చాఫ్‌ వచ్చింది. వంచనకు గురైనట్లు గుర్తించిన యువతి సీఈఎన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

మరో యువకుడికి రూ.8.35 లక్షలు టోకరా

మరో కేసులో వర్తూరుకు చెందిన 29 ఏళ్ల యువకుడికి ఇదే విధంగా నమ్మించిన వంచకులు రూ.8.35 లక్షలు వంచనకు తెగబడ్డారు. మార్చి 16న యువకుడికి ఫోన్‌ చేసిన గుర్తుతెలియని వ్యక్తి. ఇంట్లో కూర్చుని చేతినిండా సంపాదించవచ్చునని ప్రలోభపెట్టి యూట్యూబ్‌లో ఉండే వీడియో, ఫొటోలకు లైక్‌, షేర్‌ చేస్తే ఒక్కదానికి రూ.150 ఇస్తామని తెలిపారు. ఇతడి మాటలు నమ్మిన యువకుడు వంచకులకు తన సమాచారం అందించి టెలిగ్రాం గ్రూప్‌లో చేరాడు. అనంతరం పెట్టుబడి పెడితే తక్కువ అవధిలో అధిక లాభాలు పొందవచ్చని ఆశ చూపించాడు. ముందుగా రూ.1000 పెట్టుబడి పెట్టిన యువకుడు దశలవారీగా రూ.8.35 లక్షలు పెట్టుబడిపెట్టి మోసపోయాడు.

రెండో సారీ దక్కని ఎమ్మెల్సీ పట్టం

- పరిషత్‌ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌ అభ్యర్థికే విజయం
- నారా ప్రతాప్‌రెడ్డి గట్టి ప్రయత్నం చేసినా ఫలితం శూన్యం



నారా ప్రతాప్‌రెడ్డి

సాక్షి, బళ్లారి: ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విధాన పరిషత్‌ ఎన్నికల్లో గెలవాలనే దృఢ సంకల్పంతో నారా ప్రతాప్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు రోజులుగా కలబుర్గి నగరంలో జరిగిన విధాన పరిషత్‌ ఓట్ల లెక్కింపులో ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థి చంద్రశేఖర్‌ పాటిల్‌ రెండో సారి కూడా ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అమరనాథ్‌ పాటిల్‌పై 4,651 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బళ్లారి, రాయచూరు, కొప్పళ, యాదగిరి, బీదర్‌, విజయనగర జిల్లాల పరిధిలో ఓటర్లు తమ ఓటు హక్కును ఈ నెల 4వ తేదీన వినియోగించుకున్న సంగతి తెలిసిందే. గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రెండు రోజులుగా ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో చంద్రశేఖర్‌ పాటిల్‌కు 39,496 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అమరనాథ్‌ పాటిల్‌కు 35,050 ఓట్లు, బళ్లారికి చెందిన స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డికి 17,421 ఓట్లు దక్కాయి. గత విధాన పరిషత్‌ ఎన్నికల్లో కూడా నారా ప్రతాప్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ సారి కాంగ్రెస్‌ టికెట్‌ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యేలు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలో తనకు ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం తరపున కాంగ్రెస్‌ టికెట్‌ ఇవ్వాలని విన్నవించారు. అయితే కాంగ్రెస్‌ సభ్యులు చంద్రశేఖర్‌ పాటిల్‌కు కాంగ్రెస్‌ టికెట్‌ కేటాయించడంతో నారా ప్రతాప్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. నెల రోజుల నుంచి 7 జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లతో మమేకమై తీవ్రంగా ప్రచారం చేశారు. పరిషత్‌ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఏర్పడింది. కానీ తుది ఫలితాలు వెలువడిన తర్వాత రెండో సారి కూడా నారా ప్రతాప్‌రెడ్డికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది.

కోలారు వార్తలు...

డొనేషన్లు అరికట్టాలని ధర్నా



తలపై రాళ్లతో వినూత్న ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు : జిల్లా వ్యాప్తంగా ఉన్న అనధికారిక ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేయడంతో పాటు డొనేషన్ల బెడద నివారించాలని డిమాండ్‌ చేస్తూ రైతు సంఘం పదాధికారులు శుక్రవారం డీడీపీఐ కార్యాలయం ముందు తలపై బండరాయిని మోస్తూ వినూత్న రీతిలో ధర్నా చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ జిల్లాలో పుట్ట గొడుగుల్లా తలెత్తిన అనధికార ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా డొనేషన్లు వసూలు చేస్తున్నారన్నారు. ఆ పాఠశాలల అనుమతులు రద్దు చేయాలన్నారు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు, ధర్నాలో జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్‌, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ, మరగల్‌ శ్రీనివాస్‌, మంగసంద్ర తిమ్మణ్ణ, వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు,

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరిస్తున్న దృశ్యం

మాలూరు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్‌ అభ్యర్థి డీటీ శ్రీనివాస్‌ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో సదా ముందుంటారని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ అన్నారు. శుక్రవారం తాలూకాలోని కొమ్మనహళ్లి గ్రామంలోని తన నివాసంలో తాలూకా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నుంచి సన్మానం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ డీటీ శ్రీనివాస్‌పై విశ్వాసం ఉంచి టికెట్‌ కేటాయించారన్నారు. ఉపాధ్యాయులు కాంగ్రెస్‌ అభ్యర్థిపై విశ్వాసం ఉంచి గెలుపు అందించారన్నారు. కాంగ్రెస్‌ అభ్యర్థి గెలుపునకు సహకరించిన తాలూకాలోని ఉపాధ్యాయులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అభ్యర్థి విజయం కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తల శ్రమ ఫలించిందన్నారు. యాదవ సంఘం తాలూకా అధ్యక్షుడు గోవిందప్ప, తాలూకా అధ్యక్షుడు వి.మునేగౌడ, ఉపాధ్యాయుడు వెంకటస్వామి, వెంకటప్ప, శశిధర్‌, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

అభ్యర్థి ఓటమికి అందరిదీ బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

కోలారు : పార్లమెంట్‌ ఎన్నికల్లో కోలారు రిజర్వుడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన కేవీ గౌతం పరాజయానికి కేంద్ర మాజీ మంత్రి కేహెచ్‌ కెహెచ్‌ మునియప్పతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సి ఉంటుందని మాలూరు ఎమ్మెల్యే, కోచిముల్‌ అధ్యక్షుడు కేవై నంజేగౌడ తెలిపారు, శుక్రవారం నగర సమీపంలోని కోచిముల్‌ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కేహెచ్‌ మునియప్ప కోలారు నుంచి 7 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వర్గంలో కేబినెట్‌ ర్యాంకులో ఉన్నారు. రాహుల్‌ గాంధీ కార్యక్రమంతో పాటు అన్ని కార్యక్రమాల్లోను ఆయన పాల్గొన్నారు. కనుక ఆయన కూడా ఓటమికి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు, కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపులు లేవు. మంత్రి భైరతి సురేష్‌, మంత్రి కె సుధాకర్‌, కెహెచ్‌ మునియప్ప అందరూ కలిసి పని చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 1 స్థానానికి పరిమితమైన కాంగ్రెస్‌ ఈ ఎన్నికల్లో 9 స్థానాలు సాధించిందన్నారు. ఓటర్లు కాంగ్రెస్‌ పరంగా ఉన్నారనడానికి ఇది చాలన్నారు. టికెట్‌ కేటాయించడంలో జరిగిన ఆలస్యం కూడా అభ్యర్థి ఓటమికి కారణమై ఉండవచ్చన్నారు. వచ్చే జెడ్పీ, టీపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ సంఘటితంగా పోరాటం చేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోచిముల్‌ ఎన్నికలు ఆలస్యం జరిగి రెండు నెలల్లో కోచిముల్‌కు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.

ధరలు తగ్గించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు: ఎరువులు, విత్తనాల ధరలను తగ్గించాలని డిమాండ్‌ చేస్తూ కేపీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కేపీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్‌ మాట్లాడుతూ ఈసారి గతంలో ఎన్నడూ లేనంతగా జిల్లాలో కరువు తలెత్తినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నివారణ చర్యలు చేపట్టలేదన్నారు. దీనికి తోడు ఎరువులు, విత్తనాల ధరలు గణనీయంగా పెరగడంతో రైతులు కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. పెట్టుబడి అధికమై కష్టానికి తగిన ప్రతిఫలం లభించడం లేదన్నారు. దీనికి తోడు మార్కెట్‌ లో ప్రైవేటు మందుల దుకాణాల వారు నకిలీ విత్తనాలు, మందులను విక్రయించి రైతులను నిండా మోసగిస్తున్నారని ఆరోపించారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఎరువులు, విత్తనాల ధరలను తగ్గించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో కేపీఆర్‌ఎస్‌ జిల్లా కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు ఆలహళ్లి వెంకటప్ప, ఎస్‌ఎన్‌ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుమ్మక్కుతోనే ఆరోపణలు



మాట్లాడుతున్న ఖాద్రీపుర బాబు

కోలారు: ప్రతిపక్షాల నుంచి ప్యాకేజీ తీసుకుని జేడీఎస్‌ నాయకుడు హూవళ్లి ప్రకాష్‌ అకారణంగా ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌, ఎమ్మెల్సీ ఎంఎల్‌ అనిల్‌కుమార్‌లపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ రాష్ట్ర సంచాలకుడు ఖాద్రీపుర బాబు అన్నారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హూవళ్లి ప్రకాష్‌ తీరు ఇదే విధంగా కొనసాగితే కాంగ్రెస్‌ నుంచి పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. హూవళ్లి ప్రకాష్‌ జేడీఎస్‌లో ఉంటూ కాంగ్రెస్‌ అంతర్గత వ్యవహారాల గురించి ప్రశ్నించాల్సిన అవసరం ఏముందన్నారు. కాంగ్రెస్‌ నాయకుల గురించి తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఎమ్మెల్యే అయిన తరువాత కొత్తూరు మంజునాథ్‌ కోలారులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అధ్వాన స్థితిలో ఉన్న రహదారులకు మరమ్మతులు చేయించారన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించారన్నారు. పార్టీ అభ్యర్థి ఓడినంత మాత్రనా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ ఎస్సీ సెల్‌ నాయకుడు రవీంద్రనాథ్‌, అయ్యప్ప, నారాయణస్వామి, మునివెంకటప్ప, అంబరీష్‌ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం... కుమటా తీరం

- ప్రకృతి సౌందర్యాలతో కనువిందు చేసే ప్రాంతం
- ఉత్తర కన్నడ జిల్లాకు చారిత్రక నేపథ్యం

బనశంకరి: ప్రకృతి అందాలు, ఆసక్తి కలిగించే చారిత్రక కట్టడాలు, సంప్రదాయ సంస్కృతులు గల కుమటా ఉత్తర కన్నడ జిల్లాలో కలదు. ఈ ప్రాంత సందర్శన ప్రతి ఒక్కరికీ మరువలేని అనుభూతి కాగలదు. కుమటా సమీప పట్టణాలు గోకర్ణ 32 కిలోమీటర్లు, మురుడేశ్వర్ 46 కిలోమీటర్లు, భట్కల్ 56 కిలోమీటర్లు కలవు. బెంగళూరు నుంచి 468 కిలోమీటర్లు దూరంలో ఉడిపి నుంచి 146 కిలోమీటర్లు దూరంలో, మంగళూరు నుండి 199 కిలోమీటర్లు దూరంలో కుమటా ప్రదేశం కలదు. ఇది కర్ణాటక తీరప్రాంతం. కుమటా అనే చిన్నపట్టణంలో చాలా అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు నిలయం. ఇక్కడ రాతి నిర్మాణాలు, బీచ్‌లు, అఘనాశిని నది అరేబియా సముద్రంలో కలిసే దృశ్యాలు తీరం వెంబడి ఉన్నాయి. సాహసయాత్రలు, చేయాలనుకునే వారికి కమటా సుందర ప్రాంతం. ట్రెక్కర్లు ఇక్కడగల కొండపై ట్రెక్కింగ్ చేయవచ్చు.

కుమటా బీచ్...

ఆధ్యాత్మిక భావనలు కోరుకునే వారికి సైతం కుమటాలోని దేవాలయాలు దర్శనీయ స్థలాలుగా ఉన్నాయి. శ్రీకుంబేశ్వర శంకరనారాయణ, శాంతిక పరమేశ్వరి దేవాలయాలు, ప్రాచీన శిల్పకళా ఆకృతులకు నిలయం.

మహాలస దేవస్థానం...

మహాలస దేవస్థానాన్ని శ్రీమహాలసన మహారాణి దేవాలయం అని కూడా పిలుస్తారు. 1565లో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయం వెనుక ప్రాచీన చరిత్ర దాగి ఉంది. గోవాలోని వెర్నా నుంచి కాంస్య విగ్రహాన్ని మోసుకువచ్చిన గౌరవ్ పేరు మీద అర్చకులు నిర్మించారు. ఈ మహాలస విగ్రహాన్ని అక్కడ నుంచి మట్టికుండలో పెట్టుకుని మోసుకువచ్చారని కథనం. ఆలయ నిర్మాణం చూడ ముచ్చటగా ఉంటుంది. రామాయణ, మహాభారత కథలు సైతం ఆలయ గోడలపై అందంగా చెక్కారు. ఈ ఆలయం వద్ద అనేక పండుగలు నిర్వహిస్తారు.

మిర్జన్ పోర్ట్....

సుమారు 4.1 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించిన మిర్జన్ పోర్టు ఎత్తైన బురుజులు, చక్కని శిల్పకళా చాతుర్యంతో పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ కోట ఒకప్పుడు అనేక యుద్ధాలను చూసిందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ కోట నిర్మాణానికి లాలరైట్‌రాళ్లను వినియోగించారు. మిర్జన్‌కోట ప్రవేశద్వారాలు, దర్బార్‌హాళ్లు, రహస్య మార్గాలు, మార్కెట్ ప్రదేశాలు చూడదగినవి. కోట లోపల హిందూ దేవతలు ప్రతిమలు, రాజుల కాలంనాటి నాణేలు, మట్టికుండలు, యుద్ధసామాగ్రి వంటివి చూడవచ్చు.

కుమటాబీచ్....

కుమటాలో అదే పేరుతో గల బీచ్, దారేశ్వర్‌బీచ్, బడాబీచ్ అనే మూడు బీచ్‌లు కలవు. కుమటా బీచ్‌తీరం వెంబడి రాతి నిర్మాణాలు, అఘనాశినినది సముద్రంలో కలిసే దృశ్యాలను తిలకించవచ్చు.

దారేశ్వర్ బీచ్


దారేశ్వర్ బీచ్ కుమటాకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అద్భుత సూర్యోదయ, సూర్యాస్తమయం దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. పొడవైన ఈ బీచ్‌లో కాలి నడకన ఒక వైపు అరేబియా సముద్రాన్ని ఎదురుగా లైట్‌హౌస్‌ను మరోపక్క కొబ్బరిచెట్లు, వరి పంటపొలాలను చూడవచ్చు. బడాబీచ్ పరిశుభ్రంగా ఉండి కిర్కి నుండి గోకర్ణ వెళ్లేమార్గంలో ఉంది. ఈ బీచ్‌లో రాతి ప్రదేశాలు కొండలను వీక్షించవచ్చు. కుమటాకు సమీపాన గోవాలోని డబోలిం అంతర్జాతీయ విమానాశ్రయం 168 కిలోమీటర్లు దూరంలో ఉంది. అక్కడ నుంచి క్యాబ్‌ల్లో కుమటా చేరుకోవచ్చు. అంతేగాక కుమటాలో రైల్వేస్టేషన్ కూడా కలదు. ఇది పట్టణం నుండి 2 కిలోమీటర్లు దూరంలో ఉంది. ముంబై, గోవా, మంగళూరు, ఉడుపి తదితర ప్రాంతాలనుంచి కుమటా రైల్వేస్టేషన్ మీదుగా రైళ్లు సంచరిస్తాయి. రోడ్డుమార్గంలో శిరసి, కారవార, షిమోగా నుంచి కుమటాకు బస్సులు తరచూ నడుస్తుంటాయి. బెంగళూరు నుంచి ప్రతిరోజు రాత్రి కుమటాకు ఏసీ బస్సు సర్వీసు ఉంది.


సముద్రం తీరం ఒడ్డున అలలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు


బీచ్‌లో ట్రెక్కింగ్ చేస్తున్న ట్రెక్కర్లు


కొబ్బరిచెట్ల అందాల నడుమ బీచ్


కుమటా బీచ్ సూర్యోదయ అందాలు


మిర్జన్ పోర్టు ఎత్తైన బురుజు

క్లుప్తంగా

సీఎంను కలిసిన నూతన ఎమ్మెల్సీ


డీటీ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సీఎం సిద్దరామయ్య

కృష్ణరాజపురం: ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసి గెలుపొందిన డీటీ శ్రీనివాస్ శుక్రవారం సీఎం సిద్దరామయ్యను ఆయన నివాసంలో భేటీ అయ్యారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు సీఎం శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

పెంచిన ధరలను తగ్గించాలి



తుమకూరు: పెంచిన ఎరువులు, విత్తన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రైతు మోర్చ నాయకులు, కార్యకర్తలు తుమకూరు నగరంలో ధర్నా నిర్వహించారు. ర్యాలీగా వారు నగరంలోని వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మోర్చ ఉపాధ్యక్షుడు బ్యాటిరంగె గౌడ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఎస్పీ కార్యాలయంలోకి చొరబడిన ఆరుగురు అరెస్ట్

బనశంకరి: గ్రామాంతర జిల్లా ఎస్పీ కార్యాలయంలోకి అక్రమంగా చొరబడిన ఆరుగురిని హైగ్రౌండ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎండీ.హనీఫ్, రాజశేఖర్, మహమ్మద్ నదీం, మోహన్ శెట్టి, గణపతి, జహీర్‌అహ్మద్‌లను అరెస్ట్ చేశారు. ఈనెల 3న మిల్లర్స్‌రోడ్డులో గల కేంద్ర వలయ ఐజీపీ కార్యాలయంలో ఉన్న బెంగళూరు గ్రామీణ ఎస్పీ కార్యాలయంలోకి ప్రవేశించిన వీరు వీడియో చిత్రీకరిస్తుండగా గమనించిన అక్కడి అధికారి అడ్డుకున్నాడు. అనంతరం వీరిపై హైగ్రౌండ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆరుగురిని అరెస్ట్ చేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



తుమకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రధాన జిల్లా న్యాయమూర్తి జయంత్‌కుమార్ అన్నారు. తుమకూరు నగరంలోని శిరాగేట్ సమీపంలో ఉన్న ఉత్తర లేఔట్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిసరాల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మానవులు స్వార్థం కోసం చెట్లను నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

పాము కాటుతో మహిళా రైతు మృతి

మైసూరు: పాము కాటుతో మహిళా రైతు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా గావరగడెరె సమీపంలోని ఉండవాడి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుశీలమ్మ (52) పాము కాటుకు మృతి చెందిన మహిళ. ఈమె జొన్న చేనులో ఉండగా పాము కాటువేసింది. వెంటనే స్థానికుల ఆమెను హుణసూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్యోతిష్యుడి ఇంట్లో చోరీ

శివమొగ్గ: ఎవరూ లేని సమయం చూసి ఓ జ్యోతిష్యుడి ఇంటిలో నగలు, నగదు చోరీ చేసిన ఘటన శివమొగ్గ నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని హోసమనె లేఔట్‌లో నివాసం ఉంటున్న సంతోష్‌భట్ ఇంటిలోకి వెనుక వాకిలి బద్దలు కొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ. 9 లక్షల విలువైన నగలు, రూ. 3.45 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడు దొడ్డపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు మఠం వార్షికోత్సవ వేడుకలు


మాట్లాడుతున్న స్వామీజీ

తుమకూరు: తుమకూరు జిల్లా కొరటిగెరె తాలూకా శ్రీక్షేత్రం సిద్దరబెట్ట శ్రీబాళెహోన్నూరు శాఖ మఠం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8, 9 తేదీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీక్షేత్ర వీరభద్ర శివాచార్య స్వామీజీ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... వార్షికోత్సవం సందర్భంగా శ్రీ రేణుకాచార్యుల శ్రీజగజ్యోతి బసవేశ్వర జయంతి ఉత్సవం, సామూహిక వివాహాలు, జన జాగృతి ధర్మ సమారంగం నిర్వహిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

చిరుసర్జా పుణ్యస్మరణ


చిరుసర్జా సమాధి వద్ద పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు

దొడ్డబళ్లాపురం: శ్యాండల్‌వుడ్ యువ సామ్రాట్‌గా పేరు తెచ్చుకున్న దివంగత కన్నడ హీరో చిరు సర్జా 4వ పుణ్యస్మరణ కార్యక్రమాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. కనకపుర రోడ్డులోని ఫామ్ హౌస్‌లో ఉన్న చిరు సమాధి వద్ద హీరో ధ్రువ సర్జా, చిరుసర్జా భార్య మేఘనారాజ్, కుమారుడు రాయన్, సుందర్ రాజ్ దంపతులు, బంధువులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. ఈ సందర్భంగా చిరు సర్జాను గుర్తు చేసుకుని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పలువురు కన్నడ చిత్ర రంగానికి చెందిన ప్రముఖులు కూడా సమాధిని దర్శించుకున్నారు.

హోటల్ సర్వర్ అరెస్ట్

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని ఓ హోటల్‌కు వచ్చిన కస్టమర్ మరిచిపోయిన రూ. 7 లక్షల నగదు బ్యాగ్‌ను చోరీ చేసిన సర్వర్‌ను శివమొగ్గ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. సాగర తాలూకా జంబావి గ్రామానికి చెందిన లోకేష్ తన స్నేహితులతో కలిసి హోటల్‌కు వచ్చారు. అనంతరం నగదు బ్యాగ్‌ను మరచిపోయాడు. అక్కడే ఉన్న సర్వర్ హేమంత్ కుమార్ నగదు బ్యాగ్‌ను తస్కరించాడు. అనంతరం అతను అదృశ్యమయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

కానిస్టేబుల్‌కు కత్తి పోటు

మైసూరు: యువకుల గొడవను అడ్డుకోవడానికి వెళ్లిన ఓ కానిస్టేబుల్‌ను కత్తితో గాయపరచిన ఘటన మైసూరు నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని దేవరాజు ట్రాఫిక్ పీఎస్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దేవరాజు ఎస్ఐతో పాటు కేఆర్ సర్కిల్లో వాహనాల తనిఖీ చేస్తుండగా తాతయ్య పార్కు వద్ద ఇద్దరు గొడవ పడుతున్నట్లు సమాచారం రావడంతో కానిస్టేబుల్ సిద్దరాజు అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరు యువకులను వారిస్తుండగా అందులో శేఖర్ అనే యువకుడు కానిస్టేబుల్‌ను చాకుతో పొడిచాడు. స్థానికులు యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నిసార్ అహ్మద్

శివాజీనగర: కర్ణాటక మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా విశ్రాంత ఐజీపీ నిసార్ అహ్మద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు నిసార్ అహమ్మద్‌ను నియామకం చేస్తూ అల్పసంఖ్యాకుల సంక్షేమ శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

ఉద్యోగ మేళా.. యువతకు ధీమా

గౌరిబిదనూరు: ఉద్యోగ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాల అధ్యక్షుడు నాగరాజప్ప తెలిపారు. శుక్రవారం నేషనల్ కళాశాలలో ఫైనల్ డిగ్రీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఉద్యోగ మేళాను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని విధాలా వారిని సమాయాత్తం చేస్తున్నామని, ప్రతి ఏటా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రిన్సిపాల్ డా కెఎస్ గాయత్రీ మాట్లాడుతూ... గ్రామీణ యువతకు సహకరించాలనే ఉద్దేశ్యంతో డాక్టర్ నరసింహయ్య దశాబ్దాల క్రితమే ఇటువంటి కళాశాలను నెలకొల్పారని అన్నారు. కార్యక్రమంలో ఉప ప్రిన్సిపాల్ నేత్ర, కన్నడ విభాగం ముఖ్యస్థురాలు డా.శైలజా సప్తగిరి, రాజేశ్వరి, నిజాముద్దీన్, దివ్య, నాగరాజు, రమేశ్, రామాంజి, జయరామరెడ్డి, సందీప్ తదిరులు పాల్గొన్నారు.


ఉద్యోగ మేళాను ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు

విడాకులకు చందన్, నివేదిత పిటిషన్లు ?

యశవంతపుర: బిగ్‌బాస్ విజేత చందన్‌శెట్టి, నివేదిత జంట దాంపత్య జీవితానికి బీటలు పడ్డాయి. విడాకులు తీసుకోవాలని ఇద్దరు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసినట్లు సమాచారం. బిగ్‌బాస్-5లో టైటిల్ గెలిచిన చందన్‌శెట్టికి అక్కడే నివేదిత పరిచయం అయ్యారు. వీరి వివాహం మైసూరులో వైభవంగా జరిగింది. అయితే కొద్ది నెలలకే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకోవాలని పిటిషన్లు వేశారు.

నిందితుడి అరెస్ట్

ఉడుపి జిల్లా మణిపాల్‌లో విద్యార్థులకు గంజాయిని సరఫరా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన సిద్ధార్థ మణిపాల్‌లోని హెర్గ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటు మణిపాల్ మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 388 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

భవానీకి ముందస్తు బెయిల్ మంజూరు

బనశంకరి: మహిళ కిడ్నాప్ కేసులో పరారీలో ఉన్న భవానీరేవణ్ణకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హాసన, కేఆర్.నగర ప్రవేశించరాదని భవానీరేవణ్ణకు హైకోర్టు ఆంక్షలు విధించింది. కేఆర్.నగర బాధితురాలి అపహరణ కేసులో సిట్ విచారణకు సహకరించకుండా ఉన్న భవానీకి ఈనెల 14 వరకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మధ్యాహ్నం 1 గంట నుంచి 5 గంటల వరకు విచారణ చేయవచ్చునని 5 గంటల అనంతరం సిట్ కార్యాలయంలో ఉంచరాదని హైకోర్టు సూచించింది.

భవానీ కారు డ్రైవరు అరెస్ట్

మహిళ కిడ్నాప్ కేసులో భవానీ రేవణ్ణ కారు డ్రైవరు అజిత్‌ను సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. చిక్కమగళూరు బంధువులు ఇంట్లో కారుడ్రైవరు అజిత్ ఉన్నట్లు అందిన సమాచారం ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపడుతున్నారు.

హమారా బారాహ్' చిత్రంపై నిషేధం

శివాజీనగర: హిందీలో నిర్మితమైన హమారా బారాహ్ వివాదాస్పద సినిమాను కర్ణాటకలో నిషేధించారు. వివిధ జిల్లా, తాలూకాల ముస్లిం సంఘాల నుంచి విన్నపాల అనంతరం ఒక మతాన్ని రెచ్చగొట్టే సన్నివేశాలు ఉన్నాయని, శాంతికి విఘాతం కలిగించే అవకాశం ఉందని ఫిర్యాదులు రావడంతో ఈనెల 7న విడుదల కానున్న ఈ చిత్రాన్ని నిషేధించాలని ముస్లిం సంఘాలు విన్నవించాయి. రాష్ట్ర ప్రభుత్వం సినిమా ట్రైలర్‌ను పరిశీలించి అన్ని మాధ్యమాల్లో నిషేధిస్తున్నట్లు హోమ్‌శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

హెచ్‌డీ.రేవణ్ణ పిటిషన్ వాయిదా

బనశంకరి: తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని హెచ్‌డీ రేవణ్ణ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఈనెల 14 తేదీకి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి కృష్ణదీక్షత్‌తో కూడిన న్యాయ పీఠం విచారణ వాయిదా వేసింది. ఇప్పటివరకు రెండు ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో ఇది రాజకీయ కుట్ర అని కేసు రద్దు చేయాలని హైకోర్టులో రేవణ్ణ పిటిషన్ వేశారు.

'సౌర పంప్‌సెట్' కోసం 18 లక్షల మంది నమోదు

శివాజీనగర: నీటి సరఫరాకు సాంప్రదాయ ఇంధనానికి బదులుగా సౌరశక్తి వినియోగించటం ద్వారా ఇంధన స్వావలంబన సాధించే కుసుమ్ పథకం కింద సౌర పంప్‌సెట్ పొందేందుకు రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని ఇంధన శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా తెలిపారు. పీఎం కుసుమ్ పథకం సక్రమంగా అమలు గురించి బెంగళూరులోని ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన మహాభియాన్ (కుసుమ్) గురించి ఒక్కరోజు జాతీయ సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ వాటాను 30 శాతం నుండి 50 శాతానికి పెంచింది. ఇంధన మంత్రి కే.జే.జార్జ్ మార్గదర్శనలో పథకం అమలుపరచబడుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు యాప్‌లో నమోదు చేసుకున్నారని గుప్తా తెలిపారు.

తుమకూరులో భారీ వర్షం


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


వాన నీటిలో వాహనదారుల అవస్థలు

తుమకూరు: తుమకూరు నగరంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాంతో నగర రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నగరంలోని సర్వోదయ పీయూ కళాశాల ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

మైసూరు: చెట్టు పైకి ఎక్కి కొబ్బరి బోండాల తీయడానికి యత్నించిన యువకుడు కాలుజారి కిందపడి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా సాలిగ్రామ తాలూకా ముంజనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుమార మహాదేవి దంపతుల కుమారుడు చేతన్ (27) మృతి చెందిన యువకుడు. ఇతని తల్లికి అనారోగ్యంగా ఉండటంతో తమ కొబ్బరి తోటలో కొబ్బరి బోండాలను కోయడానికి చెట్టు ఎక్కి కాలుజారి కిందపడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసూరు వార్తలు..

సంచరిస్తున్న చిరుత, స్థానికుల భయాందోళన


చిరుతను బంధించేందుకు ఏర్పాటు చేసిన బోను

కెలమంగలం: డెంకణీకోట సమీపంలో ఆరు నెలలుగా చిరుత సంచరిస్తున్నా అటవీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే అటవీశాఖ సిబ్బంది చిరుత సంచారంపై నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుత సంచరిస్తున్నట్లు తెలుసుకొన్న అధికారులు చిరుతను బంధించేందుకు బోనులు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు చిరుతను బంధించలేదు. ఇస్లాంపురం, తండ్రి, కొరటగిరి, హోళేసత్తం, స్వామీపురం తదితర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చిరుతను బంధించాలని డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హోసూరు: జిల్లా కేంద్ర క్రిష్ణగిరి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ శరయు శుక్రవారం పరిశీలించారు. క్రిష్ణగిరి సమీపంలోని కాటినాయకనపల్లి, కల్లుగురికి తదితర ప్రాంతాల్లో జల్‌జీవన్ పథకం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందజేసేందుకు రూ. 7.30 లక్షలతో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ ట్యాంక్ నిర్మాణం, అవాజ్ యోజనా పథకం ద్వారా రూ. 12 లక్షలతో ఇళ్ల నిర్మాణ పనులు, రహదార్ల శాఖ ద్వారా బి.జి. పుదూర్ నుంచి కల్లుగురికి వరకు తారురోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


ఆందోళనకు దిగిన స్థానికులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కురింజినగర్ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కురింజినగర్ గృహవసతి ప్రాంతంలో 300 పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. నాలుగు నెలలుగా ఈ ప్రాంత వాసులకు తాగునీటి సమస్య నెలకొంది. పలుమార్లు కార్పొరేషన్ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకొనే నాథుడే లేడని, ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అప్పు తీర్చలేక నూతన వరుడు ఆత్మహత్య

కెలమంగలం: పెళ్లి కోసం తీసుకొన్న అప్పును తీర్చలేక నూతన వరుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన కెలమంగలం పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా కెలమంగలం సమీపంలోని గుట్టూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి (27). ఇతనికి రెండు నెలల క్రితం పెళ్లి జరిగింది. పెళ్లి కోసం ఇతరుల వద్ద అప్పు తీసుకొన్నాడు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన వెంకటేష్ గురువారం సాయంత్రం హెచ్. శెట్టిపల్లి ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కెలమంగలం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో భర్త అదృశ్యం

దంపతుల మధ్య చోటు చేసుకున్న మనస్పర్థలతో భర్త అదృశ్యమైన ఘటన డెంకణీకోట పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట సమీపంలోని ఉచ్చనపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు మురళి (41), భార్య మంజుల (33) దంపతులకు ఇద్దరు పిల్లలు. భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం రాత్రి కూడా గొడవ జరగడంతో మురళి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో పలుచోట్ల గాలించిన ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కన్నడ భాషకు మాస్తి అయ్యంగార్ ఎనలేని సేవ

గౌరిబిదనూరు: కవి మాస్తి వెంకటేశ అయ్యంగార్ కన్నడ భాషకు ఎనలేని సేవలందించారని, వారు వందలాది చిన్నకథలను రచించి ప్రసిద్ధకవిగా పేరు పొందారని కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు నంజుండప్ప తెలిపారు. విదురాశ్వత్థం సత్యాగ్రహ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం మాస్తి వెంకటేశ అయ్యంగార్, విద్యావేత్త డా పద్మభూషణ డా నరసింహయ్య జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దస్తగిరి సాబ్ మాట్లాడుతూ జయంతులు ఆచరించగానే సరిపోదని వారి ఆదర్శాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కసాప కార్యదర్శి బాలప్ప, కళావిద రామకృష్ణ, ఉపాధ్యాయురాలు సువర్ణమ్మ, గుండాపురం పద్మ, నరసింహారెడ్డి, గోవిందప్ప, నళినీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాస్తి అయ్యంగార్. నరసింహయ్య జయంతిని జరుపుకొంటున్న దృశ్యం

విద్యార్థులకు సర్టిఫికెట్ల వితరణ



హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను వితరణ చేశారు. పారిశ్రామికవాడ బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో 135 మంది విద్యార్థినీ విద్యార్థులు గత ఏప్రిల్ నెలలో 8వ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందారు. పై చదువులకోసం శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఒకే రోజు వంద మంది ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాన్‌నాగేష్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.


పెట్టుబడుల పేరుతో రూ. లక్షల టోపీ

హోసూరు: ఆన్‌లైన్ మోసాలతో అమాయక ప్రజలు వంచనకు గురవుతూనే ఉన్నారు. తాజాగా ఓ మహిళ లక్షలు వంచనకు గురైంది. బాధితురాలు హోసూరు బస్తీ ప్రాంతానికి చెందిన చంద్ర. ఈమె ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుంది. ఇటీవల ఏప్రిల్‌లో ఆమెకు ఒక మెసేజ్ వచ్చింది. అందులో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీ ఆదాయం వస్తుందని సందేశం. దీంతో సైబర్ కేటుగాళ్లు ఇచ్చిన నెంబర్లకు బాధితురాలు సంప్రదించింది. వారు ఆమెకు మాయ మాటలు చెప్పి రూ. 5.70 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసుకున్నారు. ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్ ఆత్మ పరిశీలన సమావేశం

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఆత్మ పరిశీలన సమావేశం నిర్వహించారు. శుక్రవారం రాహుల్ బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. అనంతరం ఆయన నేరుగా కేపీసీసీ కార్యాలయం చేరుకున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలతో కలసి లోక్‌సభ ఎన్నికల గెలుపోటములపై సమాలోచన చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తొమ్మిదింటిలో విజయం సాధించగా 19 నియోజకవర్గాల్లో ఓటమి చవిచూసింది. ఈ ఓటమికి కారణాలను కులంకుషంగా చర్చించారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని రాహుల్ సూచించారు.

పొగాకు హానికరం



కృష్ణరాజపురం: పొగాకు నమలడం, పొగ తాగడం ఎంతో హానికరమని వైద్యులు తెలిపారు. బెంగళూరు కృష్ణరాజపురంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వరల్డ్ నో టొబాకో డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ బాబు మహేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు అశోక్ రెడ్డి, దంత వైద్యుడు డాక్టర్ సయ్యద్, ఈఎన్‌టీ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సచివాలయం శిలాఫలకం ధ్వంసం

ప్రకాశం జిల్లా పడమరవీరాయపాలెంలో ఘటన



శిలాఫలకంపై జగన్ ఫొటోను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు

కురిచేడు: ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామ సచివాలయంపై శుక్రవారం టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. సచివాలయ కార్యాలయంపై టీడీపీ జెండా ఏర్పాటు చేశారు. సచివాలయం సిబ్బంది ఒకరు చూసి ఆ జెండాను తొలగించారు. కార్యాలయం ముందు శిలాఫలకంపై ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను, కార్యాలయంలోని జగన్ ఫొటోలను పగులగొట్టారు. టీడీపీ కార్యకర్తల దాష్టీకంతో సచివాలయ ఉద్యోగులు భయభ్రాంతులయ్యారు. ప్రభుత్వ కార్యాలయంపై దాడిని గ్రామస్తులు నిరసిస్తున్నారు.

వేమూరులో నవరత్న స్థూపం కూల్చివేత!



స్థూపాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న సిబ్బంది

వేమూరు: బాపట్ల జిల్లా వేమూరు బస్టాండ్ సెంటర్‌లో నవరత్న స్థూపాన్ని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది కూల్చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్న పథకాలు ప్రజలకు గుర్తుండేలా బస్టాండ్ సెంటరులో పంచాయతీ అనుమతితో నాయకులు దీన్ని నిర్మించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఈ స్థూపాన్ని తొలగించాలని ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ అధికారులకు తెలుగుదేశం నాయకులు వినతిపత్రాలిచ్చారు. దీంతో స్థూపాన్ని తొలగించేందుకు శుక్రవారం అధికారులు సిద్ధమయ్యారు. స్థూపంపై ఉన్న శిలాఫలకాలు, వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నందిగం సురేష్, మేరుగ నాగార్జున బొమ్మలను తొలగించారు. స్థూపాన్ని పూర్తిగా కూల్చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో జి.ఎస్.వి.శేషగిరిరావును వివరణ అడగగా, పంచాయతీ తీర్మానం లేకుండా బస్టాండ్ సెంటరులో నవరత్నాల స్థూపం నిర్మించారని చెప్పారు. అందువల్ల దీన్ని తొలగించాలని కొందరు పంచాయతీ కార్యాలయంలో, పోలీసు స్టేషనులో వినతి పత్రాలిచ్చారని తెలిపారు. దీంతో దీన్ని కూల్చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు



అబ్బాస్‌ను పరామర్శిస్తున్న వైఎస్ మధురెడ్డి తదితరులు

పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. సింహాద్రిపురానికి చెందిన హాజీవలి, ఆయన కుమారుడు అబ్దుల్ తమ ఇంటి వద్ద ఉండగా పోలీసులు స్టేషన్‌కు రమ్మని పిలిచారు. దీంతో వారు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడే కాపుకాసి ఉన్న టీడీపీ కార్యకర్తలు తండ్రీకొడుకులపై దాడిచేసి కొట్టారు. బాధితుడి కుటుంబసభ్యులు చెప్పడంతో స్టేషన్‌కు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డిపైన కూడా టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఆయన కారు అద్దాలను ధ్వంసం చేశారు. 2019 పోలింగ్ ముందురోజు రాత్రి హాజీవలిపై మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి దాడిచేశారు. ఆ కేసు కోర్టులో నడుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పాస్‌పోర్టుకు ఈ కేసు అడ్డుగా ఉందని, ఆ కేసు విత్‌డ్రా చేసుకోవాలని టీడీపీ కార్యకర్తలు ఇలా దాడికి పాల్పడ్డారని హాజీవలి తెలిపారు. సింహాద్రిపురం బస్టాండు సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అబ్బాస్‌ను టీడీపీ కార్యకర్తలు రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని నెలరోజుల కిందట అబ్బాస్ చెప్పారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న టీడీపీ కార్యకర్తలు శుక్రవారం బస్టాండు సమీపంలో ఉన్న అతడిని రాడ్డుతో కొట్టి గాయపరిచారు. అబ్బాస్‌ను 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్బాస్‌ను తొండూరు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి పరామర్శించారు.

విశ్వవిద్యాలయాలపై టీడీపీ దాడులు

- ఎస్వీయూలో టీడీపీ మూకల వీరంగం
- వీసీ చాంబర్‌లోకి దూసుకెళ్లి ఫైళ్ల విసిరివేత
- రాజీనామా చేసి వెళ్లిపో అంటూ వీసీపై దాడి
- వాటర్ బాటిళ్లు, కర్రలు వీసీపైకి విసిరేసిన టీడీపీ కార్యకర్తలు
- భయంతో పరుగులు తీసిన వర్సిటీ ఉద్యోగులు
- సమాచారమిచ్చినా పట్టించుకోని పోలీసు యంత్రాంగం
- వీఎస్‌యూలోనూ టీడీపీ నాయకుల దాడి
- శిలాఫలకాలు ధ్వంసం



వీఎస్‌యూలో శిలఫలకాలను ధ్వంసం చేస్తున్న టీడీపీ నాయకుడు



రాజీనామా చేయాలని ఎస్వీయూ వీసీని బెదిరిస్తున్న టీడీపీ కార్యకర్తలు

తిరుపతి (తిరుపతి జిల్లా): చదువుల నిలయాలైన విశ్వవిద్యాలయాలపై తెలుగుదేశం పార్టీ మూకలు దాడులకు దిగుతున్నాయి. రెండు రోజుల క్రితం వైద్య విశ్వవిద్యాలయంపై దాడికి పాల్పడిన టీడీపీ వర్గాలు శుక్రవారం రాయలసీమకే తలమానికమైన తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ)పై దాడులకు తెగబడ్డాయి. సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఎస్వీయూలోకి కర్రలు, రాడ్లతో చొరబడ్డారు. నేరుగా పరిపాలన భవనంలోకి ప్రవేశించి, వైస్ చాన్సలర్ (వీసీ) శ్రీకాంత్‌రెడ్డి చాంబర్‌లోకి దూసుకెళ్లారు. ఆయనపైకి నీళ్ల సీసాలు, కర్రలు విసురుతూ దాడి చేశారు. అక్కడ ఉన్న ఫైళ్లను విసిరేశారు. 'వెంటనే రాజీనామా చేయరా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పడిపోయినా ఇంకా సీటులో కూర్చున్నావా' అని హెచ్చరిస్తూ అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. వీసీపై టీడీపీ కార్యకర్తలు దాడి చేస్తున్నారని ఉద్యోగులు సమాచారమిచ్చినా పోలీసులు పట్టించుకున్న పాపానపోలేదు. ఓ పక్క టీడీపీ మూకల వీరంగం, మరోపక్క పోలీసులు పట్టించుకోకపోవడంతో వర్సిటీ సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. వారి సీట్ల నుంచి లేచి పరుగులు పెట్టారు. మహిళా ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. వీసీపై దాడులు, ఉద్యోగులు పరుగులు తీస్తున్న దృశ్యాలను కొన్ని మీడియా సంస్థలు ఉత్సాహంగా వీడియోలు తీయడం కనిపించింది. టీడీపీ దాడులు, ఆ మీడియా అత్యుత్సాహాన్ని వర్సిటీ సిబ్బంది, ప్రజలు తప్పుపడుతున్నారు. వర్సిటీకి సంబంధం లేని బయట వ్యక్తులు వర్సిటీలోని ప్రవేశించడం దారుణమని, ఆ మీడియా సంస్థల తీరూ గర్హనీయమని విమర్శిస్తున్నారు.

వీఎస్‌యూలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు

వెంకటాచలం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) లో పలు శిలాఫలకాలను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. వీఎస్‌యూలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో సెంట్రల్ లైబ్రరీని వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి ఇటీవల ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం పెద్ద సంఖ్యలో వర్సిటీలోకి ప్రవేశించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వీరంగం సృష్టించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. వీఎస్‌యూలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో భవనాన్ని ఎలా నిర్మిస్తారని, ఆయన విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేశారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిపాలన భవనంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని, లేకుంటే తామే ధ్వంసం చేస్తామని అధికారులను హెచ్చరించారు. దేవాలయం వంటి విశ్వవిద్యాలయంలో టీడీపీ నాయకులు దాడులు చేయడంపై అధ్యాపకులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్కేయూలో వైఎస్సార్ విగ్రహం తొలగింపు

- టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ కార్యకర్తల బెదిరింపులకు తలొగ్గిన వర్సిటీ ఉన్నతాధికారులు
- విద్యార్థుల వినతి మేరకు గతంలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు
- తాజాగా పరిస్థితులు మారడంతో అవమానకర రీతిలో తొలగింపు
- భద్రంగా తన తోటకు తరలించిన వైఎస్సార్‌సీపీ నేత

అనంతపురం: తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఉన్నతాధికారులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని అవమానకర రీతిలో తొలగించారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో పాటు లక్షలాది విద్యార్థులకు ఉచిత విద్యనందించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠించాలని గతంలో విద్యార్థులు, అధ్యాపకులు కోరారు. దీనికి గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన పాలకమండలి సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి, వర్సిటీ క్యాంపస్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు వర్సిటీ నయా పైసా ఖర్చు చేయలేదు. ఎనిమిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఇచ్చిన నిధులతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే.. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో ఎస్కేయూలోని వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాలని టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యలను గురువారం డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోపు విగ్రహాన్ని తొలగించాలని, లేదంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలంటూ అల్టిమేటం జారీ చేశారు. దీంతో హడలిపోయిన వీసీ, రిజిస్ట్రార్ గురువారం సాయంత్రమే హడావుడిగా పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. పాలక మండలి సభ్యుల్లో సింహభాగం వైఎస్సార్ విగ్రహం తొలగించడానికి సమ్మతించలేదు. అయినప్పటికీ వర్సిటీ ఉన్నతాధికారులు ఏకపక్షంగా శుక్రవారం ఉదయమే విగ్రహాన్ని తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే పొక్లెయిన్‌తో విగ్రహాన్ని తొలగించారు. విగ్రహం తీసుకెళ్లాలని దాని ఏర్పాటుకు ఆర్థిక సాయం చేసిన అసోసియేట్ ప్రొఫెసర్లను కోరారు. వారు సమ్మతించలేదు. దీంతో విగ్రహాన్ని తమ తోటలో భద్రంగా పెట్టుకుంటామని ఓ వైఎస్సార్‌సీపీ నాయకుడు చెప్పడంతో ఆక్కడికి తరలించారు. టీడీపీ బెదిరింపులకు భయపడి, వర్సిటీ ఉన్నతాధికారులు విగ్రహాన్ని తొలగించడం పలు విమర్శలకు తావిచ్చింది.



ఎస్కే యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

టీడీపీ నేతల వైఖరి అప్రజాస్వామికం



ఎస్కేయూలో వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించడం అప్రజాస్వామికం. గతంలో విగ్రహాల తొలగింపు సంస్కృతి లేదు. విద్యా వ్యవస్థ బలోపేతానికి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో ఎందరో పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు వైఎస్సార్ కృషి చేశారు. ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఎస్కేయూలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు టీడీపీ నేతల ఒత్తిడితో విగ్రహాన్ని తొలగించడం గర్హనీయం. అనంతపురం జేఎన్‌టీయూలో ఎన్టీఆర్ ఆడిటోరియం నిర్మించి, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినా వైఎస్సార్‌సీపీ పాలనలో ఏనాడూ ఆ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేయలేదు. ఇందుకు భిన్నంగా టీడీపీ నేతలు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించడం దారుణం. ప్రజలకు మేలు చేసేందుకు ఎన్నికల్లో గెలిపిస్తే, టీడీపీ నేతలు కక్ష సాధింపులకు, అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. ఎస్కేయూలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలి. ఇందుకోసం న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తాం.

– మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లతో దాడి

- టపాసులు కాల్చి తెలుగు యువత హంగామా
- సర్దిచెప్పబోయిన సీఐ పైనా దౌర్జన్యం



కొడాలి నాని ఇంటిపై దాడి చేసి నినాదాలు చేస్తున్న తెలుగు యువత నాయకులు

గుడివాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఇంటిపై తెలుగుదేశం పార్టీకి చెందిన తెలుగు యువత కార్యకర్తలు పలువురు శుక్రవారం దాడికి పాల్పడ్డారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లు విసిరి, హంగామా చేశారు. తెలుగు యువత రాష్ట్ర నాయకుడు, అమరావతి ఉద్యమ నేత పొట్లూరి దర్శిత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నాని ఇంటి వద్దకు వచ్చారు. ఇంటిపై కోడిగుడ్లు విసురుతూ దాడి చేశారు. నానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి తెలుగు యువత నాయకులను అడ్డుకున్నారు. పోలీసులకు, వారికి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ పైనా దౌర్జన్యానికి దిగి, ఆయన్ని దుర్భాషలాడారు. ఇక్కడ ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తామంటూ.. బహిరంగంగానే బెదిరించారు. టూ టౌన్ సీఐ కల్పించుకొని, వారికి సర్దిచెప్పారు. అనంతరం తెలుగుయువత కార్యకర్తలు నాని ఇంటి వద్ద టపాసులు పేల్చారు. చంద్రబాబు సీఎం అయితే రాజకీయ సన్యాసం చేస్తానని కొడాలి నాని చెప్పారని, ఆ మాట నిలబెట్టుకోవాలని దర్శిత్ డిమాండ్ చేశారు. ఇది ట్రైలర్ మాత్రమేనని, త్వరలో కొడాలి నానికి సినిమా ఉంటుందని అన్నారు.

అర్ధరాత్రి కత్తులతో టీడీపీ కార్యకర్తల వీరంగం

విజయవాడలో వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి



టీడీపీ కార్యకర్తల దాడిలో పగిలిన శివారెడ్డి ఇంటి అద్దాలు

పాయకాపురం (విజయవాడరూరల్): వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కృష్ణా జిల్లా యువజన విభాగం కార్యదర్శి పెద్దిరెడ్డి శివారెడ్డి ఇంటిపై గురువారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారు. విజయవాడ 63వ డివిజన్ రాజీవ్ నగర్‌లోని శివారెడ్డి ఇంటిపైకి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు కత్తులతో వచ్చి వీరంగం చేశారు. శివారెడ్డిని పేరుతో పిలుస్తూ రా రా.. కిందికి రా.. అంతు చూస్తాం.. అంటూ అసభ్య పదజాలంతో పెద్దగా అరుస్తూ గేటును కాళ్లతో తన్నుతూ బీభత్సం చేశారు. పక్కనే ఉన్న ఇటుక రాళ్లతో ఇంటి అద్దాలను పగులగొట్టారు. ఇంటి పక్కనే ఉన్న శివారెడ్డి కారు అద్దాలు పగలగొట్టారు. శివారెడ్డి నున్న పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులు రావడంతో టీడీపీ కార్యకర్తలు వెళ్లిపోయారు. ఈ దాడిపై శివారెడ్డి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళతా: మల్లాది విష్ణు

శివారెడ్డి ఇంటిపై దాడి గర్హనీయమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఈ ఘటనను సీపీ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తానన్నారు. ఎన్నడూ లేని విధంగా ఇళ్లపై దాడులు చేయడం ఏమిటని, పోలీసులు వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలు డిమాండ్ చేశారు. బొండా ఉమా ప్రోత్సాహంతోనే దాడులు జరిగాయని ఆరోపించారు.

టీడీపీ దాడిలో సొసైటీ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు

నరసరావుపేట: పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లిలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు గోగిరెడ్డి పిచ్చిరెడ్డిపై శుక్రవారం టీడీపీ కార్యకర్తలు దాడిచేసి గాయపరిచారు. వైఎస్సార్‌సీపీ అయ్యప్పనగర్ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్న పిచ్చిరెడ్డి ఇంట్లో ఉండగా అయ్యప్పనగర్‌కు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడిచేశారు. ఈ దాడిలో పిచ్చిరెడ్డి తలకు తీవ్రగాయం కావడంతోపాటు చెయ్యి విరిగింది. ఆయన్ని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ ఆఫీసులు, నాయకుల ఇళ్లపై దాడులు సరికాదు

- చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుని జీవితాలను పాడుచేసుకోవద్దు
- టీడీపీ కార్యకర్తలకు గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ హితవు



కొరిటెపాడు(గుంటూరు): ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ వారు బలహీనంగా ఉన్నారని వారి ఆఫీసులు, నాయకుల ఇళ్ల మీద, వ్యక్తిగత దాడులు చేయటం మంచి పద్ధతి కాదని గుంటూరు ఎంపీగా ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజలు అరాచకం, రౌడీయిజాన్ని కోరుకోరు. అభివృద్ధిని కోరుకుంటారు. మనం అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం. అందరం వేడుకలు చేసుకోవాల్సిన సమయంలో దాడులు చేయడం సరికాదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలి. మిమ్మల్ని ఎవరైనా ఇబ్బందులు పెడితే మా దృష్టికి తీసుకురండి. దానికి మేం చట్టపరంగా పోలీసుల అండతో ఏం చేయాలో అది చేసే బాధ్యత తీసుకుంటాం. అంతేగాని చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుని అనవసరంగా మీ జీవితాలను కేసుల రూపంలో పాడు చేసుకోవద్దు.' అని పెమ్మసాని హితవుపలికారు.

బార్‌పై టీడీపీ శ్రేణుల దాడి... రూ.1.40లక్షల మద్యం అపహరణ

- నరసరావుపేటలో ఘటన..
- ఎమ్మెల్యేతో మాట్లాడుకున్న తర్వాతే వ్యాపారం చేయాలని హెచ్చరిక
- బార్ యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు



బార్‌కు వేసిన తాళాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట శివారు జొన్నలగడ్డ రోడ్డులో తాను నిర్వహిస్తున్న పల్నాడు బార్ అండ్ రెస్టారెంట్‌పై టీడీపీకి చెందిన వ్యక్తులు దాడిచేసి రూ.1.40 లక్షల విలువైన మద్యం అపహరించారని బార్ యజమాని, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు షేక్ నూరుల్ అక్తాబ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బార్‌కు బలవంతంగా తాళాలు వేశారని పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... 'తొలుత గురువారం నాకు ఓ వ్యక్తి ఫోన్ చేసి నూతన ఎమ్మెల్యేతో మాట్లాడుకున్న తర్వాతే బార్ వ్యాపారం చేయాలని చెప్పారు. ఈ మేరకు నేను బార్‌కు తాళాలు వేసి వెళ్లాను. అనంతరం రాత్రి 10గంటల సమయంలో ఇద్దరు టీడీపీ మహిళా నాయకుల ఆధ్వర్యంలో 20మంది బార్ వద్దకు వచ్చి తాళాలు పగులకొట్టి కౌంటర్‌లోని మద్యం బాటిళ్లను తీసుకెళ్లారు. అదే సమయంలో మీ యజమాని వచ్చి మా ఎమ్మెల్యేను కలవాలని వారు అక్కడున్న సిబ్బందిని హెచ్చరించారు. వారు వెంట తెచ్చుకున్న తాళాలను బార్‌కు వేసుకుని వెళ్లారు. నాకు ఈ విషయం తెలిసిన వెంటనే బార్ వద్దకు వెళ్లి తాళాలను పరిశీలించి జిల్లా ఎస్పీ మలికాగార్గ్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేశాను.' అని షేక్ నూరుల్ అక్తాబ్ పేర్కొన్నారు. తాను ఎస్పీకి ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వెంటనే రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రోశయ్య, పోలీసు సిబ్బంది వచ్చి పరిశీలించారని తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీసు అధికారులు, క్లూస్‌టీమ్, ఎక్సైజ్ ఎస్ఈబీ సీఐ నయనతార, ఎస్ఐలు వచ్చి పంచనామా చేసి స్టాకు వివరాలు తనకు ఇచ్చారని చెప్పారు. తన ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి శిలాఫలకం ధ్వంసం

టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమక్షంలోనే ఆయన అనుచరుల విధ్వంసం



మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న ఆదిరెడ్డి వాసు అనుచరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకాన్ని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అనుచరులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే బ్రిడ్జి పనులు పరిశీలిస్తుండగానే రెచ్చిపోయిన అనుచరులు ఈ విధ్వంసానికి దిగారు. శిలాఫలకంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతోపాటు ఆదిరెడ్డి వాసు సతీమణి అప్పటి ఎమ్మెల్యే భవాని, ఇతర ప్రజాప్రతినిధుల పేర్లున్నాయి. 2022 సెప్టెంబర్ 22న అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మోరంపూడి ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేసి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ శిలాఫలకాన్ని నేషనల్ హైవే అధికారులు మోరంపూడి జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు ఉన్నారు. ఆయన అనుచరులు ఒక్కసారిగా శిలాఫలకాన్ని గునపాలు, సుత్తులతో ధ్వంసం చేశారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా వారు ఆగలేదు.

విధ్వంసకర ఘటనలు దురదృష్టకరం: మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరంలో విధ్వంసకర ఘటనలు దురదృష్టకరమని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన శుక్రవారం వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నేతలు పాలిక శ్రీనివాస్, ఎన్వీ శ్రీనివాస్ తదితరులతో కలిసి మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇటీవల రాజమహేంద్రవరం పేపర్ మిల్లు సమీపంలో ధ్వంసం చేసిన ఒక కార్యాలయాన్ని పరిశీలించి, సీతంపేటలో జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి నీచ సంస్కృతి నగరంలో ఇంతకుముందు లేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మారణాయుధాలతో టీడీపీ కార్యకర్తల హల్‌చల్

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంట్లోకి చొరబడి భార్యాభర్తలపై దాడి



వెంకటాచలంలో ధ్వంసమైన మనోజ్‌కుమార్ కారు

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శుక్రవారం టీడీపీ కార్యకర్తలు మారణాయుధాలతో వీరంగం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంట్లోకి చొరబడి భార్యాభర్తల్ని గాయపరిచారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా సర్కారుతోట పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల తోపులాట జరిగింది. ఇప్పుడు ఎన్నికల ఫలితాల్లో కూటమి గెలుపొందడంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు ముగ్గురు మద్యం తాగి శుక్రవారం యేసు రత్నకుమార్ ఇంట్లోకి చొరబడ్డారు. నిద్రపోతున్న రత్నకుమార్‌పై మారణాయుధాలతో దాడిచేశారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన రత్నకుమార్ భార్య సాయిమహాలక్ష్మిని తీవ్రంగా గాయపరిచారు. రత్నకుమార్, సాయిమహాలక్ష్మి దంపతుల్ని చికిత్స నిమిత్తం బంధువులు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు సిలార్ దాదా, చిటికెన నాగేశ్వరరావు, మేకల సుబ్బన్న తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా సిలార్ దాదా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు దాడులు చేయటం సమంజసం కాదన్నారు. అధికారమదంతో దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కారు అద్దాలు ధ్వంసం

వెంకటాచలం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్త దూడల మనోజ్‌కుమార్ కారును ధ్వంసం చేశారు. సర్వేపల్లికి చెందిన మనోజ్‌కుమార్ తన కారును పోలీస్‌స్టేషన్ బయట నిలిపి లోపలికి వెళ్లారు. పెద్దగా శబ్దం రావడంతో బయటకు వచ్చిన ఆయన వెంకటాచలం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సండి సురేష్, బాలిబోయిన మహేష్ కారు అద్దాలను ధ్వంసం చేస్తుండటాన్ని గమనించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ పరిశోధన కేంద్రంపై దుశ్చర్య

పేరులో వైఎస్సార్ అక్షరాలు తొలగించిన టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్ పేరును తొలగించిన పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం పైభాగం

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా పలాసలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రంపై టీడీపీ కార్యకర్తలు శుక్రవారం దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ కేంద్రంపై పేరులో ఉన్న వైఎస్సార్ అనే అక్షరాలను తొలగించారు. శిలాఫలకాలను, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను తొలగించారు. ఆస్పత్రి రెండు విభాగాలుగా ఉన్న భవనాలపై ఏర్పాటు చేసిన వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ అనే తెలుగు, ఇంగ్లిష్ అక్షరాల్లో వైఎస్సార్ అనే అక్షరాలను తీసేశారు. రాజకీయాలకు అతీతంగా ఉద్దాన ప్రాంతంలో ఉన్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలతో పాటు ఆంధ్రా–ఒడిశా సరిహద్దుతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. అన్ని రకాల పరీక్షల నుంచి డయాలసిస్, అరుదైన ఆపరేషన్‌లకు ఈ ఆస్పత్రి నెలవుగా మారింది. ఉచితంగా స్కానింగ్ చేసి మందులు ఇస్తున్నారు. ఈ చర్యను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తీవ్రంగా ఖండించారు.

నీట్ టాపర్ ఆరిఫ్ అమీనా

ఉర్దూ మీడియంలో చదివి..



'మెహనత్ కర్నా హై... మోటివేట్ రెహనా హై (కష్టపడాలి... ప్రేరణతో ఉండాలి) అని చెప్పింది అమీనా ఆరిఫ్ తన విజయం గురించి. వైద్యవిద్యలో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే 'నీట్'లో 2024 సంవత్సరానికి 720 మార్కులకు 720 మార్కులతో టాప్ 1 ర్యాంకు సాధించింది అమీనా. ఈసారి దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది పరీక్ష రాస్తే వారిలో 67 మందికి టాప్ 1 ర్యాంకు వచ్చింది. వారిలో 14 మంది అమ్మాయిలు ఉన్నారు. వీరిలో మిగిలిన వారితో పోల్చితే అమీనా గెలుపు కాస్త భిన్నమైనది. ఎందుకంటే 10వ తరగతి వరకూ ఆమె ఉర్దూ మీడియంలో చదివింది.

బేకరి వర్కర్ కుమార్తె

ముంబై పశ్చిమ శివార్లలో ఉండే జోగేశ్వరి ప్రాంతం అమీనాది. తండ్రి బేకరీలో పని చేస్తాడు. అక్కడ ఉన్న మదీ్న హైస్కూల్ మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో పేరు గడించింది. ఉర్దూ మీడియంలో బోధన సాగే ఆ స్కూల్లోనే అమీనా పది వరకు చదివింది. ఆ తర్వాత పార్లెలోని మితిబాయి కాలేజీలో బైపీసీలో చేరింది. 'అంతవరకూ ఉర్దూ మీడియంలో చదవడం వల్ల బైపీసీ ఇంగ్లిష్ మీడియం చదవడం కష్టమైంది. ఇంగ్లిష్‌లో నా వెనుకంజ నా చదువునే వెనక్కు నెట్టకూడదని గట్టిగా కష్టపడ్డాను' అని తెలిపింది అమీనా. ఆమెకు ఇంటర్‌లో 95 శాతం మార్కులు వచ్చాయి.

మళ్లీ ప్రయత్నించి

'అమ్మా నాన్నా నన్ను బాగా చదువుకోమని ప్రోత్సహించారు. లాక్‌డౌన్ వల్ల మొదటిసారి నీట్ రాసినప్పుడు నాకు గవర్నమెంట్ కాలేజీలో సీట్ వచ్చేంత ర్యాంక్ రాలేదు. నిస్పృహ చెందకుండా ప్రయత్నించాను. ఈసారి కోచింగ్ తీసుకున్నాను. ఆరు గంటలు కోచింగ్, ఇంట్లో మరో నాలుగైదు గంటలు సెల్ఫ్ స్టడీ... ఇలా సాగింది నా కృషి. కోచింగ్ సెంటర్‌లో మాక్ టెస్టులు రాసేటప్పుడు 700 మార్కులకు తరచూ 620 వచ్చేవి. అప్పుడే అనుకున్నాను... కచ్చితంగా 700 దాటుతానని ముందే అనుకున్నాను' అని తెలిపింది అమీనా.

ఆమెకు వచ్చిన ర్యాంక్‌కు దేశంలోని ఏ మెడికల్ కాలేజీలో అయినా సీట్ వస్తుంది కానీ అమీనా మాత్రం ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలనుకుంటోంది.

'నీట్' ఎగ్జామ్‌లో ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా నిలవడం సామాన్యం కాదు. ముంబైలో ఓ బేకరి వర్కర్ కుమార్తె అయిన అమీనా ఆరిఫ్ పది వరకూ ఉర్దూ మీడియంలో చదివింది. ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియంతో ఇబ్బంది పడింది. అయినా నీట్ 2024లో 720 కి 720 తెచ్చుకుని టాప్ ర్యాంకర్‌గా నిలిచింది. ఆమె స్ఫూర్తిదాయక కథనం...

పక్షిని ఎగరనివ్వాలి!

మనలో చాలా మంది పక్షులను పెంచుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువశాతం తమ ఆహ్లాదం కోసమే. నిజానికి పక్షులను ఆదరించాల్సింది మన ఆహ్లాదం కోసం కాదు, వాటి ఆనందం కోసం దగ్గరకు తీయాలి. వాటి రెక్కలు విరిచి పంజరంలో పెట్టి మనం చూస్తూ ఆనందించడం హేయమైన చర్య. స్వేచ్ఛగా ఎగరడం వాటి సహజ లక్షణం. అది వాటికి ప్రకృతి ఇచ్చిన హక్కు. ఆ హక్కును కాలరాసే అధికారం మనకు లేదు... అంటున్నారు మహారాష్ట్ర, పుణేలో నివసిస్తున్న రాధికా సోనావానే.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న రాధిక పక్షి సంరక్షకురాలిగా మారిన క్రమాన్ని ఆమె చాలా ఇష్టంగా వివరిస్తారు.



రాధికా సోనావానే

"ప్రస్తుతం నా ఉద్యోగరీత్యా పూనాలో ఉన్నాం. మా స్వస్థలం ఔరంగాబాద్. బర్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ సలీం అలీ బర్డ్ సాంక్చురీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కచెప్పలేను. పక్షుల మీద మమకారం ఏర్పడింది. నేను బర్డ్ లవర్‌ని బర్డ్ వాచర్‌ని మాత్రమే అనుకున్నాను. కానీ ఏ మాత్రం ముందస్తు ప్రణాళికలు లేకుండా అనుకోకుండా పక్షి సంరక్షకురాలినయ్యాను. పెళ్లి తర్వాత నా నివాసం ఔరంగాబాద్‌లోనే ఒక ఫ్లాట్‌లోకి మారింది. మా పొరుగింట్లో ఓ పెద్దాయన బాల్కనీలో బర్డ్ ఫీడర్, ఒక గిన్నెలో నీరు పెట్టడం చూసిన తర్వాత నాకూ ఆలాగే చేయాలనిపించింది. పుణేకి బదిలీ అయిన తర్వాత కూడా కొనసాగింది. ఇప్పుడు మా ఇంటి గార్డెన్ పక్షుల విహార కేంద్రమైంది. నాకు తోచిన గింజలు పెట్టి సరిపెట్టకుండా ఏ పక్షికి ఏమి ఇష్టమో తెలుసుకోవడానికి పక్షుల జీవనశైలిని అధ్యయనం చేశాను. రామ చిలుకలకు వేరుశనగ పప్పులు ఇష్టం. గోరువంకలు అరటి పండు తింటాయి. రామ చిలుక ముక్కు పెద్దది. గోరువంక, పిచ్చుకల ముక్కులు చిన్నవి. ఆ సంగతి దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్సులు డిజైన్ చేయించాను. నేను పెట్టిన ఆహారాన్ని అవి ఇష్టంగా తింటున్నాయా లేదా, నేను చదివింది నిజమేనా కాదా అని తెలుసుకోవడానికి బాల్కనీలో కూర్చుని శ్రద్ధగా గమనించేదాన్ని. అరటి పండు ముక్కలను చూడగానే గోరువంకలు సంతోషంగా పాటలు పాడడం మొదలుపెడతాయి. పాట పూర్తయిన తర్వాత తింటాయి. టైయిలర్ బర్డ్ అయితే పత్తి దూదిని చూడగానే రాగాలు మొదలుపెడుతుంది. గూడు కట్టుకోవడానికి పత్తి కనిపిస్తే దాని ఆనందానికి అవధులు ఉండవు. మనం సాధారణంగా కాకులను ఇష్టపడం. కానీ అవి చాలా హుందాగా వ్యవహరిస్తాయి. కాకులు, పిచుకలు, చిలుకలు, గోరువంకలు ఇతరులకు హాని కలిగించవు. పావురాలు అలా కాదు. వాటి ఆహారపు అలవాట్లు కూడా అంత సున్నితంగా ఏమీ ఉండవు. తమ ఆహారంలో ఇతరులను ముక్కు పెట్టనివ్వవు. ఇతరుల ఆహారాన్ని కూడా తామే తినేయాలన్నంత అత్యాశ వాటిది.



పక్షి స్వేచ్ఛాజీవి

పెట్ డాగ్‌లాగా యజమానితో అనుబంధం పెంచుకోవడం పక్షుల్లో ఉండదు. స్వేచ్ఛగా విహరిస్తూ అనేక ప్రదేశాలకు వెళ్తుంటాయి. ఒక ప్రదేశంతో కానీ వ్యక్తితో కానీ అనుబంధం పెంచుకోవు. మా ఇంటికి వచ్చే నా అతిథుల్లో చిలుకలే ఎక్కువ. అలెగ్జాండ్రియన్ ప్యారట్, ఇండియన్ రింగ్‌నెక్ ప్యారట్‌లు తరచూ కనిపిస్తుంటాయి. సన్‌బర్డ్, వీవర్ బర్డ్ కూడా వస్తుంటాయి. కాలం మారేకొద్దీ అవి అప్పటి వరకు ఉన్న ప్రదేశాలను వదిలి తమకు అనువైన ప్రదేశాలకు వెళ్లిపోతుంటాయి. వాయు కాలుష్యం, వాతావరణంలో వస్తున్న మార్పులు కూడా పక్షుల వలసలకు కారణమే. సెల్ ఫోన్ టవర్‌ల నుంచి వెలువడే రేడియేషన్ కారణంగా పక్షులు కంటి చూపును కోల్పోతున్నాయి. దాంతో అవి తమకు సురక్షితమైన ప్రదేశాలను వెతుక్కుంటూ ఎటుపోతున్నాయో తెలియడం లేదు. కరవు, అధిక వర్షాలు, యాసిడ్ వర్షాలు, అడవులలో చెట్లు నరకడం, మంటలు వ్యాప్తించడం... వాటికి ఎదురయ్యే ప్రమాదాలు. పక్షులు అడవిలో జీవించినంత ధైర్యంగా మనుషుల మధ్య జీవించలేవు. వాటికి మనుషులంటే భయం. ఆ భయాన్ని వదిలించి మచ్చిక చేసుకోవాలంటే వాటికి ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఒక్కటే మార్గం. ఆహారం కోసం ధైర్యం చేస్తాయి, క్రమంగా మన మీద నమ్మకం కలిగిన తర్వాత మన ఇంటిని తమ ఇంటిలాగా భావిస్తాయి. మా గార్డెన్‌కి రోజూ నలభై నుంచి యాభై పక్షుల వరకు వస్తుంటాయి. వాటి కోసం ఇంట్లో వంట గది, హాలు, బాల్కనీల్లో పక్షుల కోసం నీటి పాత్రలు పెట్టాను. దాహం వేసినప్పుడు నేరుగా దగ్గరలో ఉన్న నీటి పాత్ర దగ్గరకు వెళ్లిపోతాయి. పక్షులు మనతో మాట్లాడతాయి. రోజూ మా ఇంటి ఆవరణలో వినిపించే కిచకిచలన్నీ అవి నాకు చెప్పే కబుర్లే. కరోనా సమయంలో నా టైమ్ అంతా వీటి కోసమే కేటాయించాను. నన్ను నిత్య చైతన్యంగా ఉంచాయవి. నిజానికి పక్షి ప్రేమికులెవ్వరూ పక్షులను పంజరంలో బంధించరు. తమ సంతోషం కోసం పక్షులను పెంచే స్వార్థజీవులే ఆ పని చేస్తారు. దయచేసి పక్షులను బంధించవద్దు. వాటిని స్వేచ్ఛగా ఎగరనివ్వండి. చేతనైతే రోజుకు గుప్పెడు గింజలు, ఒక పండు పెట్టండి" అంటూ పక్షుల గురించి ఆసక్తికరమైన విషయాలెన్నో చెబుతారు రాధిక.

వారి చేతుల్లో...

వ్యర్థాలు కూడా బొమ్మలవుతాయి

ఈ మహిళల చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు ఒక్కోటి ఒక్కో కథ చెబుతుంటాయి. బొమ్మల శరీరాలు కాటన్ కాన్వాస్‌తో విభిన్న రంగులతో సాంస్కృతిక వైవిధ్యంతో ఆకట్టుకుంటాయి. మూస ధోరణులకు భిన్నంగా స్త్రీల చేతుల్లో తల్లీ–బిడ్డలు, భార్యాభర్తలు, పిల్లల బొమ్మలు రూపుదిద్దుకుంటాయి. న్యూఢిల్లీలోని అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు హస్తకళల్లో నైపుణ్యాలకు శిక్షణ ఇస్తూ ఫ్యాబ్రిక్ వ్యర్థాలతో అందమైన బొమ్మలు, గృహాలంకరణ వస్తువులను రూపొందిస్తుంది ఐరిస్ స్ట్రిల్. శరణార్థులకు స్థిరమైన ఆదాయవనరుగా మారడమే కాదు పర్యావరణ హితంగానూ తనదైన ముద్ర వేస్తోంది.



భారతదేశంలో నివసిస్తున్న ఫ్రెంచ్ డిజైనర్ ఐరిస్ స్ట్రిల్. టెక్స్‌టైల్, క్రాఫ్ట్ పరిశ్రమలో విస్తృతమైన అనుభవం ఉన్న సీనియర్ క్రియేటివ్ డిజైనర్. ఆమె భర్త బిశ్వదీప్ మోయిత్రా ఢిల్లీవాసి. కళాకారుల ప్రతిభను పెంపొందించడం, మహిళా సంఘాలను ప్రోత్సహించడం, ట్రెండ్‌ను అంచనా వేయడం, అట్టడుగు హస్తకళాకారుల కోసం వారి సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను అమలు చేయడంలో ఐరిస్ విస్తృత స్థాయిలో పని చేస్తుంది. దేశంలోని హస్తకళాకారులతో ఆమెకు మంచి పరిచయాలు ఉన్నాయి. అందమైన ఇండియన్ ఫ్యాబ్రిక్ వ్యర్థాలు, వస్త్రాల తయారీలో మిగిలి పోయిన వస్త్రాల గుట్టలను చూస్తూ ఉండేది.

పర్యావరణ అనుకూలమైన ఆలోచన

"ఈ వ్యర్థాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో కొన్నాళ్లు పాటు ఆలోచించాను. అదే సమయంలో అఫ్ఘాన్ మహిళా శరణార్థులను శక్తిమంతం చేయాల్సిన అవసరాన్ని కూడా గుర్తించాను. ఇక్కడ డిజైన్ పని చేస్తున్న సమయంలో తరచూ భారతీయ గ్రామీణ మహిళలకు వారి సంప్రదాయ నైపుణ్యాలను ప్రపంచ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో శిక్షణ ఇచ్చే ప్రాజెక్ట్‌లను చేయడం మొదలుపెట్టాను. ఆ విధంగా అనేకమంది హస్తకళాకారులతో నాకు పరిచయం ఏర్పడింది. యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్‌హెచ్‌సిఆర్) జీవనోపాధి కార్యక్రమాలలో భాగమైన ఆఫ్ఘన్ శరణార్థ మహిళలతో కలిసి అనేక శిక్షణా కార్యక్రమాలలో పాల్గొన్నాను. అలా నాలో శరణార్థులతో కలిసి పనిచేయాలనే ఆలోచన కలిగింది. ఆ ఆలోచన నుంచే 'సిలైవాలి' సంస్థ పుట్టింది. పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన, వ్యర్థ పదార్థాలను ఉపయోగించి చేతి వృత్తుల ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా జీవనోపాధిని పొందడంలో అట్టడుగున ఉన్న కళాకారులకు సహాయపడే ఒక సామాజిక సంస్థను నెలకొల్పాను. బొమ్మలు శరణార్థ మహిళల ప్రత్యేకతగా మారినప్పటికీ, ఇతర గృహోపకరణాలు కూడా వారు తయారుచేస్తారు.





స్థిరమైన ఆదాయం

మా ఉత్పత్తులు పూర్తిగా పర్యావరణ అనుకూలమైనవి. వీటికి సరైన ధరలను నిర్ణయించి, వాటి ద్వారా కళాకారుల సంఘాలను ఏర్పాటు చేయడానికి సహాయపడేందుకు ఒక స్థిరమైన ఆదాయానికి కల్పిస్తున్నాం. అభివృద్ధి చెందిన దేశాలలో స్థిరపడాలనే ఉద్దేశంతోనూ, వారి స్వదేశంలో అస్థిరత కారణంగా పారిపోతున్న అఫ్ఘాన్ శరణార్థులకు న్యూఢిల్లీ ఒక ఇల్లుగా చెప్పవచ్చు. సిలైవాలి సంస్థ ద్వారా 70 మంది మహిళా శరణార్థులకు స్థిరమైన ఆదాయం లభిస్తోంది. శరణార్థుల ఇళ్లకు కూతవేటు దూరంలో పరిశుభ్రమైన పని వాతావరణం, పిల్లలను కూడా పనిలోకి అనుమతించడం వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. ఈ సంస్థ ద్వారా తయారైన బొమ్మలు, ఇతర అలంకార వస్తువులు ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా కాన్సెప్ట్ స్టోర్‌లలో అమ్మకానికి ఉన్నాయి. దేశరాజధానిలో సొంత స్టోర్‌తో పాటు వెబ్‌సైట్ ద్వారా కూడా అమ్మకాలను జరుపుతున్నాం. కళాత్మక వస్తువులను క్లాత్‌తో రూపొందించడం వల్ల ఫ్యాషన్ దృష్టిని ఆకర్షిస్తున్నాం. వేస్ట్ ఫ్యాబ్రిక్‌ను అందమైన స్మారక చిహ్నాలు, గృహాలంకరణలో హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువుల తయారీకి మూడు గంటల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాం. దీనితో కళాకారుల నుంచి మహిళలు కుట్టు పని, ఎంబ్రాయిడరీ వంటివి నేర్చుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా మా ఉత్పత్తులను ప్రజల ముందుకు తీసుకెళుతున్నాం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ సంవత్సరం గ్యారెంటీడ్ ఫెయిర్ ట్రేడ్ ఎంటర్‌ప్రైజ్‌గా వరల్డ్ ఫెయిర్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్ ను కూడా పొందింది. మా సంస్థ ద్వారా గుడ్డ బొమ్మలు, బ్యాగులు, ఆభరణాలు తయారు చేస్తాం" అని వివరిస్తారు ఈ క్రియేటర్.

సముద్ర సంరక్షణలో...



దివ్య హెగ్డే



భర్త ఇంద్రనీల్ సేన్‌గుప్తాతో రబియా తివారీ

సముద్రమంత గాంభీర్యం అంటారు. సముద్రమంత సాహసం అంటారు. సముద్రమంత సహనం అంటారు. అయితే ఇప్పుడు 'గాంభీర్యం' 'సాహసం' 'సహనం' స్థానంలో 'ప్రమాదం' కనిపిస్తోంది. కాలుష్యం బారిన పడి తల్లడిల్లుతున్న సముద్రం గుండె చప్పుడు విన్న వాళ్లు బాధ పడుతూ కూర్చోవడం లేదు. సముద్ర కాలుష్యాన్ని నివారించే కార్యక్రమాల్లో భాగం అవుతున్నారు. 'వరల్డ్ ఓషన్స్ డే' సందర్భంగా ఓషన్ యాక్టివిస్టులు దివ్య హెగ్డే, రబియా తివారీ గురించి...

గూగుల్ మాజీ ఉద్యోగి అయిన దివ్యా హెగ్డే కర్నాటక కోస్తా ప్రాంతాలలో సముద్ర కాలుష్యం, నివారణ మార్గాల గురించి ప్రచారం చేస్తోంది. క్లైమెట్ యాక్టివిస్ట్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా గుర్తింపు పొందిన దివ్య వివిధ కళారూపాల ద్వారా సముద్ర కాలుష్యంపై పోరాడుతుంది.

ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను సముద్రంలో పారవేయకుండా నిరోధించడానికి యక్షగాన ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ యక్షగాన ప్రదర్శనలో 'ప్లాస్టిక్' ను రాక్షసుడిగా చూపించారు. ఆ రాక్షసుడిని మట్టికరిపించే శక్తి మానవుడిలో ఉంది అనే సందేశాన్ని ఇచ్చారు.ఈ యక్షగానంలో తడి చెత్త, పొడి వ్యర్థాల పాత్రలను కళాకారులు పోషించారు.

సముద్రంపై ప్లాస్టిక్ హానికరమైన ప్రభావాన్ని చూపించేలా 'ప్లాస్టిక్ అసుర' పాత్రను రూపొందించారు. 'కర్ణాటకలో యక్షగానానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ బలమైన కళారూపం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయడం వరకు ఎన్నో విషయాలు చెబుతున్నాం. ఈ ప్రచారాల ద్వారా ప్రజలకు మంచి విషయాలను చేరువ చేయడం ఒక కోణం అయితే కళాకారులకు ఆర్థికపరంగా సహాయపడడం మరో కోణం' అంటుంది దివ్య.

'బేరు' అనే స్వచ్ఛందసంస్థ ద్వారా తీరప్రాంత వ్యర్థాల నిర్వహణపై పనిచేస్తోంది దివ్య.

వ్యర్థాలను ప్రాసెస్ చేయడం గురించి మహిళలకు శిక్షణ ఇచ్చారు. వీరు ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తారు. సముద్ర వ్యర్థాలను తగ్గించే విధానాలలో ఇది ఒకటి. తడి చెత్త ప్రాసెసింగ్ ద్వారా వచ్చే సేంద్రియ ఎరువులను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తారు.



వ్యర్థాలను సేకరించడం, ప్రాసెస్ చేయడం ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు.

మత్స్యకారుల కుటుంబాలలో డిజిటల్ నైపుణ్యాలు పెంచడంపై కూడా 'బేరు' దృష్టి పెట్టింది.

దీనిలో భాగంగా యూజర్–ఫ్రెండ్లీ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించారు. 'డోర్–టు–డోర్ వేస్ట్ కలెక్షన్' కార్యక్రమాలలో మహిళలకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

ముంబైకి చెందిన రబియా తివారీ తన భర్త ఇంద్రనీల్ సేన్‌గుప్తాతో కలిసి సముద్ర కాలుష్యంపై పోరాడుతుంది. ముంబైలో సముద్రతీర అపార్ట్‌మెంట్‌కు మారినప్పుడు బీచ్‌లో టన్నుల కొద్ది చెత్తను చూసి చలించిపోయారు ఈ దంపతులు. ఆ బాధలో నుంచే 'ఎథికో ఇండియా' అనే సామాజిక సంస్థను మొదలుపెట్టారు.

ఇద్దరు వ్యక్తులతో మొదలైన 'ఎథికో ఇండియా' ఆ తరువాత 'సిటిజెన్ మూవ్‌మెంట్' స్థాయికి చేరుకుంది.

ఉద్యమం ఊపందుకోవడంతో వాలంటీర్లు మాహిమ్ బీచ్ నుంచి కిలోల కొద్దీ పోగుపడిన సముద్ర వ్యర్థాలను తొలగించారు.

సోషల్ మీడియా వేదికగా ఎంతోమందిని ఉద్యమంలో భాగం చేసింది 'ఎథికో ఇండియా'.

'మాహిమ్ బీచ్ క్లీన్ అప్ డ్రైవ్'ను ఐక్యరాజ్య సమితి గుర్తించింది. ఈ ఉద్యమం మరికొన్ని ఉద్యమాలకు ద్వారాలు తెరిచింది. 'ఓపెన్ ఫెస్ట్' అనేది అందులో ఒకటి. కళల ద్వారా సముద్ర కాలుష్యంపై పోరాడటమే దీని లక్ష్యం.

'ఓపెన్ ఫెస్ట్'లో అంకుర్ తివారీ, మానసీ పరేఖ్, అనురాగ్ శంకర్, చందన బాల కళ్యాణ్, సుమిత్ నాగ్‌దేవ్‌లాంటి ప్రముఖ కళాకారులు భాగం అయ్యారు.

'మా ప్రయత్నం ఫలించినందుకు సంతోషంగా ఉంది. అధికారులలో మార్పు వచ్చింది. ప్రక్షాళన కార్యక్రమాల్లో మాతో కలిసి చురుగ్గా పాల్గొంటున్నారు' అంటుంది రబియా తివారీ.

శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం కోసం ఎవరి పద్ధతులు వారికి ఉంటాయి. కొందరు రకరకాల ఎక్సర్‌సైజులు చేస్తే, పొట్టను మాడ్చుకుంటారు కొందరు. వాకింగ్, జాగింగ్ వంటి వాటితో ప్రారంభించి, చిన్న చిన్న బరువులు మోయడం... ఆ తర్వాత వాటన్నింటినీ అనుసరించలేక నీరస పడి పోతుంటారు ఇంకొందరు. అయితే అలా కాకుండా తేలిగ్గా చేయగలిగే సింపుల్ ఎక్సర్‌సైజ్ ఒకటుంది. అదేమంటే మెట్లెక్కడం... నిజమే! మెట్లెక్కడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి మెట్లెక్కినట్లే! అయితే దానికీ ఓ పద్ధతుంటుంది మరి.

ఆరోగ్యానికి మెట్లు...



నడవటం, పరుగెత్తటం, సైకిల్ తొక్కటం, ఈదటం లాంటి మిగతా వ్యాయామాలే కాదు, రోజూ మెట్లెక్కటం, దిగటం వల్ల కూడా శరీరం ఆరోగ్యవంతంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

సాధారణంగా నేలమీద నడుస్తున్నప్పటి కంటే మెట్లెక్కుతూ పైకి వెళ్ళటం, కిందకు దిగటం మూలంగా కండరాలు బలపడతాయి. తొడలు, కాలి పిక్కలు పటిష్ఠంగా తయారవుతాయి. కండరాలు బలంగా ఉంటే నిటారుగా, మంచి ఫిటెనెస్‌తో ఉన్నట్లుగా కనిపిస్తారు.

శరీరాకృతి పట్ల శ్రద్ధ ఉండి రోజూ ఎక్సర్‌సైజులు చేసేవాళ్ళు, వాటితోపాటు మెట్లెక్కటాన్ని కూడా అలవాటు చేసుకుంటే రోజు రోజుకూ శరీరాకృతిలో వచ్చే మార్పులను చూసి మనకే ఆశ్చర్యం వేస్తుంది.

ఇలా అలవాటు చేసుకోవాలి!

కింద నుంచి 8 మెట్ల దాకాఎన్నుకుని ఆ 8 మెట్లనూ పైకి ఎక్కటం, కిందికి దిగటం, మళ్ళీ ఎక్కటం, దిగటం అలా అలిసిపోయేదాకా చేయాలి. లేదా ఒక అంతస్తు పైదాకా ఎక్కుతూ దిగుతూ ఉండాలి. మెట్లను పైకి ఎక్కుతున్నప్పుడు చేతుల్ని రిలాక్స్‌గా పక్కలకు వదిలేయాలి. మోచేతుల్ని మాత్రం కొద్దిగా వంచాలి. బాగా ప్రాక్టీస్ అయాక మోచేతుల్ని ఇంకా వంచవచ్చు. ఇలా చేయటం వల్ల మోకాళ్ళను ఎత్తి ఎత్తి వేయటానికి అనువుగా ఉంటుంది. అయితే ఎన్ని మెట్లెక్కినా, మరునాటికి కాళ్ళపిక్కల్లో పోట్లు, నొప్పులు వంటివి ఉండకూడదు. అలా ఉన్నాయంటే మీరు శక్తికి మించి మెట్లెక్కుతూ దిగుతున్నారన్న మాట.

- మెట్లు ఎక్కుతూ దిగుతూ వున్నప్పుడు పాదాలు జారకుండా ఉండటానికి సౌకర్యంగా ఉండే షూస్ వాడాలి.
- మిగతా ఎక్సర్ సైజులతో పాటు రెండు మూడు అంతస్తుల మెట్లను ఇలా ఎక్కుతూ దిగితే మీ శరీరం వెచ్చదనానికి చేరుకుంటుంది తర్వాత శరీరం మామూలు స్థితికి వచ్చి కూల్ డౌన్ కావటానికి అనువుగా రిలాక్స్ అవుతూ కొద్దిసేపు నడవాలి. ఇందుకు సుమారు మూడు నుంచి 10 నిముషాల సమయం పడుతుంది.
- మిగతా ఏ ఎక్సర్ సైజులూ చేయనివారు ఈ మెట్లెక్కే ఎక్సర్ సైజును వారానికి కనీసం రెండుసార్లన్నా చేయాలి. తడవకు 20 నిముషాలకు తగ్గకుండా. ఆ తర్వాత పైన చెప్పిన నడక ఎక్సర్‌సైజును తిరిగి చేయాలి.
- దీనిని ఒక సాధనగా చేసుకోవాలంటే మొదటి రెండువారాలలో 2 అంతస్తుల దాకా మెల్లగా ఎక్కుతూ దిగాలి. మూడో వారం వచ్చేసరికి 3 అంతస్తులు... ఇలా అయిదు అంతస్తుల దాకా అలుపు లేకుండా ఎక్కి, దిగగలిగేలా సాధన చేయాలి.

మీ ఇల్లు ఎంత శుభ్రం?



మనం ఎంత శుభ్రంగా ఉన్నా, మన ఇల్లు శుభ్రంగా లేకపోతే ప్రయోజనం ఉండదు. రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ఇల్లు శుభ్రంగా ఉంటేనే ఇంట్లోని వాళ్ళు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండగలరు. నిజానికి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం...

ఇంటిని శుభ్రంగా ఉంచడం కోసం ముందుగా గుమ్మం దగ్గర ఉండే డోర్‌మ్యాట్‌ని శుభ్రం చేసుకోవడంతో ప్రారంభించాలి. ఎందుకంటే మనం ఇంట్లోకి, బయటకి తిరిగేటప్పుడు కాళ్లకు ఉండే మట్టి అంటేది డోర్ మ్యాట్‌కే కాబట్టి డోర్ మ్యాట్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. వారానికోసారి డోర్‌మ్యాట్‌ని మారుస్తుండాలి.

అందుబాటులో ఉంచుకోవడం: ■ శుభ్రతకి కావాల్సిన వస్తువులన్నింటినీ మన చేతికి అందేలా ఉంచుకోవడం వల్ల సమయం కలిసొస్తుంది. పని కూడా సులువు అవుతుంది. ■ కిటికీలు తెరిస్తే వెలుతురుతో పాటు దుమ్ము కూడా వచ్చేస్తుంది. అందుకే కిటికీల రెక్కలను కొద్దిసేపు తెరిచి ఉంచిన తర్వాత మళ్లీ మూసేయాలి. ఇక కిటికీ అద్దాలకీ దుమ్ము, ధూళి, సూక్ష్మజీవులు కూడా ఎక్కువగా అంటి పెట్టుకుని ఉంటాయి. అందువల్ల కిటికీలను ప్రతిరోజూ శుభ్రం చేస్తుంటే సీజనల్ అలర్జీల నుంచి దూరంగా ఉండొచ్చు.

బూజు దులపటం: ■ ఇంటినంతా చక్కగా కడిగి శుభ్రంగా ఉంచడంతో పాటు గోడ మూలల్లో ఉన్న బూజును కూడా దులపాలి. ఇంట్లో చెత్తని తొలగించడంలో ఏమాత్రం అజాగ్రత్త ఉండకూడదు. ముఖ్యంగా బాత్రూమ్‌లో, వంటగదుల్లోనూ సూక్ష్మజీవులు పెరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకే ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి. ఇంటి ముందు చెట్లు ఉంటే పరిశుభ్రమైన గాలి వస్తుంది. తేమ శాతం తగ్గుతుంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలతో ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల నుండి కొంతవరకు రక్షణ పొందవచ్చు ■ ఇక ఇంటిని శుభ్రం చేయడమంటే చాలా పెద్ద సమస్య. వస్తువులను శుభ్రంగా కడిగే ముందు ఎక్కువగా దుమ్ము పేరుకునే వస్తువులను ముందుగా శుభ్రం చేసుకుంటే సగం పని అయిపోతుంది. దీనికి కింది సూచనలు పాటిస్తే సరిపోతుంది.

సీలింగ్ ఫ్యాన్స్: ■ సీలింగ్ ఫ్యాన్‌లను తుడవకుండా ఉంటే వాటిపై దుమ్ము ఎక్కువగా చేరుతుంది. దానివల్ల ఇంట్లో ఉండే ఫర్నిచర్‌పై దుమ్ము పడుతుంది. కాబట్టి ఫ్యాన్‌ను మొదట శుభ్రం చేయాలి.

కంప్యూటర్: ■ కంప్యూటర్, లాప్‌టాప్ కీబోర్డు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోతే తొందరగా పాడైపోయే అవకాశం ఉంది.

టీవీ: ■ టీవీ స్క్రీన్‌ను ఒక శుభ్రమైన మెత్తటి బట్టతో తుడవాలి. అలాగే టీవికి ముందు వైపు కన్నా వెనుక భాగంలో ఎక్కువగా దుమ్ము ఉంటుంది. దాన్ని దులపడటం చాలా అవసరం.

అద్దాలు: ■ ఇంట్లో ఉండే అద్దాలను, గాజు పాత్రలను శుభ్రంగా కడిగి తుడిచి పెట్టండి. ఇలా చేయటం వల్ల పాత్రలు కొత్తవిగా కనిపిస్తాయి

పక్కబట్టలు మడతపెట్టడం: ■ రోజంతా పని చేసిన తర్వాత వచ్చి సేదదీరేది బెడ్ మీదనే. మీ పడకగది మురిగ్గా ఉండటం చూస్తే నిద్ర కూడా సరిగా పట్టదు. కాబట్టి నిద్ర లేవగానే దుప్పటిని దులిపి మడతబెట్టాలి. బెడ్‌షీట్‌ను నీట్‌గా సర్దాలి.

దుస్తుల శుభ్రం: ■ ఒకేసారి మొత్తం బట్టలు ఉతకాలంటే అలసట రావడం సహజమే, పైగా అందుకు ఎక్కువ సమయం కూడా పడుతుంది. ధరించే దుస్తులలో రకాన్ని బట్టి వేటికవి విడదీసి ఉతికితే సులభంగా ఉంటుంది.

చెత్తను వదిలించుకోవడం: ఇంటిలో అనవసరమైన వస్తువులు తీసి బయట పడేసి తర్వాత అన్నిటినీ సర్దటం మంచిది. ఈ అలవాటును అందరూ తప్పక పాటించాలి. వాడే వస్తువులు అన్నీ అందుబాటులో ఉండేలా సర్దుకోవాలి. టేబుల్స్ లేదా బల్లలపై తక్కువ వస్తువులుంటే వాటిని శుభ్రపర్చటం సులువవుతుంది.

ఇంటి వాకిలి దగ్గర ఉంచే షూ ర్యాక్ కూడా శుభ్రపర్చటం చాలా ముఖ్యం. అలాగే మీకేదన్నా దాని స్థానంలో లేదు అన్పిస్తే, మళ్ళీ చేద్దాం లే అని వదిలేయకండి. అప్పటికప్పుడు చేయటం మంచిది.

నిద్రించే ముందే: మీరు ప్రతి రాత్రి పడుకునే ముందు అన్నిటినీ శుభ్రం చేసే అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలకు వాళ్ల వస్తువులను సర్దేసి, వారి గదులను శుభ్రం చేసుకుని పడుకునేలా తర్ఫీదు ఇవ్వండి. వంట గదిని కూడా శుభ్రం చేసి పడుకోటం నేర్చుకోండి.

పరిసరాల పరిశుభ్రత

మీ ఇంటిని శుభ్రంగా, నీటుగా ఉంచుకోడానికి, పరిశుభ్రత అలవాట్లు చాలా ముఖ్యం. ఇది అందరి బాధ్యత. ఇంటి శుభ్రత కోసం మీరొక్కరే కాదు, కుటుంబసభ్యులు కూడా కృషి చేయాలి. అలా మీరే తర్ఫీదు ఇవ్వడం అవసరం. చిన్న పిల్లలు కదా, వాళ్లేమి చేయగలరులే అని వదిలేస్తే, తర్వాత మీరే బాధపడాల్సి ఉంటుంది కాబట్టి చిన్నప్పటినుంచి పిల్లలకు కూడా ఎక్కడ తీసిన వస్తు సామగ్రిని అక్కడ పెట్టడం అలవాటు చేయడం అవసరం.

హెల్త్ టిప్స్



రాత్రి పడుకునేముందు గ్లాసు నీళ్లలో టీస్పూను మెంతులు వేసి నానపెట్టాలి. ఉదయం పరగడుపున ఈ నీళ్లను తాగడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. కీళ్లనొప్పులనుంచి ఉపశమనం కలగడంతోపాటు, శరీర బరువు అదుపులో ఉంటుంది. రోజూ మెంతుల నీళ్లు తాగడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.

రాత్రి పూట నిద్రకు ముందు ఒక గ్లాస్ చల్లని పాలను తాగాలి. పాలను బాగా మరిగించి అనంతరం వాటిని చల్లార్చి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. దీంతో పాలు చల్లగా మారుతాయి. అనంతరం వాటిని నిద్రకు ముందు తాగాలి. ఇలా మూడు రోజుల పాటు వరుసగా చేస్తే ఎసిడిటీ తగ్గిపోతుంది.

రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనం అనంతరం కాసిని సోంపు గింజలను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. ఇలా చేస్తుంటే జీర్ణ సమస్యలు అన్నీ తగ్గిపోతాయి. ముఖ్యంగా కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

లైఫ్@360

● బ్యాడ్ బ్రీత్

తేలిగ్గా తీసుకోవద్దు..!

ఎవరైనా సరే, నోటిని సరిగా శుభ్రం చేయకపోతే దుర్వాసన రావడం సహజం.. అయితే చిగుళ్ల వాపు లేదా దంత సంబంధమైన వ్యాధులు ఏమీ లేకుండా... సక్రమంగా బ్రష్ చేసిన తర్వాత కూడా నోటి నుంచి వాసన వస్తుంటే, దానిని అంత తేలికగా తీసిపారేయడానికి వీలులేదని, కొన్ని రకాల ఇతర వ్యాధులకు సంకేతంగా భావించి దాని గురించి శ్రద్ధ వహించమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నోటి దుర్వాసన అనేది ఆహారపు అలవాట్లు, నోటి పరిశుభ్రతపై ఆధారపడి ఉంటుంది. అందు వల్ల, దంతవైద్యులు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని, భోజనం తర్వాత నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిలించి నోటిని శుభ్రం చేయమని చెబుతుంటారు. ఇవి పాటించిన తర్వాత కూడా మీ నోటి నుంచి దుర్వాసన వస్తుంటే, అది శరీరంలో ఇప్పుడిప్పుడే తొంగి చూస్తున్న కొన్ని వ్యాధులకు సంకేతం కావచ్చు.

◆ **కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు**

సైనసైటిస్, బ్రాంకైటిస్, న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా నోటి దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. దీనితోపాటు, ఈ ఇన్ఫెక్షన్లు సంభవించినప్పుడు, శ్వాసకోశంలో బ్యాక్టీరియా పెరుగుతుంది. దీని కారణంగా వాసన కలిగించే మూలకాలు ఏర్పడి ఇవి గాలి వదిలినప్పుడు దుర్వాసన వచ్చేలా చేస్తాయి

◆ **జీర్ణ సమస్యలు**

కడుపులో ఉండే ఆమ్లాలు అన్నవాహికలోకి ప్రవహించినప్పుడు యాసిడ్ రిఫ్లక్స్ సంభవిస్తుంది. దీనివల్ల నోటిలో పుల్లని తేన్పులతోపాటు వాసన కూడా వస్తుంటుంది.

◆ **కిడ్నీవ్యాధులు**

మూత్రపిండాలనేవి శరీరంలోని మలినాలను వడపోసి శరీరాన్ని శుభ్రంగా ఉంచుతాయి. మూత్రపిండాల పనితీరు మందగించినప్పుడు అవి వాటి పని సక్రమంగా చేయలేక శరీరంలో వ్యర్థాలు పేరుకుని పోతాయి. ఈ విధంగా రక్తంలో చేరిన వ్యర్థాల వల్ల వారు ఊపిరి పీల్చి వదిలేటప్పుడు ఒక విధమైన దుర్వాసన వెలువడుతుంటుంది.

◆ **బీపీ, షుగర్**

మధుమేహం ఉన్నవారిలో ఇది చాలా సాధారణ సమస్య.. ఎందుకంటే వారి శ్వాసలో ఎక్కువ కీటోన్లు ఉంటాయి. ఇవి ఒకవిధమైన చెడు శ్వాసను వెలువరిస్తుంటాయి. అదేవిధంగా దీర్ఘకాలికంగా బీపీ ఉన్న వారు వాడే కొన్ని రకాల మందులు కూడా నోటి దుర్వాసనకు కారణం కావచ్చు.

◆ **కాలేయ సంబంధ వ్యాధులు**

లివర్ సిర్రోసిస్ లేదా ఫ్యాటీ లివర్ వంటి కాలేయ సమస్యల వల్ల శరీరంలోని వ్యర్థాల నిర్వహణ సరిగా జరగదు. అందువల్ల కాలేయంలో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు కూడా నోటి దుర్వాసన వస్తుంది.

అందువల్ల నోటి దుర్వాసన ఉన్నప్పుడు దంత వైద్యుని సంప్రదించి, వారు సూచించిన మౌత్‌వాష్‌లను, ఇతర విధాలైన మౌత్ ఫ్రెష్‌నర్లను ఉపయోగించినా కూడా నోటి దుర్వాసన వదలకపోతుంటే మాత్రం అది ఇతర వ్యాధులకు సూచనగా భావించి ఫ్యామిలీ వైద్యుని సంప్రదించి వారి సూచన మేరకు తగిన పరీక్షలు చేయించుకుని మందులు వాడాల్సి ఉంటుంది.

సినిమా

రాజమహేంద్రవరంలో....



● రామ్‌చరణ్

రాజమహేంద్రవరం పయనమయ్యారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ చేంజర్' అనే పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అంజలి, శ్రీకాంత్, సునీల్, జయరాం, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని తెలిసింది. తండ్రి పాత్రలో అప్పన్నగా, కొడుకు పాత్రలో ఐఏఎస్ ఆఫీసర్ రామ్‌నందన్‌గా రామ్‌చరణ్ కనిపిస్తారట. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో ప్రారంభం కానుంది. ఈ చిత్రీకరణలో పాల్గొనేందుకు శుక్రవారం రామ్‌చరణ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వెళ్లారు. ఈ షెడ్యూల్‌తో 'గేమ్ చేంజర్' సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుందట. ఇక రామ్‌చరణ్, అంజలి, శ్రీకాంత్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని తెలిసింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

ప్రేమ పరీక్షలు పెట్టా!



● తాప్సీ



● మథియాస్‌తో...

"మథియాస్‌తో నాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాదు. మథియాస్ కన్నా ముందు నేను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశాను. కానీ మథియాస్ పరిచయమై, తనతో మాట్లాడటం మొదలుపెట్టాక ఫైనల్‌గా నా అభిప్రాయానికి తగ్గ మనిషిని కనుగొనగలిగాను అనిపించింది" అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్, తాప్సీ ఈ ఏడాది మార్చి 23న అత్యంత సన్నిహితుల సమక్షంలో ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పెళ్లి చేసుకున్నారు. ఈ ఇద్దరిదీ లవ్ మ్యారేజ్. అయితే మథియాస్‌తో ప్రేమలో పడే ముందు కొన్ని ప్రేమ పరీక్షలు పెట్టానని తాప్సీ చెబుతూ – "నాకు క్రీడాకారులంటే ఇష్టం. దేశం కోసం వాళ్లు ఆడుతుంటారు. ఇక మథియాస్‌తో నాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాదు. అలాగే ఒక నెలలో పుట్టిన ప్రేమ కూడా కాదు. మా మధ్య ఉన్నది నిజమైన ప్రేమేనా అని తెలుసుకోవడానికి కొన్ని ప్రేమ పరీక్షలు పెట్టాను. అన్నింటిలోనూ మథియాస్ గెలిచాడు. ఒక అనుబంధం బలంగా నిలవడం ముఖ్యం. అందుకే నేను తొందరపడలేదు. అంతకు ముందు నాకు పరిచయం ఉన్న అబ్బాయిలు వేరు... మథియాస్ వేరు. ఆ అబ్బాయిల్లో ఏ ఒక్కరినీ మథియాస్‌తో పోల్చలేం. పరిణతి, భద్రతాభావం... ఇవే అతను నాకు సరైన వ్యక్తి అని నిర్ణయించుకునేలా చేశాయి" అన్నారు.

కొంత గ్యాప్ తర్వాత...



● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా'. 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. రజనీ తాళ్లూరి ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. యావత్ భారత దేశాన్ని కదిలించిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు. కాగా కొంత గ్యాప్ తర్వాత ఈ సినిమా షూటింగ్ మళ్లీ ఆరంభం కానుంది. తాజా షెడ్యూల్ చిత్రీకరణను ఈ నెల 19న హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ స్టూడియోలో ప్లాన్ చేశారు. ప్రస్తుతం సెట్ వర్క్ జరుగుతోంది. కొత్తగా ప్రారంభం కానున్న షూటింగ్ షెడ్యూల్‌లో ఓ యాక్షన్ ఎపిసోడ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్టును కూడా చిత్రీకరిస్తారట మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

ఆమె కదిలే కవిత్వం!

గోవా, ఖాట్మండు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొందిన 'మను' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు ఫణీంద్ర నర్సెట్టి. ఆయన దర్శకత్వంలోని తర్వాతి సినిమాకు '8 వసంతాలు' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, శుద్ధీ అయోధ్య పాత్రలో అనంతిక నటిస్తున్నట్లు వెల్లడించారు మేకర్స్. అలాగే ఫస్ట్ లుక్ పోస్టర్‌పై ఆమె కదిలే కవిత్వం అనే ట్యాగ్‌లైన్ ఉంది.



● అనంతిక

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. "శుద్ధీ అయోధ్య ఓ మంచి కుమార్తె... ప్రేమికురాలు. మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్, రైటర్, మంచి మానవతావాది. ఆమె జీవితంలో 19 ఏళ్ల నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన ఎనిమిది సంవత్సరాల ప్రయాణం ఈ సినిమాలో ఉంటుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: నరేశ్ కుమారన్, కెమెరా: విశ్వనాథ్ రెడ్డి.

మిస్ యు



● సిద్ధార్థ్

సిద్ధార్థ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'మిస్ యు' అనే టైటిల్ ఖరారైంది. 'మాప్పిళ్లయ్ సింగమ్' ఫేమ్ ఎన్. రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్యామ్యూల్ మాథ్యూ నిర్మిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామా సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక సిద్ధార్థ్ ఓ లీడ్ రోల్‌లో నటించిన 'ఇండియన్ 2', 'ది టెస్ట్' సినిమాలు కూడా ఈ ఏడాదే విడుదలకు సిద్ధం అవుతున్నాయి.


ఆ క్షణాల కోసం ఎదురు చూస్తున్నా!

- మైఖేల్ బి జోర్డాన్



విల్ స్మిత్ నటించిన హాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'ఐ యామ్ లెజెండ్'. ఫ్రాన్సిస్ లారెన్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2007లో విడుదలై, ఘనవిజయం సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఐ యామ్ లెజెండ్ 2'ని దాదాపు రెండేళ్ల క్రితం ప్రకటించారు. విల్ స్మిత్‌తో పాటు మైఖేల్ బి జోర్డాన్ కూడా ఈ సీక్వెల్‌లో నటించనున్నారు. ఈ విషయం గురించి జోర్డాన్ మాట్లాడుతూ– "ఇంకా ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. చిత్రీకరణ ఎప్పుడు మొదలవుతుంది? ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అనే విషయాల గురించి ఇప్పుడే చెప్పలేను. అయితే విల్ స్మిత్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనుండటం ఆనందంగా ఉంది. విల్‌తో కెమెరా ముందు నటించే క్షణాల కోసం ఎదురు చూస్తున్నాను" అని చెప్పుకొచ్చారు. ఇక 'ఐ యామ్ లెజెండ్ 2'కి ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మళ్లీ ఏ



ఉపేంద్ర హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఏ' చిత్రం మళ్లీ విడుదల కానుంది. 1998లో దాదాపు రూ. 1 కోటీ 25 లక్షలతో రూపొందిన ఈ చిత్రం రూ. 20 కోట్లు వసూలు చేసింది. కొత్త తరహా రొమాంటిక్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు. ఈ చిత్రాన్ని తాజాగా 4కేలో ఉపేంద్ర ఉప్పి క్రియేషన్స్, లింగం యాదవ్ చందు ఎంటర్‌టైన్మెంట్ విడుదల చేయనున్నాయి. ఈ నెల 21న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా లింగం యాదవ్ మాట్లాడుతూ – "అప్పట్లో 'ఏ' ఒక సంచలనం. ఇప్పటికే కన్నడలో రీ రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన స్పందన రాబట్టింది. జూన్ 21న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల చేయనున్నాం. ఇక మేం 4కేలో విడుదల చేసిన ప్రభాస్ 'ఛత్రపతి, యోగి' చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. 'ఏ'కి కూడా మంచి ఆదరణ దక్కుతుందనే నమ్మకం ఉంది" అన్నారు.

గర్వంగా చెప్పుకునే సూపర్ హీరో ఫిల్మ్ ఇది

- అరవింద్ కృష్ణ

అరవింద్ కృష్ణ, మనీష్ గిలాడ, జ్యోతి పూర్వజ్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో సుకు పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో మెర్జ్ ఎక్స్‌ఆర్‌తో కలిసి సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ– "'ఏ మాస్టర్ పీస్' మనం గర్వంగా చెప్పుకునే సూపర్ హీరో మూవీ అవుతుంది. నేను సినిమాలు వదిలేసిన సమయంలో నాలాంటి హీరో ఇండస్ట్రీలో ఉండాలని, నన్ను సినిమాలు చేయమని ప్రోత్సహించిన సుకుకు థ్యాంక్స్" అన్నారు. "ఓ సూపర్ హీరో క్యారెక్టర్‌కు మన పురాణాల నేపథ్యాన్ని జోడిస్తే మన నేటివ్ సూపర్ హీరో ఫిల్మ్ చేయవచ్చనే ఆలోచనతో 'ఏ మాస్టర్ పీస్' సినిమాను ప్రారంభించాం. కథలో మైథాలజీని, సైన్స్ ఫిక్షన్‌ను కలిపేందుకు శివుడి పాత్రను సంధానంగా తీసుకున్నా. ఇది పురాణాల్లో ఉండదు. కల్పిత పాత్రగా రాసుకున్నాను. క్లైమాక్స్ మినహా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమాలో నా భార్య జ్యోతి పూర్వజ్ ఇంపార్టెంట్ రోల్ చేస్తోంది" అన్నారు సుకు పూర్వజ్. "ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నాను" అన్నారు నటుడు-నిర్మాత మనీష్ గిలాడ. హీరోయిన్ జ్యోతి పూర్వజ్, సినిమాటోగ్రాఫర్ శివరామ్ చరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాధవ్ మాట్లాడారు.



● జ్యోతి, అరవింద్ కృష్ణ, మనీష్

ఫుల్ కామెడీ



● రవికృష్ణ

రవికృష్ణ, సమీర్ మళ్ల, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. బొమ్మా బొరుసా పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి విస్కి దర్శకుడు. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ – "నేను ఎంఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లినప్పుడు ఐదుగురు చిన్ననాటి స్నేహితులకు జరిగిన ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ఇదొక కామెడీ డ్రామా. ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. సినిమా సహజంగా ఉండాలని సింక్ సౌండ్ వాడాం. మంచి కంటెంట్, టెక్నికల్ వేల్యూస్‌తో రానున్న ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ శ్రీనివాస్, కెమెరా: సంకీర్త్ రాహుల్.

సాక్షి బిజినెస్

శనివారం
8-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,619	76,693
నిఫ్టీ ▲	469	23,290

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	17,206	▲	32
డోజోన్స్	38,911	▲	25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▼	40
డాక్స్	18,557	▼	95
షాంఘై	3,051	▲	2
నికాయ్	38,684	▼	20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,913	▼	844
బంగారం (99.5 స్వచ్ఛత)	71,625	▼	841
వెండి (కిలో)	90,535	▲	125

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయకర	81.54	85.22
£	బ్రిటన్ పౌండ్	భారతీయకర	104.33	109.19
€	యూరో	భారతీయకర	88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)	భారతీయకర	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయకర	53.23	58.01
S$	సింగపూర్ డాలర్	భారతీయకర	59.69	64.36
SAR	సౌదీ రియాల్	భారతీయకర	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకర	21.81	23.60
¥	చైనా యువాన్	భారతీయకర	10.39	12.46

ఆర్థికాభివృద్ధి.. ధరల కట్టడే లక్ష్యం

ఎనిమిదోసారీ కీలక రుణ రేటు యథాతథం

6.50 శాతంగా కీలక వడ్డీ రేటు కొనసాగింపు • ఆర్‌బీఐ విధాన సమీక్షలో నిర్ణయం
• 2024–25లో జీడీపీ వృద్ధి రేటు 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంపు
• ద్రవ్యోల్బణం అంచనా 4.5 శాతం



ముంబై: అంతా ఊహించినట్లే రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను (రెపో) వరుసగా ఎనిమిదో సారీ యథాతథంగా ఉంచింది. ఇటు పటిష్టమైన వృద్ధి అటు ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని 6.5 శాతం స్థాయిలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) వృద్ధి రేటు గతంలో భావించిన 7 శాతానికి మించి 7.2 శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. అలాగే ద్రవ్యోల్బణం 4.5 శాతం స్థాయిలో ఉండొచ్చని పేర్కొంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్షకు సంబంధించి బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశమైన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ఈ విషయాలు వెల్లడించారు. ఆగస్టు 8న తదుపరి పాలసీ ప్రకటన ఉంటుంది. వడ్డీ రేటును తగ్గించాలని గత సమీక్షలో అభిప్రాయపడిన వారు ఒకరే ఉండగా ఈసారి అది ఇద్దరికి పెరిగింది. ఎక్స్‌టర్నల్ సభ్యులు (ఆషిమా గోయల్, జయంత్ వర్మ) వీరిలో ఉన్నారు. బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే నిధులపై వసూలు చేసే వడ్డీ రేటే రెపో. బ్యాంకింగ్ వ్యవస్థలో వడ్డీ రేట్లు ప్రధానంగా దీనిపై ఆధారపడి ఉంటాయి. 2023 ఫిబ్రవరి నుంచి ఈ రేటు యథాతథంగా ఉంది.

బల్క్ డిపాజిట్ల పరిమితి పెంపు



బ్యాంకుల అసెట్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపర్చేందుకు తోడ్పడేలా బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల ప్రారంభ పరిమితిని ఆర్‌బీఐ రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్లకు పెంచింది. సాధారణంగా రిటైల్ టర్మ్ డిపాజిట్లతో పోలిస్తే బల్క్ ఎఫ్‌డీలపై బ్యాంకులు కొంత అధిక వడ్డీ రేటు ఇస్తాయి. పరిమితులను సవరించడం సాధారణంగా జరిగేదేనని కొన్నేళ్ల క్రితం ఇది కోటి రూపాయలుగా ఉండేదని, తర్వాత రెండు కోట్లకు పెరిగిందని, తాజా పరిస్థితుల కు అనుగుణంగా దీన్ని రూ. 3 కోట్లకు పెంచామని డిప్యూటీ గవర్నర్ జె. స్వామినాథన్ తెలిపారు.

యూపీఐ లైట్ వాలెట్లు, ఫాస్టాగ్‌లకు ఆటోలోడ్ సదుపాయం..



చిన్న మొత్తాలను డిజిటల్‌గా చెల్లించేందుకు ఉపయోగపడే యూపీఐ లైట్ వాలెట్లలో బ్యాలెన్స్ తగ్గినప్పుడల్లా ఆటోమేటిక్‌గా లోడ్ చేసుకునే సదుపాయాన్ని కస్టమర్లకు అందుబాటులోకి తేవాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం దీన్ని ఈ–మ్యాన్‌డేట్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. యూపీఐ లైట్ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ఇది ఉపయోగపడగలదని దాస్ తెలిపారు. ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ)లను కూడా ఈ–మ్యాన్‌డేట్ పరిధిలోకి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం యూపీఐ లైట్ రోజువారీపరిమితి రూ. 2,000గా ఉండగా, ఒకసారి గరిష్టంగా రూ. 500 వరకు మాత్రమే చేయడానికి వీలుంది. యూపీఐ లైట్ యాప్‌లో బ్యా లెన్స్ గరిష్టంగా రూ. 2,000కు మించరాదు.

బ్యాంకుల సిస్టమ్ వైఫల్యాల వల్లే పేమెంట్స్ అంతరాయాలు..

చెల్లింపు లావాదేవీల్లో అంతరాయాలతో కస్టమర్లకు సమస్యలు ఎదురవడానికి కారణం బ్యాంకుల సిస్టమ్‌ల వైఫల్యమే తప్ప యూపీఐ, ఎన్‌పీసీఐలు కాదని దాస్ చెప్పారు. ప్రతి అంతరాయాన్ని కేంద్రీయ బ్యాంకులో సంబంధిత అధికారులు నిశితంగా అధ్యయనం చేస్తారని, ఈ విషయంలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) లేదా ఏకీకృత చెల్లింపుల విధానం ప్లాట్‌ఫాం లోపాలున్నట్లుగా ఏమీ వెల్లడి కాలేదని ఆయన తెలిపారు. టెక్నాలజీకి సంబంధించి బ్యాంకులు గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నాయన్నారు.

> మబ్బులు పడుతున్నాయా లేదా విడిపోతున్నాయా అనే విషయాన్ని నిశితంగా పరిశీలిస్తూ, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మేము తగు నిర్ణయాలు తీసుకుంటాం. ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్న ద్రవ్యోల్బణం కట్టడే మా ప్రధాన లక్ష్యం.
> – శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

సానుకూలంగా లగ్జరీ కార్ల మార్కెట్

• ఈ ఏడాది 50,000 పైచిలుకు అమ్మకాలు
• ఆడి ఇండియా హెడ్ ధిల్లాన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా లగ్జరీ కార్ల మార్కెట్ వృద్ధి అవకాశాలపై తాము ఆశావహంగా ఉన్నామని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ 33 శాతం వృద్ధితో 7,027 యూనిట్లు విక్రయించినట్లు సాక్షి బిజినెస్ బ్యూరోకు చెప్పారు. అలాగే తమ ప్రీ–ఓన్డ్ కార్ల వ్యాపార విభాగం ఆడి అప్రూవ్డ్: ప్లస్ కూడా 50 శాతం వృద్ధి నమోదు చేసినట్లు వివరించారు. ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండటం, స్టాక్ మార్కెట్లు పనితీరు బాగుండటం, చురుకైన స్టార్టప్ వ్యవస్థ, ఉద్యోగిత పెరుగుతుండటం తదితర అంశాలు భారత్‌లో లగ్జరీ కార్ల సెగ్మెంట్ వృద్ధికి దోహదపడుతున్నాయని ధిల్లాన్ చెప్పారు. 2023 నాటి రికార్డు స్థాయి అమ్మకాలతో పోలిస్తే లగ్జరీ మార్కెట్ కాస్త తగ్గినా 2024లో పరిశ్రమవ్యాప్తంగా 50,000 పైచిలుకు వాహన విక్రయాలు నమోదు కావచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.లక్షకే చేతక్ స్కూటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీలో ఉన్న బజాజ్ చేతక్ తాజాగా 2901 మోడల్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.99,998 ఉంది. కంపెనీ ఆఫర్ చేస్తున్న మోడళ్లలో ఇదే తక్కువ ధర కలిగింది. చేతక్ అర్బేన్ ధర రూ.1,23,319 కాగా, చేతక్ ప్రీమియం రూ.1,47,243 ఉంది. 2901 మోడల్ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 123 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. 2.88 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. టాప్ స్పీడ్ గంటకు 63 కిలోమీటర్లు. స్టీల్ బాడీతో తయారైంది. చార్జింగ్‌కు 6 గంటలు తీసుకుంటుంది. రూ.3 వేలు చెల్లించి టెక్‌ప్యాక్ సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ మోడ్, యాప్ కనెక్టివిటీ, కాల్ మేనేజ్‌మెంట్, మ్యూజిక్ కంట్రోల్, జియో–ఫెన్సింగ్ ఫీచర్లు అదనంగా చేరతాయి.

• ఆర్‌బీఐ వృద్ధి అంచనాల పుష్

మార్కెట్ల హై జంప్





• సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త రికార్డులు
• సెన్సెక్స్ @ 76,693– 23,290కు నిఫ్టీ
• మళ్లీ 5 ట్రిలియన్ డాలర్లకు మార్కెట్

వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల దౌడు తీశాయి. పాలసీ సమీక్షలో భాగంగా ఆర్‌బీఐ వృద్ధి అంచనాలను పెంచడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సమయం గడిచేకొద్దీ మార్కెట్లు బలపడుతూ వచ్చాయి. చివరి సెషన్‌కల్లా సెన్సెక్స్ 1,721 పాయింట్ల 'హై'జంప్ చేసింది. 76,795ను అధిగమించింది. చివరికి 1619 పాయింట్లు జమ చేసుకుని 76,693 వద్ద ముగిసింది. ఈ బాటలో నిఫ్టీ 469 పాయింట్లు ఎగసి 23,290 వద్ద స్థిరపడింది. వెరసి ఇండెక్సులు చరిత్రాత్మక గరిష్టాలను సాధించాయి. ఇక ఇంట్రాడేలో నిఫ్టీ 499 పాయింట్లు దూసుకెళ్లి గరిష్టంగా 23,320కు చేరింది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకానున్నప్పటికీ ఈ ఏడాది దేశ జీడీపీ 7.2 % పురోగమించనుందన్న అంచనాలతో బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈలలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. టెలికం, ఐటీ, ఆటో, రియల్టీ, మెటల్, ఆయిల్ 4–2% మధ్య పుంజుకున్నాయి.

రూ. 423 లక్షల కోట్ల పైకి...

మంగళవారం పతనం తదుపరి మూడు రోజుల్లో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ)కు రూ. 28.65 లక్షల కోట్లు జమయ్యింది. దీంతో మళ్లీ రూ. 423 లక్షల కోట్లను అధిగమించింది. 5.08 ట్రిలియన్ డాలర్లను తాకింది. బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ సోమవారం రూ. 426 లక్షల కోట్ల(5.13 ట్రిలియన్ డాలర్లు)కు చేరడం ద్వారా సరికొత్త రికార్డ్ నెలకొల్పిన విషయం విదితమే. సానుకూల రుతుపవనాలు ఆర్‌బీఐ లక్షిత 4.5 శాతం ద్రవ్యోల్బణ కట్టడికి సహకరించనున్న అంచనాలు సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ విలువలో రూ. 31 లక్షల కోట్లు చిల్లుపడినప్పటికీ మూడు రోజుల్లోనే రికవర్‌కావడం విశేషం!!

ఎఫ్‌పీఐల యూటర్న్



దేశీ స్టాక్స్‌లో ఇటీవల భారీ స్థాయిలో అమ్మకాలు చేపడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్నారు. నగదు విభాగంలో నికరంగా రూ. 4,391 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత మూడు రోజుల్లో ఎఫ్‌పీఐలు ఏకంగా రూ. 24,960 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే.

గ్లాండ్ ఫార్మా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా శ్రీనివాస్ సాదు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈవో శ్రీనివాస్ సాదు ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవోగా పదోన్నతి పొందారు. జూన్ 10 నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని కంపెనీ శుక్రవారం తెలిపింది. సంస్థ వృద్ధి, విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీనివాస్ 2019 ఏప్రిల్ 25న ఎండీ, సీఈవోగా బాధ్యతలు స్వీకరించారని గ్లాండ్ ఫార్మా తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-6-2024	
విశాఖ	455–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	455–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

సాక్షి స్పోర్ట్స్

షూటర్ సిఫ్ట్ కౌర్‌కు కాంస్యం



ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో పతకం లభించింది. మ్యూనిక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా కాంస్య పతకం సొంతం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 452.9 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ స్వర్ణ పతకం సాధించాడు.

క్వార్టర్ ఫైనల్లో సహజ



అమెరికాలో జరుగుతున్న అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల డబ్ల్యూ75 టోర్నీలో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సహజ 6–4, 2–6, 6–1తో స్కాట్ కత్రీనా (అమెరికా)పై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

అల్‌కరాజ్ అదరహో

తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్లోకి • సెమీస్‌లో రెండో ర్యాంకర్ సినెర్‌పై గెలుపు



సినెర్
అల్‌కరాజ్

పారిస్: కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించడానికి స్పెయిన్ టెన్నిస్ స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ విజయం దూరంలో నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్‌కరాజ్ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. వచ్చే వారం కొత్త ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించనున్న ప్రస్తుత రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ)తో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో అల్‌కరాజ్ 2–6, 6–3, 3–6, 6–4, 6–3తో గెలుపొందాడు. నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), గత ఏడాది రన్నరప్ కాస్పర్ రూడ్ (నార్వే) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో అల్‌కరాజ్ తలపడతాడు. 21 ఏళ్ల అల్‌కరాజ్ 2022లో యూఎస్ ఓపెన్, 2023లో వింబుల్డన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. అడ్రియానో పనట్టా (1976లో) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన తొలి ఇటలీ ప్లేయర్‌గా ఘనత వహించాలనుకున్న సినెర్‌కు నిరాశ ఎదురైంది. 4 గంటల 9 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సినెర్ చివరి రెండు సెట్లలో అల్‌కరాజ్ ఆటకు ఎదురునిలువలేక ఓడిపోయాడు. 8 ఏస్‌లు, 7 డబుల్ ఫాల్ట్‌లు చేసిన అల్‌కరాజ్ 65 విన్నర్స్‌తో అదరగొట్టాడు. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయిన ఈ మాజీ నంబర్‌వన్ ప్రత్యర్థి సర్వీస్‌ను కూడా ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 15 పాసింగ్, 23 డ్రాప్ షాట్‌లతో అలరించిన అల్‌కరాజ్ నెట్ వద్దకు 27 సార్లు దూసుకొచ్చి 16 సార్లు పాయింట్లు గెలిచాడు.

స్వియాటెక్ X జాస్మిన్

• నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
• సాయంత్రం గం. 6:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో



కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా స్వియాటెక్... తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలనే పట్టుదలతో జాస్మిన్ పావోలిని... నేడు జరిగే ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో తలపడనున్నారు. ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్) ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను మూడుసార్లు (2020, 2022, 2023) చేజిక్కించుకోగా... 15వ ర్యాంకర్ జాస్మిన్ (ఇటలీ) మాత్రం కెరీర్‌లో 18వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతూ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరింది.

'సూపర్' సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సౌరభ్ నేత్రావల్కర్ ఆసక్తికర నేపథ్యం • అమెరికాను గెలిపించిన భారత ప్లేయర్





డాలస్: టి20 ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో గురువారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో 'సూపర్ ఓవర్'ను అద్భుతంగా బౌల్ చేసి అమెరికాను గెలిపించిన లెఫ్టార్మ్ పేసర్ సౌరభ్ నేత్రావల్కర్‌పై అన్ని వైపుల నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. భారత్‌కు చెందిన అతను చదువు, ఉద్యోగరీత్యా యూఎస్‌కు వెళ్లి ఇప్పుడు తొలిసారి వరల్డ్ కప్ ఆడుతున్న తమ టీమ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 32 ఏళ్ల సౌరభ్ 2013లో తన తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడాడు. సూర్యకుమార్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, వసీం జాఫర్ ఆ మ్యాచ్‌లో అతని సహచరులు. అయితే ఎన్నో ఆశలతో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన అతనికి అదే చివరి రంజీ మ్యాచ్ కూడా అయింది. అజిత్ అగార్కర్, జహీర్ ఖాన్, అవిష్కార్ సాల్వి, ధావల్ కులకర్ణిలాంటి పేసర్లు ఉన్న ముంబై టీమ్‌లో అతనికి చోటు దక్కడం కష్టమైపోయింది. అంతకు మూడేళ్ల క్రితమే అండర్–19 వరల్డ్ కప్‌లో ఆడి భారత్ తరఫున అత్యధిక వికెట్లు (9) తీసిన బౌలర్‌గా నిలిచాడు. అయితే అతను ఆశించినట్లుగా దేశవాళీ కెరీర్ ఊపందుకోకపోగా, ఐపీఎల్ అవకాశం కూడా దక్కలేదు. నిజానికి 2009లోనే సౌరభ్ వెలుగులోకి వచ్చాడు. ఎయిరిండియా ప్రతిభాన్వేషణలో భాగంగా బెంగళూరు ఎన్‌సీఏలో అద్భుత బంతితో యువరాజ్ సింగ్‌ను బౌల్డ్ చేయడంతో అతనికి స్కాలర్‌షిప్ లభించింది. కొద్ది రోజులకే అదే ఎయిరిండియా తమ ప్రధాన జట్టులోకి తీసుకోవడంతో యువరాజ్, రైనాలతో కలిసి కార్పొరేట్ టోర్నీ కూడా ఆడాడు. తర్వాతి ఏడాది కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, ఉనాద్కట్, హర్షల్ పటేల్‌లతో కలిసి అండర్–19 ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు.

అయితే ఏకైక రంజీ మ్యాచ్ తర్వాత మళ్లీ ఆశించిన అవకాశాలు రాలేదు. మరో రెండేళ్లు క్రికెట్‌లో గట్టిగా ప్రయత్నిస్తానని, లేదంటే ఆటను ఆపేస్తానని సౌరభ్ తన తండ్రికి చెప్పాడు. చివరకు అదే జరిగింది. కంప్యూటర్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఎమ్మెస్ చేసేందుకు 2015లో అమెరికాకు వెళ్లిపోయాడు. న్యూయార్క్‌లో ప్రతిష్టాత్మక కార్నెల్ యూనివర్సిటీలో అవకాశం లభించింది. చదువులో ప్రతిభతో పాటు క్రికెట్ పరిజ్ఞానంతో 'క్రిక్‌డీకోడ్' అనే యాప్‌ను తయారు చేయడంతో ప్రత్యేక స్కాలర్‌షిప్ కూడా లభించింది. చదువు పూర్తి కాగానే అతనికి ఒరాకిల్ సంస్థలో ఉద్యోగం కూడా వచ్చింది. అమెరికా చేరాక సరదాగా వారాంతపు క్రికెట్ ఆడుతూ వచ్చిన సౌరభ్... ఆ తర్వాత ఆటపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన యూఎస్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఆడటంతో మరింత గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో అమెరికా తరఫున 2018లో తొలి వన్డే ఆడిన నేత్రావల్కర్ గత ఏడాది జరిగిన మేజర్ లీగ్‌లో ఆకట్టుకోవడంతో టి20 టీమ్‌లో రెగ్యులర్ సభ్యుడిగా మారాడు. అండర్–19 వరల్డ్ కప్‌లో పాక్‌తో మ్యాచ్‌లో బాబర్ ఆజమ్‌తో తలపడిన సౌరభ్... ఇప్పుడు బాబర్ టీమ్‌ను చిత్తు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. వరల్డ్ కప్ మ్యాచ్ కోసం ఆఫీసుకు సెలవు పెట్టిన సౌరభ్ ప్రదర్శన తర్వాత సౌరభ్ కంపెనీ 'ఎక్స్' ద్వారా తమ ఇంజినీర్‌ను అభినందించింది.

లక్ష్య సేన్ ఓటమి



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్, ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ ఓటమి పాలయ్యాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో 61 నిమిషాలపాటు జరిగిన పోరులో లక్ష్య సేన్ 22–24, 18–21తో ఓడిపోయాడు. లక్ష్య సేన్‌కు 7,150 డాలర్ల (రూ. 5 లక్షల 96 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

హంపి, వైశాలి పరాజయం

స్టావెంజర్: నార్వే చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు హంపి, వైశాలి, ప్రజ్ఞానంద ఓడిపోయారు. జూ వెన్‌జున్ (చైనా)తో 'అర్మగెడాన్' గేమ్‌లో హంపి 42 ఎత్తుల్లో... టింగ్జీ లె (చైనా)తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో వైశాలి 26 ఎత్తుల్లో ఓడిపోయారు. కరువానా (అమెరికా) 'అర్మగెడాన్' గేమ్‌లో 46 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించాడు.

ఐర్లాండ్‌కు కెనడా షాక్

12 పరుగుల తేడాతో కెనడా జయభేరి • సమష్టిగా దెబ్బతీసిన బౌలర్లు



న్యూయార్క్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శాశ్వత సభ్య దేశం ఐర్లాండ్ జట్టుకు తొలిసారి టి20 ప్రపంచకప్‌లో ఆడుతున్న కెనడా జట్టు షాక్ ఇచ్చింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం జరిగిన పోరులో కెనడా తక్కువ లక్ష్యాన్ని కాపాడుకొని 12 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను కంగుతినిపించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. ఓపెనర్లు ఆరోన్ జాన్సన్ (14), నవ్‌నీత్ ధలివాల్ (6) సహా పర్గత్ సింగ్ (18), దిల్‌ప్రీత్ (7) నిరాశపరిచారు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నికోలస్ కిర్టన్ (35 బంతుల్లో 49; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మొవ్వ శ్రేయస్ (36 బంతుల్లో 37; 3 ఫోర్లు) రాణించడంతో కెనడా కోలుకుంది. ప్రత్యర్థి బౌలర్లలో క్రెయిగ్ యంగ్, మెకార్తి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసి ఓడిపోయింది. హేలిగెర్ (2/18), గొర్డాన్ (1/13), సిద్దికీ (1/27), జాఫర్ (1/22) సమష్టిగా దెబ్బ కొట్టారు. దీంతో 59 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఐర్లాండ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో డాక్‌రెల్ (23 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ అడైర్ (24 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా చివరకు ఐర్లాండ్‌కు ఓటమి తప్పలేదు.

స్కాట్లాండ్ బోణీ



లీస్క్, బెరింగ్టన్

బార్బడోస్: టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో స్కాట్లాండ్ తొలి విజయం నమోదు చేసింది. గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఐదు వికెట్ల తేడాతో నమీబియాపై నెగ్గింది. ఇంగ్లండ్–స్కాట్లాండ్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా... ఈ గెలుపుతో స్కాట్లాండ్ మూడు పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానంలోకి వెళ్లింది. స్కాట్లాండ్‌తో పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. కెప్టెన్ ఎరాస్మస్ (31 బంతుల్లో 52; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించాడు. బ్రాడ్ వీల్ 3, బ్రాడ్ కరీ 2 వికెట్లు తీశారు. అనంతరం స్కాట్లాండ్ 18.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ బెరింగ్టన్ (35 బంతుల్లో 47 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మైకేల్ లీస్క్ (17 బంతుల్లో 35; 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడి స్కాట్లాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: గయానా ; ఉదయం గం. 5 నుంచి
బంగ్లాదేశ్ X శ్రీలంక
వేదిక: డాలస్ ; ఉదయం గం. 6 నుంచి
దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్
వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్ ; రాత్రి గం. 10:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

క్లుప్తంగా...

కడప జెడ్పీ చైర్మన్ 'ఆకేపాటి' రాజీనామా



రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పిస్తున్న ఆకేపాటి అమర్‌నాథ్

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని కలెక్టర్ విజయరామరాజుకు అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన రాజంపేట శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఏదో ఒక పదవి మాత్రమే ఉండాలి గనుక జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా సమర్పించినట్లు ఆయన తనను కలిసిన విలేకరులతో అన్నారు. ఎలాంటి వివాదాలు, విమర్శలు వంటివి లేకుండా జెడ్పీ పాలన సాగిందని చెప్పారు. అధికారం ఉన్నా, లేకపోయినా భవిష్యత్తులోనూ అందరం సమన్వయంగా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారి నుంచి రాజీనామాలు తీసుకోండి

- అన్ని శాఖల ప్రత్యేక సీఎస్, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, అకాడమీలు, అటానమస్ ఆర్గనైజేషన్‌లో నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న చైర్మన్‌లు, డైరెక్టర్లు, సభ్యుల నుంచి రాజీనామాలు తీసుకోవడంతో పాటు వెంటనే ఆమోదించాల్సిందిగా అన్ని శాఖల ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఆ వివరాల నివేదికను సమర్పించాలని శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

మాజీ సీఎస్ జవహర్‌రెడ్డికి 27 వరకు ఆర్జిత సెలవు

- నూతన సీఎస్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి ఈ నెల 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ.. అనగా 21 రోజుల పాటు ఆర్జిత సెలవు మంజూరు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ జీవోఆర్టీ సంఖ్య 1058 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. జవహర్‌రెడ్డి ఆర్జిత సెలవు మంజూరు చేయాల్సిందిగా గురువారం ప్రభుత్వానికి దరఖాస్తు చేసిన నేపథ్యంలో ఆ మేరకు అఖిల భారత లీవ్ రూల్స్ 1955 ప్రకారం ఆర్జిత సెలవు మంజూరు చేస్తూ సీఎస్ ఉత్తర్వులిచ్చారు. సెలవు అనంతరం డా.జవహర్ రెడ్డి తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా సీఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'రెడ్ బుక్' పోస్టర్లతో దాడులకు ఊతం



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత అధికారం చేపట్టక ముందే టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా దాడులకు తెగబడుతున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. ఈ హింసాత్మక దాడులకు అడ్డుకట్ట వేసేలా శ్రేణులకు దిశా నిర్దేశం చేయాల్సిన టీడీపీ నేతలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ దాడులకు ఊతమిస్తున్నారు. లోకేశ్ రెడ్‌బుక్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ రెడ్‌బుక్‌లో ఈ పేర్లు ఉన్నాయంటూ ఫ్లెక్సీలు వేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. వీటిని పరిశీలిస్తే టీడీపీ అధిష్టానమే ఈ దాడులకు పురిగొల్పుతున్నట్టుందని ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకి రావెల రాజీనామా



నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో తెలియజేశారు. గడిచిన ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా జరుగుతున్న కార్యాచరణ చివరి దశకు వచ్చిందని, ఈ సమస్య పరిష్కారానికి కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఒక పక్క సమాజ సేవ చేస్తూ, మరో పక్క ఎస్సీ వర్గీకరణ కోసం తన వంతు కృషి కూడా చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

కుర్చీలపై కన్ను!

- టీడీపీ నుంచి భారీగా ఆశావహులు
- జనసేనకు 5, బీజేపీకి 2 పదవులు
- తమకూ అవకాశం ఇవ్వాలంటున్న కొత్త ఎమ్మెల్యేలు
- కత్తిమీద సాములా మంత్రివర్గ కూర్పు



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12వ తేదీన నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయనే అంశంపై పెద్ద ఎత్తున చర్చలు సాగుతున్నాయి. టీడీపీ నుంచి 135 మంది ఎమ్మెల్యేలుగా గెలిచినందున ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. అయితే మొత్తం 24 మంత్రి పదవులే ఇచ్చే అవకాశం ఉన్నందున అందులోనే మూడు పార్టీలకు సర్దుబాటు చేయడం కత్తిమీద సాములా మారింది. జనసేనకు కనీసం ఐదు మంత్రి పదవులు దక్కుతాయనే ప్రచారం జరుగుతుండగా బీజేపీకి రెండు పదవులు ఇచ్చే అవశాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ రెండు పార్టీలకూ ఇవ్వగా మిగిలిన మంత్రి పదవులను టీడీపీ సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది.

అచ్చెన్నా..! రామ్మోహనా!

ఉమ్మడి శ్రీకాకుళం నుంచి టీడీపీ సీనియర్ నేత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి మంత్రివర్గంలో బెర్త్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది. అయితే కేంద్ర మంత్రివర్గంలో ఆయన సోదరుడి కుమారుడు రామ్మోహన్ నాయుడికి అవకాశం దక్కితే మాత్రం అచ్చెన్నాయుడికి ఛాన్స్ ఉండకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. ఒక కుటుంబంలో ఒకరికే పదవి ఇచ్చే యోచన ఉంటే వీరిలో ఒకరికే అవకాశం లభించవచ్చు. అదే జిల్లా నుంచి కూన రవికుమార్, కొండ్రు మురళీమోహన్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లా నుంచి గెలిచిన కళా వెంకట్రావు, అదితి గజపతిరాజు పేర్లు సైతం పరిశీలనలో ఉన్నాయి. విశాఖ జిల్లాలో ఈసారి గంటా శ్రీనివాసరావుకు మంత్రి పదవి దక్కకపోవచ్చని చెబుతున్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడికి కచ్చితంగా మంత్రి పదవి ఇస్తారని.. మహిళ, ఎస్సీ కోటాలో వంగలపూడి అనితకు అవకాశం లభిస్తుందనే చర్చ నడుస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలో ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకునే వీలుందని చెబుతున్నారు. సీనియర్ల అవసరం ఉందని భావిస్తే యనమల రామకృష్ణుడిని మంత్రివర్గంలోకి తీసుకోవచ్చని భావిస్తున్నారు. ఆయన కుమార్తె దివ్య తుని నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా యనమలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్నారు.

నిమ్మలకు పక్కా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడికి మంత్రివర్గంలో పక్కాగా చోటు దక్కుతుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. క్లిష్ట సమయంలో పార్టీ కోసం చురుగ్గా పని చేసి చంద్రబాబు, లోకేశ్‌కి దగ్గరవడంతో ఆయనకు అవకాశం కచ్చితంగా లభిస్తుందని చెబుతున్నారు. బీసీ కోటాలో పితాని సత్యనారాయణ పేరు బలంగా వినిపిస్తోంది. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకి మంత్రి పదవిపై రకరకాల చర్చలు సాగుతున్నాయి. ఆయన మంత్రిగా పని చేయరని పార్టీలో కొందరు చెబుతుండగా, ఇస్తే తీసుకుంటారని మరి కొందరు వాదిస్తున్నారు. చింతమనేని ప్రభాకర్ పేరు కూడా రేసులో వినిపిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి కొల్లు రవీంద్ర ఖాయంగా మంత్రి అవుతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. బీసీ నేతగా పని చేసిన అనుభవం, ప్రతిపక్షంలోనూ చురుగ్గా వ్యవహరించడంతో ఆయనకు అవకాశం ఖాయమని భావిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్ర, కన్నా లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నక్కా ఆనంద్‌బాబు పేర్లు సైతం వినిపిస్తున్నాయి. వీరిలో ఒకరికి అవకాశం లభించవచ్చని చెబుతున్నారు.

నారాయణకు మళ్లీ ఛాన్స్

ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, డి. బాలవీరాంజనేయస్వామిలో ఒకరికి మంత్రి పదవి దక్కనున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు జిల్లా నుంచి గెలిచిన వారిలో పి.నారాయణ గ్యారంటీగా మంత్రి అయ్యే ఛాన్స్ ఉంది. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయనతోపాటే ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని సమాచారం. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్లు కూడా చంద్రబాబు పరిశీలనలో ఉన్నాయి. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నానిలో ఒకరిని మంత్రిగా చేస్తారని చెబుతున్నారు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవి, వరదరాజులరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. కర్నూలు జిల్లా నుంచి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మంత్రి అవుతారని చెబుతున్నారు. అనంతపురం జిల్లా నుంచి గెలిచిన వారిలో పయ్యావుల కేశవ్, పరిటాల సునీతలో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చు. కాల్వ శ్రీనివాసుల పేరు కూడా పరిశీలనలో ఉంది.

పవన్‌కు పదవిపై అస్పష్టతే..

జనసేన నుంచి గెలిచిన 21 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురికి మంత్రివర్గంలో చోటు దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. పవన్ కళ్యాణ్‌కి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చే విషయంపై స్పష్టత రాలేదు. నాదెండ్ల మనోహర్ మంత్రివర్గంలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. కొణతాల రామకృష్ణ, పంతం నానాజీ, కందుల దుర్గేష్, పులపర్తి రామాంజనేయులు పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి.

బీజేపీ కోటాలో సుజనా

బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో చంద్రబాబుకి అత్యంత సన్నిహితుడైన సుజనా చౌదరికి మంత్రివర్గంలో చోటు పక్కాగా ఉంటుందని చెబుతున్నారు. కామినేని శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తున్నా ఎంత వరకు అవకాశం దక్కుతుందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుజనా చౌదరి పోటీలో ఉన్నందున ఆయనకు అవకాశాలు సన్నగిల్లాయి. సత్యకుమార్, విష్ణుకుమార్ రాజులో ఒకరిని మంత్రి పదవి వరించే అవకాశం ఉందని చెబుతున్నారు.

కేంద్రంలో కేబినెట్ పదవి.. 2 సహాయ శాఖలు!

- టీడీపీకి అంతకంటే ఇచ్చేందుకు సానుకూలంగా లేని బీజేపీ
- మరోసారి పౌర విమానయానమే తీసుకోవాలని సూచన
- కీలక శాఖలు, స్పీకర్ పదవికి నో.. డిప్యూటీ స్పీకరైతే సరే
- జేపీ నడ్డాతో చంద్రబాబు మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగా కొలువుదీరనున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూలు అడుగుతున్నన్ని కేబినెట్ బెర్త్‌లు, కీలక శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 16 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న టీడీపీ కోరుతున్నట్లుగా ఐదు కేబినెట్ పదవులతో పాటు స్పీకర్ పదవి ఇవ్వడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ పెద్దలు చంద్రబాబుకు తేల్చి చెప్పినట్లు సమాచారం. టీడీపీకి ఒక కేబినెట్ మంత్రిత్వ శాఖతో పాటు రెండు సహాయక మంత్రి పదవులను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాఖల కేటాయింపుపై చంద్రబాబు శుక్రవారం రెండో దఫా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఇతర పెద్దలతో చర్చించినా సానుకూల ఫలితం దక్కలేదని తెలుస్తోంది.

కీలక శాఖలు ఇవ్వలేం..!

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి కొలువుదీరనున్న మోదీ ప్రభుత్వంలో కీలకమైన హోం, ఆర్థిక, రక్షణ, రైల్వే, న్యాయ, ఐటీ, రోడ్లు, రహదారుల శాఖలను భాగస్వామ్య పక్షాలకు ఇవ్వకూడదని ఇప్పటికే బీజేపీ పెద్దలు నిరాకరించారు. దీంతో కేంద్ర జలశక్తి శాఖతో పాటు పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్లు, నౌకాయాన శాఖలను టీడీపీ కోరినట్లు తెలిసింది. దీనికి అదనంగా స్పీకర్ పదవి కూడా తమకే ఇవ్వాలని అడిగినట్లు జాతీయ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే బీజేపీ పెద్దలు ఇందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. 2014లో మాదిరిగానే పౌర విమానయాన శాఖతో పాటు సహాయ శాఖల్లో కీలక శాఖలు ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఆ కీలక సహాయ శాఖలు ఆర్థిక లేదా జల శక్తి శాఖ కావచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. స్పీకర్ పదవి కాకుండా డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు బీజేపీ పెద్దలు సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. 2019లో ఎన్‌డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని అసలు కేటాయించలేదు. కేవలం స్పీకర్‌తోనే లోక్‌సభ వ్యవహారాలను నిర్వహించగా ప్రొటెం స్పీకర్‌లతో సభను నడిపించారు. 2014లో మాత్రం అన్నాడీఎంకేకు చెందిన తంబిదొరై, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత కరియా ముండా డిప్యూటీ స్పీకర్లుగా వ్యవహరించారు.

మోదీతోపాటే ప్రమాణం..!

మంత్రి పదవులు, శాఖలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు విడిగా చర్చించారు. ప్రాధాన్యతలను ఆయన దృష్టికి తెచ్చారు. నరేంద్ర మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల్లో తమ పార్టీ వారు కచ్చితంగా ఉండేలా చూడాలని కోరినట్లు తెలిసింది.

రేపు ఏపీ లాసెట్-2024


ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్-2024 పరీక్షలను ఈ నెల 9న మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ లాసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లా కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఏపీ లాసెట్‌కు 23,425 దరఖాస్తులు వచ్చాయన్నారు. పురుషులు 15,374 మంది, మహిళలు 8,051 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులు https://cets. apsche.ap.gov.in ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తోపాటు ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తేవాలన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను జూన్ 9న మధ్యాహ్నం 1.00 నుంచి 2.30 గంటల వరకు అనుమతిస్తామన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో
నీట్-పీజీ మాక్ టెస్ట్!



సాక్షి, హైదరాబాద్: జనరల్ మెడిసిన్, రేడియాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, అనస్థీషియాలజీ మొదలైన స్పెషలైజేషన్లలో వారి భవిష్యత్ కెరీర్‌లకు పునాది వేయడానికి ఔత్సాహిక వైద్యులకు నీట్-పీజీ చాలా కీలకమైన పరీక్ష. పీజీ మెడికల్ స్టడీస్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ, సాక్షి మీడియా గ్రూప్ జూన్ 16, 2024న.. విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో నీట్-పీజీ మాక్ పరీక్షను నిర్వహిస్తోంది. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, మరింత మెరుగుపరచుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ క్లినికల్ నాలెడ్జ్, ఎగ్జామ్-టేకింగ్ స్ట్రాటజీలను పదును పెట్టడంలో సహాయపడటమే కాకుండా, నిజమైన నీట్-పీజీలో రాణించడానికి అభ్యర్థుల సన్నద్ధతను నిర్ధారిస్తుంది. ఈ మాక్ పరీక్షకు 'మై ర్యాంక్' టెక్నాలజీ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి https://www.arenaone.in/mock/neetpg ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లాగిన్ హాల్ టికెట్ నెంబర్, పాస్వర్డ్ పరీక్షకు రెండు రోజుల ముందు అభ్యర్థి రిజిస్టర్ చేసుకున్న ఈ-మెయిల్ ఐడీ/ఫోన్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. మాక్ పరీక్ష ఆన్‌లైన్‌లో https://sakshimocktest.myr-ank.co.in లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. పరీక్ష సమయం మూడు గంటల 30 నిముషాలు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా మీరు చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 99126 71555, 96660 13544, 96665 72244.

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవికి నాగిరెడ్డి రాజీనామా



గోస్పాడు/అనకాపల్లి: రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవికి నంద్యాల జిల్లా గోస్పాడుకు చెందిన పి.పి.నాగిరెడ్డి రాజీనామా చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పి.పి.నాగిరెడ్డికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవి దక్కింది. దాదాపు మూడేళ్లపాటు ఆయన చైర్మన్ పదవిలో కొనసాగారు. ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో పదవికి రాజీనామా చేశారు. ఆయనకు కేటాయించిన వాహనాన్ని, రాజీనామా పత్రాలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్ బాబుకు అందజేశారు.

గవర కార్పొరేషన్ చైర్మన్ పదవికి 'బొడ్డేడ' రాజీనామా

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో రాష్ట్ర గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి బొడ్డేడ ప్రసాద్ రాజీనామా చేశారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఆయన శుక్రవారం రాజీనామా పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొడ్డేడ కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు దారుణం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి



రేపల్లె రూరల్: రాజకీయాల్లో ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదని.. గెలుపు, ఓటములు సర్వసాధారణమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధిపొందారన్నారు. అయినప్పటికీ ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు చూస్తే ఆశ్చర్యమేస్తోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన నాయకుల ప్రోద్బలంతో రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు పాల్పడటంతోపాటు వారి ఆస్తులకు నష్టం కలిగించటం బాధాకరమన్నారు. ప్రశాంతతకు మారుపేరైన తీర ప్రాంతం రేపల్లెలోనూ దాడులకు పాల్పడటం హేయమన్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత ప్రతిఒక్కరూ స్నేహపూరిత వాతావరణంలో జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని మోపిదేవి కోరారు. టీడీపీ నాయకులు సైతం తమ కార్యకర్తలను రెచ్చగొట్టే కార్యక్రమాలను మానుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తాను, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, పార్టీ మళ్లీ బలోపేతమౌతుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

మా ఓట్లు ఏమయ్యాయి?

హైదరాబాద్‌లో ఏపీ యువకుడి నిరసన



వెంగళరావునగర్: ఆంధ్రప్రదేశ్‌లో తాము వైఎస్సార్‌సీపీకి వేసిన ఓట్లు ఏమయ్యాయో విచారించాలని మహేందర్ అనే యువకుడు హైదరాబాద్ వెంగళరావునగర్ డివిజన్‌లోని కృష్ణకాంత్ పార్క్ వద్ద శుక్రవారం ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపారు. గతనెలలో జరిగిన ఎన్నికల్లో తాను నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో ఓటు వేసినట్టు చెప్పారు. ఈవీఎంలో ట్యాంపరింగ్ జరిగినట్టు తనకు అనుమానంగా ఉందని పేర్కొన్నారు. తిరిగి ఓటింగ్ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు

- 'కంచికచర్ల'కు చెందిన వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసింది. విజయవాడ ప్రసాదంపాడులోని రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కొన్ని కంప్యూటర్లు, ఫైళ్లను ఆయన ఈనెల 6వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో రహస్యంగా తీసుకెళ్లినట్లు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరుకు చెందిన గద్దె శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు సీఐడీ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ రోజు బేవరేజస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కంప్యూటర్లు, ఫైళ్లను వాసుదేవరెడ్డి తన వాహనంలోకి చేర్చి తానే డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్లినట్లు శివరామకృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంచికచర్ల మండలం మొగులూరుకు చెందిన ఆయన ఆ సమయంలో అక్కడ ఉండడంతో వాసుదేవరెడ్డి కంప్యూటర్లు, ఫైళ్లను తీసుకెళ్లినట్లు ఆయన గుర్తించారు. దీనిపై తాను ప్రశ్నించడంతో ఆయన హడావుడిగా తన వాహనంలో వేగంగా వెళ్లిపోయారని ఆయన ఆ ఫిర్యాదులో వివరించారు. ఈ నేపథ్యంలో.. శివరామకృష్ణ జూన్ 6వ తేదీ సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదుపై మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో అదే రోజు రాత్రి 11.30కు ఐజీ కేసు నమోదు చేశారు. వాసుదేవరెడ్డిపై ఐపీసీ సెక్షన్లు 427, 379 రెడ్ విత్ 120 (బి) కింద అభియోగాలు నమోదు చేసింది.

వాసుదేవరెడ్డి ఇంట్లో ఏపీ సీఐడీ తనిఖీలు

వాసుదేవరెడ్డి నివాసంలో ఏపీ సీఐడీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన సీఐడీ బృందాలు వాసుదేవరెడ్డి నివాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు నిర్వహించారు. ఆయనను పోలింగ్‌కు కొన్నిరోజుల ముందు ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే.

సీఎంవోలోని ముగ్గురు అధికారులు బదిలీ

సాక్షి, అమరావతి : గతంలో ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన ముగ్గురు ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం బదిలీ చేశారు. తదుపరి పోస్టింగ్‌ల కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక సీఎస్‌గా పనిచేస్తున్న పూనం మాలకొండయ్య, ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి నారాయణ భరత్‌గుప్తలను బదిలీ చేసి తదుపరి పోస్టింగ్ కోసం జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సీఐడీ అదనపు డీజీ, విజిలెన్స్ ఐజీ బదిలీ

సీఐడీ అదనపు డీజీ సంజయ్, విజిలెన్స్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డిలను ప్రభుత్వం శుక్రవారం బదిలీ చేసింది. వారిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. వారి స్థానాల్లో అధికారులు నియమితులయ్యేవరకు ఆ బాధ్యతలను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పర్యవేక్షిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలపై
ఈసీ స్పందించాలి

- వీటిని ట్యాంపర్ చెయ్యొచ్చని గతంలో చంద్రబాబూ చెప్పారు
- ఆయన సాంకేతిక సలహాదారుడిగా పనిచేసిన వేమూరు హరికృష్ణప్రసాద్ చేసి చూపించారు
- గతంలో చేసిన వ్యాఖ్యలపై బాబు తన వైఖరి చెప్పాలి
- ప్రజా సంఘాల డిమాండ్

సాక్షి, అమరావతి: ఏపీ ఎన్నికల్లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈవీఎంల పనితీరుపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. విజయవాడలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు శుక్రవారం మాట్లాడుతూ.. ఈవీఎంల పనితీరుపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్పందించాలన్నారు. గతంలో ఆయన ఈవీఎంల పనితీరుపై పలు సందేహాలు వ్యక్తంచేశారని, ఈవీఎం చిప్‌లను ట్యాంపరింగ్ చేసి ప్రజా తీర్పును మార్చి వెయ్యొచ్చని.. అలాగే, ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలను ఉపయోగించడంలేదని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను కృష్ణంరాజు గుర్తుచేశారు. ఇప్పుడు ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చంద్రబాబు వైఖరి ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు సాంకేతిక సలహాదారుడిగా పనిచేసిన వేమూరు హరికృష్ణ ప్రసాద్ తన అమెరికన్ మిత్రులు అలెక్స్ హాల్డార్ మెన్, రాస్‌గోమ్ గ్రీస్ సహకారంతో ఎన్నికల సంఘం నుంచి దొంగిలించిన ఈవీఎంను బహిరంగంగానే హ్యాక్‌చేసి చూపించారన్నారు. ఈవీఎం దొంగతనం ఆరోపణపై హరికృష్ణ ప్రసాద్ అరెస్టు కూడా అయ్యారన్నారు. ప్రజాతీర్పు ఏకపక్షంగా, మెజార్టీలు అత్యధికంగా ఉండటంతో ప్రజల్లో ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

బాబు విదేశీ పర్యటనపై అనుమానాలు..

బెటర్ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ సునీత లక్కంరాజు మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూముల్లో ఉన్న అన్ని ఈవీఎంలను ఒకేసారి హ్యాక్ చేయవచ్చునని కూడా హరికృష్ణ ప్రసాద్ చెప్పారన్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు విదేశీ పర్యటనలపై కూడా ప్రజలకు అనేక సందేహాలున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. ఆంధ్ర అడ్వకేట్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వివరణ ఇవ్వకపోతే తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పౌర సంఘాల ప్రతినిధులు తెలిపారు.

గన్నవరం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారం

- 12న ఉదయం 11.37 గంటలకు ముహూర్తం
- ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు సీఎంలు వచ్చే అవకాశం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు ఆ రోజు ఉదయం 11.37 గంటలకు ముహూర్తం ఖరారు చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకార సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయేలోని కీలక నేతలు హాజరవుతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి: చంద్రబాబు

సాక్షి, అమరావతి : ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలపై చంద్రబాబు ఆరా తీసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఘర్షణలపై పార్టీ నేతల ద్వారా ఆయన సమాచారం తెప్పించుకున్నట్లు పేర్కొన్నాయి. టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని, వైఎస్సార్‌సీపీ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. దాడులు, ప్రతి దాడులు జరగకుండా చూడాలని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ఆదేశించారు. పోలీసు అధికారులు సైతం శాంతి భద్రతలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఎంపీ, ఎమ్మెల్యేల కలయిక



కుమారనాయక్‌ను అభినందిస్తున్న రాజా వేణుగోపాల నాయక్

రాయచూరు రూరల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాయచూరు, యాదగిరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన మాజీ ఐఏఎస్ అధికారి కుమార నాయక్, యాదగిరి జిల్లా సురపుర విధానసభ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి రాజా వేణుగోపాల నాయక్ శుక్రవారం పరస్పరం ఒకరినొకరు కలుసుకొని కరచాలనం చేసుకున్నారు. ఇకపై నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్ద పీట వేద్దామని చర్చించుకున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు సిద్ధం



పుస్తకాలను పరిశీలిస్తున్న బీఈఓ మల్లేశప్ప

హొసపేటె: పాఠశాల విద్యాశాఖ క్షేత్ర విద్యాశాఖాధికారి కార్యాలయంలో 2024– 25వ సంవత్సరానికి ప్రైవేట్, నాన్ ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించిన పుస్తకాల పంపిణీని ఇప్పటికే ప్రారంభించినట్లు బీఈఓ మల్లేశప్ప తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో పుస్తకాల పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ విభాగానికి ఇప్పటికే 2.24 లక్షల పుస్తకాలు అందజేయగా, 116 పాఠశాలలకు 80 శాతం పుస్తకాలు సరఫరా చేశామన్నారు. డిమాండ్ ప్రకారం దాదాపు 20 పాఠశాలలకు ఇప్పటికే పుస్తకాలు సరఫరా అయ్యాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఈ నెల 20వ తేదీ లోగా అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. విద్యాశాఖ అధికారి చెన్నబసప్ప ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు లక్షా 60 వేల పుస్తకాలు వచ్చాయని, మరికొన్ని పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉందన్నారు. మరో వారంలోపు అన్ని పుస్తకాలు వస్తాయన్నారు.

అన్నా చెల్లెలు దుర్మరణం



మరణించిన వెంకటేష్, అంబిక(ఫైల్)

రాయచూరు రూరల్: సోదరి మరణ వార్త విని సోదరుడు మరణించిన ఘటన రాయచూరు జిల్లాలో చోటు చేసుకుంది. దేవదుర్గ తాలూకా శావంతగల్‌లో అనారోగ్యం బారిన పడిన అంబిక(14)ను గురువారం రాత్రి సిరవార ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక పోవడంతో శుక్రవారం మరణించింది. చెల్లెలి మరణ వార్త విన్న సోదరుడు వెంకటేష్(17) గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇద్దరు మరణించడంతో ఆ గ్రామంలో పెను విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి



తులసి(ఫైల్)

హొసపేటె: విద్యుదాఘాతంతో ఓ బాలిక మృతి చెందిన ఘటన విజయ నగర జిల్లా కూడ్లిగి తాలూకా కత్రికెహట్టి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. వివరాలు..గ్రామానికి చెందిన విద్యార్థిని తులసి(8) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి చేతిలో గోరు ముద్దలు తిన్న బాలిక ఆనందంగా బ్యాగ్ ఎత్తుకుని స్కూల్‌కు వెళ్లింది. పొద్దున్నే స్కూల్‌కి వెళ్లి తిరిగి ఆడుతూ పాడుతూ ఇంటికి వచ్చే బాలిక ఆకస్మికంగా విద్యుదాఘాతానికి గురి కావడంతో గ్రామంలో విషాదం ఏర్పడింది. విద్యుదాఘాతంతో బాలిక తులసి మృతి చెందిందన్న వార్త తెలియగానే గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ ఎరియప్ప సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కూడ్లిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి

హుబ్లీ: గదగ్ జిల్లా నరగుంద తాలూకా బైరనహట్టి రోడ్డులోని బండమ్మ నగర వద్ద పిడుగు పాటుకు గురై గొర్రెలు కాస్తున్న ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా అతని సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. నరగుందలోని హొరకేరి గుండడకేరి లేఅవుట్ నివాసి అయిన యల్లప్ప హనుమంతప్ప అనే బాలుడు మృతుడు కాగా అతడి సోదరుడు పరుశప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి నరగుంద ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పొలంలో గొర్రెలు మేపుతుండగా వర్షం కురిసింది. వాన నుంచి రక్షణ కోసం చెట్టు కిందకు చేరగా పిడుగు పడింది. సమాచారం అందగానే ఘటన స్థలాన్ని నరగుంద సీపీఐ మంజునాథ్, తహసీల్దార్ శ్రీశైల తళవార్, ఆర్‌ఐ పరిశీలించారు. నరగుంద చుట్టు పక్కల ఓ గంట పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.



దుర్గమ్మగుడి అండర్ బ్రిడ్జిలో మోకాలిలోతు నీటిలో నిలిచిపోయిన బస్సులు



బళ్లారిలో వర్షపు నీటితో నిండిన తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

ముంచెత్తిన భారీ వర్షం

- దుర్గమ్మగుడి అండర్ బ్రిడ్జి జలమయం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- రెండు గంటలకు పైగా కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన విద్యుత్ సరఫరా

సాక్షి బళ్లారి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వరుణుడు దంచికొట్టాడు. శుక్రవారం మధ్యాహ్నం ఉన్నఫళంగా ఉరుములు మెరుపులతో కూడిన కుంభవర్షం కురిసింది. రెండేళ్లుగా బళ్లారిలో ఇంత భారీ వర్షం కురవడం ఇదే మొదటిసారి. నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి దుర్గమ్మగుడి వైపునకు వెళ్లే అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బస్సులు ఆగిపోయే విధంగా అండర్ బ్రిడ్జిలో మోకాలి లోతున నీరు చేరాయంటే ఎంతో పెద్ద వర్షం వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే సత్యనారాయణ పేట అండర్ బ్రిడ్జిలో కూడా వర్షం నీరు నిండిపోయింది. నిత్యం జనంతో రద్దీగా ఉండే తహసీల్దార్ కార్యాలయం ఆవరణమంతా జలమయమైంది. రాయల్ సర్కిల్ ఎదురుగా ప్రధాన రోడ్లలో వ్యాపారాలు చేసుకొనే స్థలంలో వరద ప్రవాహంలా వర్షపు నీరు దూసుకొచ్చింది. విశాల్ నగర్, పటేల్ నగర్, కణేకల్ బస్టాండు, కౌల్‌బజార్, రేణుకానగర్ తదితర కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నీటిని తోడేందుకు ఆయా గృహ యజమానులు నానా అవస్థలు పడ్డారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి ఈదురు గాలులతో కుంభ వర్షం కురవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉన్నఫళంగా వర్షం కురవడంతో రోడ్లపై వెళ్తున్న వారు తడిసిముద్దయ్యారు. బళ్లారితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

భారీ వర్షంతో రోడ్లు అధ్వానం

రాయచూరు రూరల్: జిల్లాలో శుక్రవారం జడివానతో కూడిన 52.72 మి.మీ.ల భారీ వర్షం కురిసింది. ఎక్కడ చూసినా రహదారులు బురదగుంటలుగా మారాయి. రాయచూరులో 28 మి.మీ, యరగేరలో 29.5 మి.మీ., లింగసూగూరులో 93.5 మి.మీ, మాన్విలో 62 మి.మీ, దేవదుర్గలో 23.5 మి.మీటర్ల వర్షం పడింది. మున్నూరువాడి, గాంధీ చౌక్, మహావీర్ చౌక్, కూరగాయల మార్కెట్‌లో వర్షపు నీరు నిలిచాయి.

వణికించిన కుంభవృష్టి

శ్రీనివాసపురం : పట్టణంలో శుక్రవారం కురిసిన భారీ వానకు జనజీవనం అస్తవ్యస్తమైంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన వాన దాదాపు రెండు గంటలకు పైగా కురిసింది. భారీ వానతో రోడ్డుపై నీరు నిలవడంతో పాటుగా పలు ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లే ఇలా నీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి చేరుతోందని పట్టణ ప్రజలు పురసభ అధికారులు, ప్రజా ప్రతినిధులను శాపనార్థాలు పెట్టారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు బస్సుల కోసం వడిగాపులు కాయాల్సి వచ్చింది. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకోవడం వల్ల మురుగు నీరు సక్రమంగా వెళ్లక రోడ్డుపైకి చేరి ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారికి, పాదచారులకు నరకయాతన ఎదురైంది. అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి వర్షం నీరు సక్రమంగా వెళ్లేలా చేయాలని పట్టణ వాసులు డిమాండ్ చేశారు.



వర్షంలో తడుచుకుంటూ వెళ్తున్న నగర ప్రజలు



శ్రీనివాసపురంలో భారీవానతో రోడ్డుపైన నిలిచిన నీరు



రాయచూరులో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఇంట్లోకి చేరిన నీటిని తోడుతున్న మహిళ

యువతీ యువకుల పోట్లాట వైరల్



యువతీ యువకుల మధ్య జరిగిన పోట్లాట దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో యువతీ యువకుల మధ్య సినిమా ఫక్కీలో పోట్లాట జరిగింది. గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్ రోడ్డులోని లోకాయుక్త కార్యాలయం వద్ద గుర్తు తెలియని జంట ఒకరినొకరు కొట్టుకున్న వీడియో వైరల్ అయింది. ప్రజలు చూస్తుండగానే యువతి యువకుడిని కొట్టడం, తన్నడం చేస్తున్నా వారిని విడిపించడానికి ఒక్కరూ సహకరించక పోవడం గమనార్హం.

'ఈశాన్య' ఎమ్మెల్సీ హస్తగతం



చంద్రశేఖర్ పాటిల్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక పరిధిలో బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయ నగర జిల్లాలతో కూడిన ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ గెలుపొందారు. గురువారం కలబుర్గిలో జరిగిన ఓట్ల లెక్కింపు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. బీజేపీ నుంచి మాజీ విధాన పరిషత్ సభ్యుడు అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ నుంచి విధాన పరిషత్ సభ్యుడు చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థిగా నారా ప్రతాప్ రెడ్డి పోటీ పడిన సంగతి విదితమే. మొదటి రౌండ్‌లో స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి 333 ఓట్లతో ముందంజలోకి వచ్చారు. తరువాత బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ 4 వేల ఓట్లతో ముందంజలోకి వచ్చారు. శుక్రవారం తెల్లవారు జామున ఓట్ల లెక్కింపులో చివరకు కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్‌కు 39,496 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్‌కు 35,050 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్ రెడ్డికి 17,421 ఓట్లు లభించాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ తన సమీప ప్రత్యర్థిపై 4,446 ఓట్లతో రెండోసారి విజయం సాధించారు.

22 నుంచి అఖిల భారత చదరంగం పోటీలు

హుబ్లీ: హుబ్లీ ఉత్తర రోటరీ క్లబ్, కేఎల్ఈ సాంకేతిక విశ్వవిద్యాలయం, ధార్వాడ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో బీవీబీ కళాశాలలోని డాక్టర్ ప్రభాకర్ కోరె ఇండోర్ స్టేడియంలో అఖిల భారత ఓపెన్ వైడ్ రేటింగ్ ర్యాపిడ్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రాయోజకులు నాగరాజ్ శెట్టి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అండర్–8, అండర్–10, అండర్–12, అండర్–14 పరిధిలోని బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. 5 అగ్ర స్థానాల ఆధారంగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. జూనియర్, సీనియర్ ఆటగాళ్లను గుర్తిస్తామన్నారు. పోటీల్లో మొత్తం రూ.2 లక్షల నగదు బహుమతి, 75 ట్రోఫీలను అందజేస్తామన్నారు. తొలి 30 స్థానాలకు ముఖ్యబహుమతి ఉంటుందన్నారు. మొదటి స్థానానికి రూ.35 వేలు, ఉత్తమ మహిళా క్రీడాకారిణి, ఉత్తమ ధార్వాడ జిల్లా క్రీడాకారుడు, హుబ్లీ అత్యుత్తత క్రీడాకారిణి అవార్డులు అందజేస్తామన్నారు. నియమాల మేరకు ఆసక్తి గలవారు నాగరాజ్ శెట్టి- 9611979743 నెంబరులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో కేఎల్ఈ సాంకేతిక వీసీ బసవరాజ్ అనామి, డాక్టర్ అరవింద ఏరి, శ్రీనివాస్, ఇంద్రాలి, విజయ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి.. బంగారు ఆభరణాల చోరీ

హుబ్లీ: ఇంట్లో ఉన్న వారిపై దాడి చేసిన నలుగురు దోపిడీ దొంగలు బంగారు ఆభరణాలను దోచుకున్న ఘటన ధార్వాడ నవలూరు శివారు ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. అశోక్ కదం, ఆయన భార్య లలిత దాడికి గురైన వారు. ఇంట్లో ఉన్న వీరిపై దాడి చేసిన దుండగులు 100 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తలుపుకొట్టి లోపలకు చొరబడ్డ నలుగురు దుండగులు ఇనుపరాడ్లతో ఇంట్లో ఉన్న వారిపై దాడి చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకొని పరారయ్యారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. వేలిముద్రల నిపుణులు, డాగ్‌స్క్వాడ్‌తో దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని విద్యాగిరి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సీఎం, డీసీఎంలతో ఎమ్మెల్సీల భేటీ



ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిసిన నూతన ఎమ్మెల్సీలు బోసురాజు, వసంతకుమార్



ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌ను కలిసిన మంత్రి దంపతులు

రాయచూరు రూరల్: విధాన పరిషత్ నూతన సభ్యులుగా కాంగ్రెస్ నుంచి ఎంపికైన మంత్రి ఎన్ఎస్ బోసురాజు, పార్టీ కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ నేపథ్యంలో విధాన పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని సమస్యలపై స్పందించాలని వారికి నేతలు సూచించారు.

రెండో సారీ దక్కని ఎమ్మెల్సీ పట్టం

- పరిషత్ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థికే విజయం
- నారా ప్రతాప్‌రెడ్డి గట్టి ప్రయత్నం చేసినా ఫలితం శూన్యం



నారా ప్రతాప్‌రెడ్డి

సాక్షి, బళ్లారి: ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విధాన పరిషత్ ఎన్నికల్లో గెలవాలనే దృఢ సంకల్పంతో నారా ప్రతాప్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు రోజులుగా కలబుర్గి నగరంలో జరిగిన విధాన పరిషత్ ఓట్ల లెక్కింపులో ఉత్కంఠభరితంగా కొనసాగింది. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ రెండో సారి కూడా ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌పై 4,651 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బళ్లారి, రాయచూరు, కొప్పళ, యాదగిరి, బీదర్, విజయనగర జిల్లాల పరిధిలో ఓటర్లు తమ ఓటు హక్కును ఈ నెల 4వ తేదీన వినియోగించుకున్న సంగతి తెలిసిందే. గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు రెండు రోజులుగా ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో చంద్రశేఖర్ పాటిల్‌కు 39,496 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌కు 35.050 ఓట్లు, బళ్లారికి చెందిన స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డికి 17,421 ఓట్లు దక్కాయి. గత విధాన పరిషత్ ఎన్నికల్లో కూడా నారా ప్రతాప్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ సారి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలో తనకు ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం తరపున కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని విన్నవించారు. అయితే కాంగ్రెస్ సభ్యులు చంద్రశేఖర్ పాటిల్‌కు కాంగ్రెస్ టికెట్ కేటాయించడంతో నారా ప్రతాప్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. నెల రోజుల నుంచి 7 జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లతో మమేకమై తీవ్రంగా ప్రచారం చేశారు. పరిషత్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఏర్పడింది. కానీ తుది ఫలితాలు వెలువడిన తర్వాత రెండో సారి కూడా నారా ప్రతాప్‌రెడ్డికి ఎదురు దెబ్బ తగిలింది.

మండలి అధ్యక్షుడి రాజీనామాకు డిమాండ్



మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతికి బాధ్యతగా మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ రాజీనామా చేయాలని జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారుల ఆత్మహత్యలకు ప్రజాప్రతినిధులే కారణమన్నారు. నిధుల దుర్వినియోగానికి తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జి, మంత్రి ఎన్ఎస్ బోసురాజు ప్రధాన కారణమని ఆరోపించారు. మంత్రి నాగేంద్ర పీఏలు నాగరాజ్, నాగేశ్వరరావు గత మార్చి 5 నుంచి 23 వరకు బెంగళూరు వసంత్ నగర్ యూనియన్ బ్యాంక్ నుంచి ఎంజీ రోడ్డు బ్యాంక్‌లో కొత్త ఖాతాలను ప్రారంభించి 14 మంది గుర్తు తెలియని వారి ఖాతాలకు వర్చువల్‌గా నిధులను మళ్లించి రూ.94.73 కోట్లు డ్రా చేసుకున్నారన్నారు. నిధుల స్వాహాపై సీబీఐతో విచారణ జరపాలన్నారు. మంత్రి బోసురాజు, గ్రామీణ ఎమ్మెల్యే, మండలి అధ్యక్షుడు బసనగౌడలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. నరసింహ నాయక్, శివశంకర్, రామకృష్ణ, లక్ష్మిపతి, నాగరాజ్ లున్నారు.

ఉత్తరాఖండ్ మృతుల్లో ఇంజినీర్ దంపతులు

హుబ్లీ: ఉత్తరాఖండ్‌లో పర్వతారోహణకు వెళ్లిన సందర్భంలో ఇటీవల మృతి చెందిన 9 మందిలో ఇద్దరిని హుబ్లీ వాసులుగా గుర్తించారు. ఉణకల్‌కు చెందిన ఇంజినీర్లు వినాయక్ ముంగరవాడి, సుజాత అనే దంపతులు మృతులు. రాష్ట్రం నుంచి పర్వతారోహణకు వెళ్లిన 22 మంది బృందంలో వినాయక్, సుజాత దంపతులు కూడా ఉన్నారు. వీరిద్దరూ హుబ్లీ బీవీబీ ఇంజినీరింగ్ కళాశాలలో చదివారు. వినాయక్ 1991వ బ్యాచ్ విద్యార్థి కాగా, సుజాత 1994వ బ్యాచ్ విద్యార్థిని. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇప్పుడు వీరి కుటుంబం బెంగళూరులో నివసిస్తోంది. వినాయక్ సోదరీమణులిద్దరూ హుబ్లీలో నివసిస్తున్నారు. వినాయక్ కర్ణాటక పర్వతారోహకుల అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్నారు. అంతేగాక ఉత్తర కర్ణాటక మేహలోక ట్రస్ట్ సభ్యుడు కూడా అయిన ఆయన అసోసియేషన్ తరఫున అప్పుడప్పుడు పర్వతారోహణానికి వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఉత్తరాఖండ్‌కు వెళ్లిన వేళ వాతావరణ వైపరీత్యం వల్ల జరిగిన దురంతంలో మృతులయ్యారు. ఈ దంపతుల మృతదేహాలు బెంగళూరుకు చేరుకున్నాయని తెలిసింది. అనంతరం బనశంకరి శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని వినాయక్ స్నేహితుడు గంగాధర్ వాలి తెలిపారు. కాగా బీవీబీ కళాశాల సహచరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వినాయక్ దంపతుల అకాల మృతికి సంతాపం తెలియజేశారు.

అడవుల రక్షణతో మానవాళి మనుగడ



ప్రారంభిస్తున్న ప్రముఖులు బసవరాజ్

బళ్లారిఅర్బన్: అడవులను కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమని సాంస్కృతిక కళా ట్రస్ట్, కర్ణాటక ఇతిహాస ప్రముఖులు టీహెచ్ఎం బసవరాజ్ తెలిపారు. తాలూకాలోని తాళూరు హైస్కూల్‌లో ఆయన మొక్కలను నాటి చరిత పుస్తకాలను, పెన్నులను ఆ పాఠశాల ముఖ్యోపాధ్యాయిని గీతాసాగర్‌కు అందజేసి మాట్లాడారు. మొక్కలను పెంచుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మొక్కల్లో ఔషధ గుణాలు ఉన్నాయని, అనేక రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. మనిషి స్వార్థంతో అడవులను నాశనం చేస్తున్నాడని, అందుకే వన్య, క్రూరమృగాలు .నావాసాల్లోకి వస్తున్నాయన్నారు. వృక్షాలను దైవంగా పూజించాలని, పర్యావరణ సమతుల్యత లేకపోతే అన్ని ప్రాణులకు ముప్పు తప్పదన్నారు. ఆ జీపీ అధ్యక్షుడు గాదిలింగప్ప, గ్రామ ప్రముఖులు పురుషోత్తం రెడ్డి, వెంకటరామరెడ్డి, అధికారులు తిరుమంజప్ప, పాండు, చెన్నబసవనగౌడ, సుమిత్రదేవి, శాంత, లక్ష్మీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



శోభ(ఫైల్)

బళ్లారి అర్బన్: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యా, అధ్యయన విభాగపు పూర్తి కాలపు పీహెచ్‌డీ విద్యార్థిని అయిన పీ.శోభకు ఆ వర్సిటీ పీహెచ్‌డీని ప్రకటించింది. శోభ ప్రతిపాదించిన స్టడీ ఆన్ బర్నౌట్ ఎమోషనల్ ఇంటిలిజెంట్ ఫార్మాలిటీ ఫ్యాక్టర్స్ మెటల్ హెల్త్ అండ్ జాబ్ శాటిస్‌ఫ్యాక్షన్ అమాంగ్ డిగ్రీ కాలేజీ టీచర్స్ అనే అంశానికి సంబంధించి చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ విభాగపు సహాయక అధ్యాపకులు డాక్టర్ ప్రశాంతకుమార్ మార్గదర్శకత్వంలో పరిశోధన వ్యాసం సమర్పించినందుకు గాను ఈ పట్టా అందజేసిందని ఓ ప్రకటనలో సంబంధిత అధికారులు తెలిపారు.

బాలకార్మికులకు విముక్తి కల్పించాలి



మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారిఅర్బన్: జిల్లాలో బాలకార్మికులకు విముక్తి, పునర్వసతి కల్పించాలని అదనపు జిల్లాధికారి మహమ్మద్ జుబేర్ అధికారులకు సూచించారు. ప్రపంచ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన తమ కార్యాలయంలో ఏర్పాటు ముందస్తు సమావేశంలో మాట్లాడారు. జిల్లా, తాలూకా స్థాయిల్లో ఈ దినోత్సవాన్ని పాటించాలన్నారు. ఇందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో బాల కార్మికుల నిర్మూలన పద్ధతిపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఆ రోజు విద్యార్థుల ఆధ్వర్యంలో జాగృతి జాతా చేపట్టాలని సూచించారు. నిపుణులతో ఈ కార్యక్రమంపై ప్రత్యేక ఉపన్యాస పోటీలు జరపాలన్నారు. మధ్యలో బడి మానేసిన పిల్లలందరినీ తిరిగి స్కూళ్లలో చేర్పించాలని, ఈ విషయంలో సంబంధిత అధికారులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు మౌనేష్, కమల్ షా, అల్తాఫ్ అహ్మద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా డీడీ విజయ్‌కుమార్, డీడీపీఐ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా విత్తన ప్రక్రియ

- విత్తనాలు, ఎరువుల నిల్వలు సిద్ధం
- పొలం పనిలో నిమగ్నమైన అన్నదాత



పొలంలో దుక్కి దున్నుతున్న రైతన్న



నగరంలోని ఓ రైతు భరోసా కేంద్రం



పొలంలో విత్తనాలు నాటుతున్న రైతన్నలు

హొసపేటె: తాలూకాలో తొలకరి వర్షాలు బాగా కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమి పదును కావడంతో భవిష్యత్తులో మంచి వర్షాలు కురుస్తాయని ఆశించి రైతులు విత్తనాలు నాటుతున్నారు. మే నెలలోనే పొలాల్లో గొర్రెలు, కోళ్లు, పశువుల పేడ ఎరువు వేసి పొలాలను సిద్ధం చేసి నాట్లు వేసేందుకు సన్నద్ధమయ్యారు. గత రెండు, మూడేళ్లుగా వర్షాలు కురవక పోవడంతో రైతులు పంట నష్టపోయి పనులు లేకుండా సుదూర పట్టణాలకు వలస వెళ్లారు. అయితే ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తూ వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులకు ఊరట లభించింది. వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇప్పటికే వ్యవసాయ శాఖ వద్ద నిల్వ ఉన్నాయి. అధికారిక కంపెనీల విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు అధికారులు సూచించారు. రైతు ఖాసీం మాట్లాడుతూ ఈ సారి వానాకాలం పంటగా కొర్రను విత్తుతున్నామన్నారు. విత్తనాలు, కూలీల కూలీ సొమ్ముతో కలిపి ఎకరాకు రూ.5 వేలు వరకు పెట్టుబడి అవుతోందన్నారు.

ఖరీఫ్ పనులు షురూ

రాయచూరు రూరల్: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలం పనులు మొదలు పెట్టారు. ఖరీఫ్‌లో ముందుగానే వానలు కురిశాయి. రైతులు కూడా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది 3.44 లక్షల హెక్టార్లలో విత్తనాలు వేయడానికి రంగం సిద్ధమైంది. 84 వేల హెక్టార్లలో నీటిపారుదల కాగా మిగిలిన హెక్టార్లలో ఏకదళ, ద్విదళ ధాన్యాలు, వాణిజ్య పంటలు పండించడానికి అవకాశం ఉంది. జిల్లాలో 1.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా కేఎస్ఎంఎఫ్‌లో 7393 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాల్లో 738.10 మెట్రిక్ టన్నులు ఉంది. 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత ఉంది. ఖరీఫ్‌కు సరిపడా ఎరువులు నిల్వ ఉందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవిక వెల్లడించారు. జిల్లాలోని 35 రైతు కేంద్రాల్లో రైతులకు ఎరువులు, క్రిమి సంహారక మందులు నిల్వ ఉన్నాయని తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగ పరుచుకోవాలని కేంద్రం ప్రత్యేక అధికారి నాగిరెడ్డి పేర్కొన్నారు.